www.andhrajyothy.com
విజయవాడ సిటీ*

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14 + 16
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 238
వెల (Price) : Rs. 6.50

శుక్రవారం | 13-12-2019

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ. 9.57 తదుపరి విదియ; నక్షత్రం: ఆరుద్ర తె. 5.51 తదుపరి పునర్వసు; వర్జ్యం: మ. 2.33-4.07; దుర్ముహూర్తం: ఉ. 8.52-9.36, మ. 12.31-1.15; అమృతఘడియలు: రా. 8.02 -9.36; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.40; సూర్యాస్తమయం: 5.39

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai






- అనారోగ్యంతో చెన్నైలో తుదిశ్వాస
- ఏడాదిన్నర క్రితం కేన్సర్‌కు చికిత్స
- గత నెలలో మళ్లీ ఆస్పత్రిలో చేరిక
- అప్పట్నుంచీ క్షీణిస్తూ వచ్చిన ఆరోగ్యం
- ఎల్లుండి చెన్నైలో అంత్యక్రియలు
- సినీ, రాజకీయ ప్రముఖుల సంతాపం

# గొల్లపూడి ఇక లేరు

చెన్నై, విజయనగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదునైన కలంతో అద్భుతమైన నవలలు, నాటకాలను రచించిన సాహితీ వేత్త... 'గద్ద ముక్కు పంతులు'గా సినీ ప్రేక్షకులను అలరించిన గొప్ప నటుడు గొల్లపూడి మారుతీరావు ఇక లేరు! 'సాయంకాలమైంది' నవలతో సాహితీప్రియుల మనసు చూరగొన్న ఆయన.. ఎనిమిది పదుల నిండు వయసులో కన్నుమూశారు. గొల్లపూడి మారుతీరావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఒకబ్బాయి శ్రీనివాస్ తన తొలి సినిమాకు దర్శకత్వం వహిస్తూ ప్రమాదవశాత్తూ చిన్నవయసులోనే

మిగతా 2వ పేజీలో...

## 10 మెడ మీద కత్తి పెడితే ఎలా?

సీపీఎస్ రద్దుపై నిలదీసిన టీడీపీకి మంత్రి బుగ్గన జవాబు



# సిగ్గు.. సిగ్గు!

## తలదించుకో: సీఎం జగన్

## మీరే తలదించుకోవాలి: బాబు

## సభలో పరస్పర ఆగ్రహావేశాలు



ఆంగ్లంపై చర్చలో రచ్చ.. పత్రికలు, వైఖరులపై వాగ్వాదం

- ఇంగ్లీషు మీడియానికి ఓకే
- ఎప్పుడూ వ్యతిరేకించలేదు
- తెలుగు మీడియమూ ఉండాలి
- 2016లో ఇంగ్లీషుకు శ్రీకారం చుట్టిందే మేము
- కానీ... 'సాక్షి'లో ఎందుకు వ్యతిరేకించారు?: బాబు
- మీడియాకో వైఖరి ఉంటుంది
- నేను వ్యక్తిగతంగా ఇంగ్లీషును వ్యతిరేకించానా?: జగన్

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మీరేం చేశారు... మేమేం చేశాం? అప్పుడేమన్నారు... ఇప్పుడేమంటున్నారు? ఏ పత్రిక ఏం రాసింది? ప్రశ్నలు, ఆరోపణలు-ప్రత్యారోపణలు, వాదోపవాదాలు... అంతకుమించి పరుషమైన పదజాలంతో వ్యక్తిగత విమర్శలు!

ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని ఎత్తివేసి... ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడంపై గురువారం శాసనసభలో వాడీవేడి

మిగతా 11వ పేజీలో...

మార్షల్స్ ఓవరాక్షన్ 10

మాకూ ఓ రోజొస్తుంది..

# మీరు భస్మీపటలమే 2



దీక్ష చేస్తున్న పవన్‌కు సంఘీభావం తెలుపుతున్న వృద్ధురాలు

- రాజులెందరో కాలగర్భంలో కలిసిపోయారు
- కార్మికులను కూల్చారు.. రైతులను కూడా..
- ఇదే కొనసాగితే మీరూ కూలిపోతారు
- కాకినాడ రైతు దీక్షలో జగన్‌పై పవన్ ఫైర్

# కక్ష కొద్దీ శిక్ష!

## ఈడీబీ మాజీ సీఈవో కృష్ణకిశోర్ సస్పెన్షన్



- నాడు జగతి కేసులో అక్రమాల నిర్ధారణ
- నేడు జగన్ సర్కారు చేతిలో సస్పెన్షన్
- ఐఆర్ఎస్ అధికారిపై అనూహ్య చర్యలు
- ఏసీబీ, సీఐడీ విచారణకు నిర్ణయం 11



## అసోం అగ్నిగుండం

- పోలీసు కాల్పుల్లో ముగ్గురి మృతి
- కర్ఫ్యూను లెక్క చేయని జనం
- వేలాదిగా రోడ్లపైకి
- బీజేపీ, ఏజీపీ ఆఫీసులపై దాడి
- ఎమ్మెల్యే ఇంటికి నిప్పు 12
- కాళ్లు విరగ్గొట్టి పంపిస్తాం
- అసోమేతరులకు హెచ్చరికలు
- త్రిపురలోనూ ఆగని ఆందోళనలు
- వలసదారులపై మూకదాడులు

## త్రిసభ్య కమిషన్ 12

దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీం సంచలన ఆదేశం

## అయోధ్య రాముడిదే

- ఆ తీర్పే అంతిమం! 12
- స్పష్టం చేసిన సుప్రీం
- రివ్యూ పిటిషన్లన్నీ డిస్మిస్














పరంజ్యోతి

# హితవును వ్యతిరేకిస్తే పతనమే

సర్వేశ్వరుని అనుగ్రహంతో జ్ఞాన సంపదను సాధించి నవారు.. తప్పుదారిలో నడిచేవారిని మంచిదారికి మళ్లించడానికి చేసే ప్రయత్నమనే చక్కని ఆధ్యాత్మిక ఆయుధం హితవు. అలాంటి హితవును తృణీకరించి చెడిపోతారు కొందరు. మరికొందరేమో.. పెద్దలు తమ హితవు కోరి చెప్పిన మాటలు విని, బతుకును పావనం చేసుకుంటారు. శ్రీరామచంద్రుని వాగ్దానంతో రెండవసారి సుగ్రీవుడు వాలితో పోరు సల్పడానికి పూనుకొన్నాడు. బహుపరాక్రమశాలి అయిన వాలి.. తన సోదరుడిపై ఆగ్రహంతో యుద్ధానికి బయల్దేరగా ఆయన అర్ధాంగి వారించింది. "ప్రాణేశ్వరా! ఇప్పుడే పలాయనం చిత్తగించిన సుగ్రీవుడు వెనువెంటనే కయ్యానికి కాలు దువ్వడంలో ఏదో మోసం ఉంది. అతనికి బలమైన అండ ఉన్నట్లుంది. ఆవేశాన్ని అణచుకో. అహాన్ని చాలించుకో. అతనితో సంధిచేసుకో" అని హితోక్తులాడింది. కానీ.. వినాశకాలం దాపురించిన వాలికి ఆ వనితామణి వచనాలు రుచించలేదు. ఆమె మాటలను తోసిరాజని యుద్ధానికి వెళ్లి రాముని బాణానికి నేలకూలాడు.

కామకావరంతో కలుషాత్ముడైన రావణుడు.. రాముని సతీమణి అయిన సీతను చెరబట్టినప్పుడు భూజాత అయిన సీత ఒక గడ్డిపోచను అడ్డంపెట్టుకొని అతడికి ఇలా హితవు పల్కింది. "రావణా! పర స్త్రీ వ్యామోహం ప్రాణాంతకం. పర స్త్రీ కౌగిలి సానబట్టిన కత్తిని కౌగిలించుకున్నట్లే. నా భర్త రాముడు లోకాభిరాముడు. భండనభీముడు. నిన్ను హతం చేస్తాడు. తప్పు ఒప్పుకొని శరణువేడుకో!" అన్నది. కానీ ఆ తల్లి హితవు చెవిటి వాని ముందు శంఖూదినట్లయింది. రావణుడు ఆమె హితవును పెడచెవిన పెట్టి.. రామబాణానికి హతుడయ్యాడు. అజ్ఞాతవాసదీక్షలో ఉన్న తనను చెరబట్టేందుకు తెగబడిన కీచకుడికి హితవు పలికేందుకు ద్రౌపది ఎంతగానో ప్రయత్నించింది.

"చను జనదని చూడక యందని ప్రాకుల పండ్లు కోయదలచుట హితమే మునుచెడిన రావణాదుల విని యెఱుగవె యెన్నడును వివేకహీనా"



"నీ దుష్ట వైఖరి.. అందనిపండ్లు ఆరగించడానికి అర్రులు సాచి విఫలమైన చందంగా ఉంది. గతంలో ఇలా దుర్నీతితో చెడిపోయిన రావణాసురుడాది గాగల వారి దుశ్చరితలు నీవు వినలేదా.. బుద్ధిహీనుడా?' అని హెచ్చరించింది. అయినా కీచకుడి మనసు మారలేదు. వాని కామకావరం కాటికేగడానికే కారణమయింది. భీముడి చేతిలో భయంకరంగా హతుడయ్యాడు. హిత వచనాలు శిరసా వహించి మంచిని సాధించిన మహాత్ములు లేకపోలేదు. పిన తల్లి అసహ్య భావానికి క్రుంగి, కృశించిన ధ్రువుడు.. తల్లి దీవెనతో నారదుని హితవు అనే సుధా మధుర మహత్తు చేస్థిర చిత్తుడై తపస్సు చేసి సత్ఫలితాన్ని సాధించాడు. ఇలా.. హితవు వినక చెడినవారు, విని బాగుపడినవారు పురాణాల్లో సాహిత్య గ్రంథాల్లో కనిపిస్తారు.

- వల్లూరు చిన్నయ్య 9948348918



# బంగారు చీరలో కన్యకాపరమేశ్వరి

మార్గశిర మాసం మూడో గురువారం విశాఖలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు బంగారు చీర, స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు తెల్లవారుజామున అర్చకులు.. అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం బంగారు చీరతో అలంకరించగా, పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

- విశాఖపట్నం

# గొల్లపూడి ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)

కన్నుమూశారు. ఇద్దరు కుమారులు రామకృష్ణ, సుబ్బారావు చెన్నైలో నివాసం ఉంటున్నారు. గొల్లపూడి మనవడు జర్మనీలో, మనవరాలు అమెరికాలో ఉండడంతో వారు వచ్చాక ఆదివారం ఉదయం చెన్నైలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన భౌతిక కాయానికి ఎంబామింగ్ చేయించి.. శనివారం మధ్యాహ్నం వరకూ ఆస్పత్రి మార్చురీలోనే ఉంచి.. ఆ తర్వాత ప్రజల సందర్శనార్థం ఇంటికి తీసుకువస్తామని వివరించారు.



2019 ఫిబ్రవరి 4న జరిగిన విజయనగరం సంగీత నృత్య కళాశాల శతజయంతి ఉత్సవాల్లో గొల్లపూడి, తనికెళ్ల భరణి

## ఏడాదిన్నరగా అనారోగ్యం..

గొల్లపూడి మారుతీరావు వయోభారం, అనారోగ్యం కారణంగా చాలాకాలంగా బాధపడుతున్నారు. ఏడాదిన్నర క్రితం.. కేన్సర్‌కు చికిత్స చేయించుకున్నారు. మళ్లీ గత నెలలో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చెన్నై కీల్పాక్‌లోని లైఫ్‌లైన్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయించారు. రెండువారాల క్రితం అనారోగ్యం తిరగబెట్టడంతో అదే ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులపాటు ట్యూబ్ ద్వారా ఆహారం అందించారు. రెండు రోజుల క్రితం ఆయన పరిస్థితి మరింత విషమంగా మారింది. చికిత్సకు ఆయన శరీరం స్పందించలేదు. చివరికి గురువారం ఉదయం మరలిరాని లోకాలకు తరలిపోయారు.

## విజయనగరంలో పుట్టి..

గొల్లపూడి మారుతీరావు 1939 ఏప్రిల్ 14న విజయనగరం పట్టణంలో అన్నపూర్ణమ్మ, సుబ్బారావు దంపతులకు జన్మించారు. ఆయన బాల్యం అక్కడే గడిచింది. విజయనగరంలోని మూడు లాంతర్లు సమీపంలోని కస్పా మునిసిపల్ పాఠశాలలో ప్రాథమికను అభ్యసించారు. ఆ తర్వాత విశాఖపట్టణానికి మకాం మార్చారు. విశాఖలోని సీబీఎం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకూ చదువుకున్నారు. విశాఖ ఏవీఎన్ కళాశాలలో ఇంటర్, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బీఎస్సీ ఆనర్స్ పూర్తిచేశారు. ఉన్నత విద్య దశలోనే నాటికలు, నాటకాలు పట్ల ఆసక్తి కనబర్చేవారు. ఆయన రచించిన 'కళ్లు' నాటకానికి సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. ఈ నాటకం ఇతివృత్తంగా తీసిన 'కళ్లు' సినిమా కూడా ప్రజల్లో విశేష ఆదరణ పొందింది. 1959లో 'ఆంధ్రప్రభ'లో ఉపసంపాదకుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అప్పట్నుంచీ.. రేడియో, సినిమా, టీవీ.. ఇలా అన్ని రకాల ప్రసార మాధ్యమాల ద్వారా తన ప్రతిభను చాటుతూ తెలుగు ప్రజలందరికీ అత్యంత ఆత్మీయుడిగా మారారు. 1961 నవంబరులో శివకామ సుందరితో ఆయన వివాహం హన్మకొండలో జరిగింది. 1963లో 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే విభాగంలో నంది అవార్డు అందుకున్నారు. 1965లో ఆత్మగౌరవం, 1989లో కళ్లు చిత్రాలకుగాను ఉత్తమ రచయితగా నంది అవార్డులు గెలుచుకున్నారు. 1981లో మాస్టారు కాపురం చిత్రానికిగాను ఉత్తమ మాటల రచయితగా నంది అవార్డు పొందారు. 1982లో ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య సినిమాతో నటుడిగా తెరంగేట్రం చేశారు. ఆ సినిమాలో తన పాత్ర గురించి ఎన్నెన్నైనా ఎంతో ఆనందంగా చెప్పుకొనేవారాయన. 'ఆ సినిమా ఇంటర్వెల్‌కే నేను స్టార్‌నయ్యాను' అని మెరిసే కళ్లతో చెప్పేవారు. ఆ సినిమా ఇచ్చిన భరోసాతోనే.. తన రేడియో ఉద్యోగానికి 1982 జూలైలో రాజీనామా చేసి 250కి పైగా చిత్రాల్లో నటించారు. 1983లో తరంగిణి సినిమాలో ఉత్తమ హాస్యనటుడిగా నంది అవార్డు, 1987లో ఉత్తమ కేరెక్టర్ ఆర్టిస్టుగా అవార్డులు అందుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'తో గొల్లపూడికి ప్రత్యేక అనుబంధం ఉంది. 'జీవన కాలమ్' పేరుతో రెండున్నర దశాబ్దాలపాటు సామాజిక సమస్యలు, రాజకీయ వ్యవహారాలపై సామాన్యులకు సైతం అర్థం అయేలా వ్యంగ్య వ్యాసాలు రాశారు.

## మనవరాళ్లంటే ఎంతో ఇష్టం

మారుతీరావు తన కుటుంబాన్ని సాహితీ కుటుంబంగా చెప్పుకోవడానికి ఇష్టపడేవారు. ఆయన కుమారుల్లో ఇద్దరు.. ఆంగ్ల సాహిత్యంలో ఎమ్మే చేశారు. వారికి మార్గదర్శి మారుతీరావే. ఇయనకు ఒక మనవడు, నలుగురు మనవరాళ్లు ఉన్నారు. మనవరాళ్లంటే ఆయనకు చాలా ఇష్టం. మారుతీరావు కుటుంబంలో దాదాపు 40 ఏళ్లు అమ్మాయిలే పుట్టకపోవడం ఇందుకు కారణం. మారుతీరావు తోబుట్టువులంతా అబ్బాయిలే కాగా.. ఆయనకూ ముగ్గురు అబ్బాయిలే పుట్టడంతో, మనవరాళ్ల మీద అంతులేని ప్రేమ చూపేవారు. వారి కంట్లో నీళ్లు చూస్తే ఆయన కూడా ఏడ్చేసేవారు.

## కుమారుడి జ్ఞాపకార్థం..

చిన్నవయసులోనే తమకు దూరమైన కుమారుడు గొల్లపూడి శ్రీనివాస్ స్మారకార్థం ఏటా ఒక కొత్త దర్శకుడికి 'గొల్లపూడి శ్రీనివాస్ జాతీయ పురస్కారం' అందజేస్తూ... ఆ దర్శకుల్లోనే తన కుమారుణ్ని చూసుకునేవారు. శేషజీవితాన్ని చెన్నైలో, వైజాగ్‌లోనూ గడుపుతూ వచ్చారు. ఆయన మద్రాసుతో ఎంతో అవినాభావం సంబంధం ఉంది. ఇక్కడ ఎంతో మంది స్నేహితులున్నారు. వారితో కాలక్షేపం చేస్తూ, ఇష్టమైన రచనలు చేస్తూ సరదాగా గడిపేవారు.

## ప్రముఖుల నివాళి

గొల్లపూడి మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. తెలుగు సినీ రంగానికి మారుతీరావు చేసిన సేవలను కొనియాడారు. సాహితీ, సినీ రంగాల్లో గొల్లపూడి అనితర సాధ్యమైన ప్రతిభ కనబర్చారని హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ గుర్తుచేసుకున్నారు. మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, సీనియర్ నిర్మాత కాట్రగడ్డ మురారి, కాట్రగడ్డ ప్రసాద్, ఘంటసాల రత్నకుమార్, తోటకూర ప్రసాద్, టీడీపీ నేత నారా లోకేశ్ తదితర ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

# దేవాలయాల నిర్వహణ ఈవోల చేతుల్లోనా?

- ముఖ్యమైన నిర్ణయాలు ఆయనొక్కడే ఎలా తీసుకుంటాడు
- కొత్త ట్రస్టులు ఏర్పాటయ్యేవరకూ పాత ధర్మకర్తల మండళ్లే : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాలకమండళ్లు రద్దయిన దేవాలయాల నిర్వహణను ఈవోల చేతుల్లో ఎందుకు పెట్టారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ఆలయ నిర్వహణకు సంబంధించిన ముఖ్యమైన నిర్ణయాలు ఈవో ఒక్కరే ఎలా తీసుకుంటారని నిలదీసింది. తమను ఆశ్రయించిన ఆలయాల్లో కొత్త ట్రస్టులు ఏర్పాటయ్యేవరకూ పాత ధర్మకర్తల మండళ్లను కొనసాగనివ్వాలని ఆదేశించింది. తమ అనుమతి లేకుండా ఆలయాలకు కొత్త ట్రస్టుల్ని ఖరారు చేయరాదని, కానీ పాలకమండళ్ల ఎంపిక ప్రక్రియను మాత్రం కొనసాగించుకోవచ్చని మరోమారు స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఎం.వెంకటరమణతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాలయాల పాలకమండళ్లలో రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ చట్టానికి సవరణ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాల పాలక మండళ్లను కూడా రద్దుచేస్తూ వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. అయితే కాలపరిమితి ముగియకుండానే పాలకమండళ్లను రద్దు చేశారంటూ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానం ట్రస్టు సభ్యుడు శివశంకర్, నెల్లూరు రంగనాథస్వామి దేవస్థానం సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, మాచవరం దాసాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కృష్ణ, పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం చైర్మన్ అచ్యుతరావు వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. వీరి వ్యాజ్యాలపై ధర్మాసనం ముందు గురువారం మరోమారు విచారణ జరిగింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఆయా ఆలయాల ఈవోలను ఆదేశిస్తూ తదుపరి విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 13కు వాయిదా వేసింది.

# బార్ లైసెన్స్ దరఖాస్తుల గడువు పెంపు అక్రమం

- హైకోర్టులో పిటిషన్.. సోమవారానికి వాయిదా

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కొత్తబార్ల లైసెన్స్ కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పెంచడాన్ని సవాల్ చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి.. ఇరువర్గాల వాదనలు విన్నాక తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు. ముందుగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ వాదనలు వినిపిస్తూ.. గడువు పెంపు అక్రమం అని, దీనివల్ల తొలిగా దరఖాస్తు చేస్తుకున్న వారు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. దరఖాస్తుదారులు రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉందని, ఆ నగదు తిరిగి ఇవ్వబోమన్న షరతు విధించారని అన్నారు. కాబట్టి గడువు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయడంతో పాటు 6వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకున్నవారిని మాత్రమే పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని అభ్యర్థించారు. ఎక్సైజ్ శాఖ తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. గడువు లోపు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి మరో అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే గడువు పెంచామని చెప్పారు. ఇరువర్గాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈనెల 16కి వాయిదా వేశారు.

# ఆ విద్యుత్ సంస్థలపై చర్యలొద్దు : హైకోర్టు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మైత్రా ఎనర్జీ(ఇండియా) లిమిటెడ్, మైత్రా వాయు(ఇంద్రావతి) ప్రైవేట్ లిమిటెడ్, మైత్రా వాయు(తుంగభద్ర) తదితర కంపెనీలను నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ)గా ప్రకటించాలన్న ప్రయత్నాలకు హైకోర్టు బ్రేక్ వేసింది. ఆయా సంస్థలపై ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దంటూ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్(పీఎఫ్‌సీఎల్), ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ), ఎస్ బ్యాంక్‌లను ఆదేశించింది. జస్టిస్ టి.రజనీ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి రావాల్సిన బకాయిలు రాక, తీవ్ర ఆర్థిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న తమను ఆ బ్యాంకులు బెదిరిస్తున్నాయని, ఎన్‌పీఏలకు సంబంధించి నోటీసులు కూడా జారీ చేశాయంటూ పై సంస్థలు హైకోర్టుకెళ్లాయి.

# ఉల్లి.. పక్కదారి!

తాడేపల్లిగూడెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూ.25కే అందిస్తోన్న రాయితీ ఉల్లి పక్కదారి పడుతోంది. సాధారణ ప్రజలు గంటల తరబడి క్యూలో నిల్చొంటే ఒక్క కిలో మాత్రమే ఇస్తున్నారు. అయితే ఓ పార్టీ నాయకులు రైతు బజారు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి తమ సానుభూతిపరులకు రెండేసి కిలోల చొప్పున పంపిణీ చేయిస్తున్నారు. వీరు క్యూలో నిలుచోనక్కర్లేదు. రూ.50 చెల్లిస్తే.. పక్క నుంచి 2 కిలోలు సంచుల్లో పోసి ఇచ్చేస్తున్నారు. జిల్లాలోని కొన్ని రైతు బజార్లలో ఇటువంటి దందా నడుస్తోంది. మరోవైపు ప్రభుత్వ తాజా నిర్ణయం మేరకు మార్కెట్ యార్డుల్లోనూ ఉల్లి విక్రయాలకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## మాకూ ఓ రోజొస్తుంది..!

# మీరు భస్మీపటలమే

- కాకినాడ రైతు సౌభాగ్య దీక్షలో జగన్‌పై పవన్ కల్యాణ్ ఆగ్రహం

కాకినాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'త్వరలో మాకూ ఒకరోజు వస్తుంది. ఆ రోజున మీరు భస్మీపటలమవుతారు' అని జగన్ ప్రభుత్వాన్ని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఆ ఒక్క రోజూ రాకూడదని ప్రార్థించాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ పవన్ గురువారం కాకినాడలో రైతు సౌభాగ్యదీక్ష చేశారు. ఉదయం 8గంటలకు ప్రారంభించి సాయంత్రం 6 గంటలకు దీక్ష విరమించారు. అనంతరం ప్రసంగించారు. 'ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత? ఎవరైనా శుభప్రదమైన పనితో పాలన ప్రారంభిస్తారు. కానీ సీఎం జగన్ తన పాలనను ప్రజావేదిక కూల్చివేతతో మొదలుపెట్టారు. తర్వాత భవన నిర్మాణ కార్మికుల జీవితాలను కూల్చివేశారు. ఇప్పుడు రైతుల జీవితాలను కూల్చివేస్తున్నారు. ఇంతమందిని కూల్చివేస్తే చివరకు మీరూ కూలిపోతారు. చరిత్రలో ఎందరో రాజులు, చక్రవర్తులు కాలగర్భంలో కలిసిపోయారు. మీరెంత? మీ 151 మంది ఎమ్మెల్యేలెంత? వైసీపీ నేతలు అనేక చోట్ల గూండాల్లా జనసైనికులను బెదిరిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు. మాకు రావా తిట్లు..? జగన్ ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నారు. మేం ప్రభుత్వ స్కూల్లో చదువుకున్నాం. భాష ఎలా ఉంటుందో తెలుసు కదా! అవసరమైతే బాహాబాహీకి నేను సిద్ధం.'



దీక్ష చేస్తున్న పవన్ కల్యాణ్



విమానం ఆలస్యం కావడంతో ఓ కార్యకర్త ఇంటి ఆవరణలో సేదదీరుతున్న జనసేనాని

## అసెంబ్లీలో వెకిలి వేషాలు ఆపి..

'సభలో అధికార పార్టీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వెకిలి వేషాల కంటే రైతులకు మేలు చేయడంపై దృష్టిసారించాలి. జగన్‌కు శని, ఆదివారాలు సెలవులుంటాయి. నన్ను తిట్టే ఎమ్మెల్యేలకూ సెలవులుంటాయి. కానీ అన్నదాతలకు సెలవులుండవు. 365 రోజులూ పనిచేయాల్సిందే. ఉల్లి కోసం తొక్కిసలాటలేంటి? ప్రభుత్వం ఎందుకు ప్రగల్భాలు పలుకుతోంది?'

## నేను సూట్‌కేసు కంపెనీలు పెట్టలేదు..

'నేను రైతును. భూమి తల్లి బిడ్డను. సినిమా కంటే ప్రకృతిని ప్రేమిస్తా. మాకు మొగల్తూరులో 8 ఎకరాల కమతం ఉండేది. నేను స్వయంగా చిన్న మడిలో వ్యవసాయం చేశాను. అప్పుల బాధతో, ఇతరత్రా సమస్యలతో కొంచెం కొంచెంగా దాన్ని అమ్మేశాం. నాకు రైతు కష్టాలు బాగా తెలుసు. ఎందుకంటే నేను సూట్‌కేసు కంపెనీలు పెట్టలేదు. సిమెంట్ ఫ్యాక్టరీలు పెట్టలేదు. కాంట్రాక్టులు చేయలేదు. జగన్ మానవత్వమే తన మతం అంటున్నారు. అలాంటప్పుడు కౌలురైతులు ధాన్యం అమ్మేటప్పుడు వారి కులం గురించి మీరెందుకు అడుగుతున్నారు? ధాన్యంనిల్వకు గిడ్డంగులు లేవు. కానీ మద్యం నిల్వకు గోదాములున్నాయి.'

## సినిమాల కంటే ఇందులోనే సంతోషం..

'జనసేన పార్టీని ఓట్లకోసం, పదవుల కోసం పెట్టలేదు. అధికారం వస్తుందో రాదో తెలియదు. అలా ఆలోచించను. ఎన్నికల్లో ఓడిపోయాక ఎవరైనా ఆత్మస్థైర్యం కోల్పోతారు. కానీ ఏమీ ఆశించకుండా రాజకీయాల్లోకి రావడం వల్ల నా ఆత్మస్థైర్యం దెబ్బతినలేదు. సినిమాల్లో కూడా నాకు ఇప్పుడున్న ఆనందం రాలేదు. రాజకీయాల్లోనే చాలా సంతృప్తి ఉంది. సమస్యపై పోరాడి బాధితులకు న్యాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంది.'

## జనవరి నుంచి రైతు సమస్యలపై యాత్ర

జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలు తెలుసుకునేందుకు యాత్ర చేస్తా. లక్ష మంది యువ రైతులను తయారుచేయడానికి కంకణం కట్టుకున్నాం. రైతులను ఆదుకునేందుకు మేనిఫెస్టోలో రూ.5 వేల పెన్షన్ పెట్టాం. ప్రభుత్వాలు అన్నదాతలను చంపుతుంటే బతికించడానికి జనసేన ఉంది. ఇకపై అన్నదాతలకు గిట్టుబాటు ధర వద్దు.. లాభసాటి ధర కావాలి. రైతుకు పెద్దమనసుతో రుణాలివ్వాలి.'

## తెలుగుభాషపై..

పవన్‌కు ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టడం ఇష్టం లేదన్నట్టు మాట్లాడుతున్నారు. ఇంగ్లీషు మీడియం పెట్టుకోండి. కానీ తెలుగు కోసం అడగాల్సింది అడుగుతా. భాషా రక్షణకు మా పార్టీ ప్రారంభించిన 'మన నుడి-మన నది' కార్యక్రమం కొనసాగుతుంది.'

# ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు

- 2 రోజుల్లో చేపట్టేందుకు 17 బృందాల నియామకం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయి. గురు, శుక్రవారాల్లో రోజుకు 25 చొప్పున కాలేజీల్లో తనిఖీలు చేపట్టేందుకు ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ 17 బృందాలను నియమించింది. ఒక్కో టీమ్‌లో ఒక ఆడిటర్, ఇద్దరు ప్రొఫెసర్లు ఉంటారు. తొలి దశలో భాగంగా గతనెల 27-28తేదీల్లో గుంటూరు, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని 20 ఇంజనీరింగ్ కాలేజీల్లో 14 బృందాలు ఆకస్మిక తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. రెండోవిడతలో భాగంగా గురువారం కాలేజీలకు చేరుకున్న బృందాలు తనిఖీలు నిర్వహించాయి. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నిబంధనల అమలు తీరును పరిశీలించేందుకు ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చర్యలు తీసుకుంటోంది. నిబంధనలు పాటించని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ తాజాగా ఆదేశించిన నేపథ్యంలో కమిషన్ దృష్టి సారించింది.

# ఎస్కేయూలో 133 మంది ఔట్

- తొలగించిన వారంతా చిరుద్యోగులే.. స్థానిక నేతల ఒత్తిడికి లొంగిన వర్సిటీ?

ఎస్కేయూ, డిసెంబరు 12: రాష్ట్రంలో ఏ ఒక్క ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినీ తొలగించబోమన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం.. శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో అమలు కావడం లేదు. గత నాలుగేళ్లకుపైగా పని చేస్తున్న 133 మందిలో చివరి ఉద్యోగి దాకా క్రమంగా ఈ వర్సిటీ తొలగించేసింది. ఈ ఏడాది జూన్‌లో 80 మంది ఉద్యోగులను తొలగించగా... తాజాగా మరో 53 మందికి ఉద్వాసన పలికింది. నిజానికి, బోధనేతర రంగంలో పనిచేస్తున్న వీరంతా చిరుద్యోగులు. వసతి గృహాల్లో స్టీవార్డులు, డ్రైవర్లు, గార్డినర్లు, సెక్యూరిటీ గార్డులే వీరిలో ఎక్కువ. పైగా, వారికి ఆరు నెలలుగా ఏజెన్సీ వేతనాలు చెల్లించడం లేదు. ఓ ఏజెన్సీ కంపెనీ ద్వారా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఎస్కేయూ నియమించుకొంటోంది. అయితే, ఆ ఏజెన్సీ సేవలు ఇక అవసరం లేదని ఉన్నపళంగా వర్సిటీ యాజమాన్యం తేల్చిచెప్పింది. దీంతో చేసిందేమీ లేక తమ ద్వారా నియమితులైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరూ ఇక విధులకు రావద్దని ఏజెన్సీ ప్రతినిధులు అధికారికంగా సమాచారం అందించారు. కాగా, స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి మూలంగానే వారిని తొలగించారనే చర్చ సాగుతోంది. వీరిని పంపించేసి, తమ అనుయాయులకు ఆ పోస్టులు ఇప్పించుకోవాలని ఎత్తు వేశారని, దానికోసం తాత్కాలిక ఏజెన్సీని ఏర్పాటు చేసేలా వర్సిటీ యంత్రాంగాన్ని ఒప్పించినట్లు సమాచారం.

## లోకం తీరు




## చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 17.0 | 28.9 |
| గుంటూరు | 18.1 | 30.2 |
| విజయవాడ | 21.0 | 30.1 |
| ఒంగోలు | 22.3 | 31.3 |
| శ్రీకాకుళం | 23.0 | 33.0 |



## మందగమనంపై ఆందోళన లేదు

ఆర్థిక మందగమనంపై నాకేమీ అంత ఆందోళన లేదు. కొన్ని తప్పనిసరి పరిస్థితుల వల్లే జీడీపీ పురోభివృద్ధి ప్రభావితమైంది. 2008 నాటి ఆర్థిక సంక్షోభాన్నే బ్యాంకులు ఎదుర్కొనగలిగాయి. ప్రస్తుతం బ్యాంకులకు పెట్టుబడులు సమకూర్చడం తప్పేమీ కాదు.

- మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ



## 'రోడ్డు ఇంజనీరింగ్' లోపాల వల్లే ప్రమాదాలు

దేశంలో రహదారులపై పెద్ద ఎత్తున జరుగుతోన్న ప్రమాదాలకు 'రోడ్డు ఇంజనీరింగ్' లోపాలు ఓ ప్రధాన కారణం. రహదారులపై ప్రమాదాలు పదే పదే జరుగుతోన్న ప్రాంతాల్లో అందుకు కారణమవుతోన్న లోపాలను సరిచేయడానికి మా మంత్రిత్వ శాఖకు రూ.14 వేల కోట్ల బడ్జెట్ అందుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను, వాహనాలను మాత్రమే బాధ్యులను చేయలేం.

- కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ



## సంస్కృతం మాట్లాడితే మధుమేహం రాదు

అమెరికాకు చెందిన ఓ సంస్థ పరిశోధనల ప్రకారం రోజూ సంస్కృతం మాట్లాడటం వల్ల మానవ నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. కొవ్వు నియంత్రణలో ఉంటుంది. మధుమేహం రాదు. కొన్ని ఇస్లామిక్ భాషలతో సహా ప్రపంచంలోని 97% భాషలు సంస్కృతం ఆధారంగా రూపొందినవే.

-గణేశ్ సింగ్, బీజేపీ ఎంపీ

## అతి నిద్రతో వృద్ధులకు పక్షవాతం!

బీజింగ్, డిసెంబరు 12: వృద్ధులు ఒక పరిమితికి మించి నిద్రపోతే వారికి పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయాల్లో 9 గంటలు అంతకంటే ఎక్కువ, మధ్యాహ్నం గంటన్నర కంటే ఎక్కువ నిద్రపోయేవాళ్లలో, మామూలు వారితో పోల్చితే పక్షవాతం వచ్చే ముప్పు 85% ఎక్కువన్నారు. సగటున 62 ఏళ్ల వయస్సున్న 31,750 మందిపై పరిశోధనలు జరిపిన చైనా శాస్త్రవేత్తలు ఈ వివరాలను వెల్లడించారు. ఆరు సంవత్సరాల పాటు జరిపిన వారి పరిశోధనల ఫలితాలను న్యూరాలజీ అనే జర్నల్‌లో ప్రచురించారు. అయితే రోజూ 8 గంటల కంటే తక్కువ నిద్రపోవడం వల్ల కూడా ముప్పు పొంచి ఉందని చెప్పారు.

## భూప్రకంపనలను అంచనా వేసే కేబుల్ వైర్లు!

వాషింగ్టన్, డిసెంబరు 12: ల్యాండ్‌లైన్, ఇంటర్నెట్ సేవల కోసం భూగర్భంలో వేసిన కేబుల్ వైర్లు ఉరుముల శబ్దాలను, భూప్రకంపనలను కూడా గుర్తిస్తాయని అమెరికా శాస్త్రవేత్తల పరిశోధనల్లో వెల్లడైంది. తాజా పరిశోధనలతో భూగర్భ లోపలి పొరలపై మరింత లోతుగా అధ్యయనం చేయవచ్చని పరిశోధకులు తెలిపారు. సాధారణంగా ఉరుములు, ఉల్కాపాతం లాంటివి సంభవించినప్పుడు భారీ శబ్దాల కారణంగా భూమి కంపిస్తుంది. సంప్రదాయ సిస్మోమీటర్లు భూగర్భ కదలికలను 20 హెర్ట్జ్ కంటే తక్కువ పౌనపున్యం ఉన్నప్పుడు మాత్రమే గుర్తిస్తాయి. కానీ కేబుల్ వైర్లు 20-130 హెర్ట్జ్ వరకు గుర్తిస్తాయని శాస్త్రవేత్తలు చెప్పారు.

# నా పాత్ర ఉంటే ఎన్‌కౌంటర్ చేయండి

- నాడు సీబీఐ కావాలన్న జగన్... ఇప్పుడు వెనకడుగు ఎందుకు?
- వివేకాను చంపిందెవరో ఆయనకు తెలియదా?
- మాజీమంత్రి ఆదినారాయణ వ్యాఖ్యలు
- సిట్ విచారణకు హాజరు



కడప, డిసెంబరు 12: ముఖ్యమంత్రి జగన్ చిన్నాన, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో తన పాత్ర ఉందని రుజువైతే ఎక్కడైనా నడిరోడ్డులో ఎన్‌కౌంటర్ చేయండి... అని బీజేపీ నేత, మాజీమంత్రి ఆదినారాయణరెడ్డి సవాల్ విసిరారు. వివేకా హత్య కేసులో సిట్ విచారణకు గురువారం ఆయన హాజరయ్యారు. ఎస్పీ అన్బురాజన్ నేతృత్వంలోని సిట్ బృందం కడప శివార్లలోని డీటీసీలో దాదాపు గంటన్నరకుపైగా ఆదినారాయణరెడ్డిని విచారించింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 15న వివేకా హత్య జరిగిందని, ఆ సమయంలో తాను విజయవాడలో ఉన్నానన్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడని అంటారని, వివేకాను హత్య చేసిందెవరో జగన్‌కు తెలియదా? అని ఆయన ప్రశ్నించారు. 'వివేకా హత్యపై నాటి ప్రభుత్వం సిట్ వేస్తే ఈ పోలీసులపై నమ్మకం లేదు సీబీఐ విచారణ చేయాలని ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ డిమాండ్ చేశారు. మరి ఇప్పుడు ఆయనే అధికారంలో ఉన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేస్తున్నట్లు సీబీఐకి అప్పగించకుండా.. అదే సిట్‌ను ఎందుకు కొనసాగిస్తున్నారు?' అని ఆదినారాయణ నిలదీశారు. వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించింది ఆయన కుటుంబ సభ్యులు కాదా? అన్నారు. కేసును నిష్పక్షపాతంగా విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. సిట్ ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతానని తెలిపారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలైనా ఈ కేసులో పురోగతి ఎందుకు లేదని ఆదినారాయణ నిలదీశారు. కాగా.. సిట్ అధికారులు విచారణలో భాగంగా ఆదితో పాటు మరో ఇద్దరిని ప్రశ్నించారు.

# లెస్ వేస్తే తూచ్!

## సోలార్ దీపాల టెండర్లలో సిత్రాలు..

## ఈ లైట్లకు 2 కంపెనీలు లెస్ కోట్.. దేనికి ఇచ్చినా అరకోటిపైగా ఆదా

**అయినా తప్పించేసి..ప్రక్రియే రద్దు.. అమరావతి ఇన్‌ఫ్రాకి మేలుకోసం టెండర్ సంస్థలోని ఒకరి పావులు..**

**ఈ బినామీకి సర్కార్ పెద్ద అండ.. ఒకదశలో ఆఫ్‌లైన్‌కోసమూ ఎత్తు.. అది వికటించడంతో దానికి స్వస్తి**

**అయినా వేరే రూట్లో ప్రయత్నాలు.. అభ్యంతరాలు పరిశీలిస్తున్నాం: కార్పొరేషన్**

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇప్పుడు రివర్స్ టెండరింగ్ గురించిన చర్చే! ప్రాజెక్టు కాంట్రాక్టుల అప్పగింతలో గత ప్రభుత్వం కోట్లలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని, తక్కువ కోట్ చేసినవారికి వాటిని తిరిగిచ్చి, దాన్ని సరిదిద్దుతామంటూ ఈ విధానాన్ని కొత్త ప్రభుత్వం తెచ్చింది. ఇంత ఘనంగా చేపట్టిన ఈ విధానానికి ఇప్పుడు ప్రభుత్వం తాను చేపట్టే ప్రాజెక్టుల విషయంలోనే చెక్ పెడుతోంది. తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్లను తప్పుబడుతోంది. వారిని అనర్హులుగా ప్రకటించి, టెండర్ ప్రక్రియ నుంచి తప్పిస్తోంది. అస్మదీయుల కోసం అరకోటికిపైగా నిధుల వృథాకూ సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని వీధులు రాత్రుళ్లూ పట్టపగల్లా కనిపించేలా చేపట్టదలిచిన 'సోలార్ లైట్ల కాంట్రాక్టు' వెలుగులోనే ఈ కథంతా నడుస్తోంది. ఈ వ్యవహారానికి న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ లిమిటెడ్(ఎన్ఆర్ఈడీసీఏపీ) కేంద్రంగా మారిందని, ఓ ప్రభుత్వ పెద్ద కోసమే ఈ కథను నడిపిస్తున్నారని సర్వత్రా చర్చ మొదలయింది. ఆ వివరాలు.. కడప జిల్లాలోని గాలివీడు, అనంతపురం జిల్లాలోని ఎన్‌పీ కుంట, తలారీచెరువుల్లోని సోలార్ అల్ట్రా మెగా పవర్ పార్కుల్లో సోలార్ ఎల్ఈడీ స్ట్రీట్ లైట్లు ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ఈ ఏడాది జూన్‌లో మూడు టెండర్లు పిలిచింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెరిసగం వాటా ఉంది. ఈ సంస్థ 352 సోలార్ స్ట్రీట్ లైట్ల ఏర్పాటుకు ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో టెండర్లు పిలిచింది. 30 వాట్లు సామర్థ్యం ఉన్న ఒక్కో లైటు విలువ రూ.75వేలుగాను, మొత్తం టెండరు విలువ రూ.2.64 కోట్లుగాను టెండరు షెడ్యూల్‌లో పేర్కొంది. టెండరులో పేర్కొన్న అర్హతా నిబంధనలు సడలించాలంటూ గుంటూరుకు చెందిన ఓ సంస్థ కోర్టుకు వెళ్లడంతో, ఆ టెండర్లను ఏపీఎస్‌పీసీఎల్ రద్దు చేసింది. తిరిగి టెండర్లు నిర్వహించి, ఖరారు చేసే బాధ్యతను ఎన్ఆర్ఈడీసీ ఏపీకు అప్పగించింది. ఇక్కడే అసలు కథ మొదలయింది. ఈ సంస్థలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసే ఓ వ్యక్తి రంగంలోకి దిగారు. అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించే ఓ నేతతో కలిసి ఈ టెండరును దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. తాను బినామీగా ఉన్న అమరావతి ఇన్‌ఫ్రా అనే సంస్థకు కాంట్రాక్టును కట్టబెట్టాలన్న ఉద్దేశంతో ఆఫ్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించేలా ఈయన చక్రం తిప్పారు. ఆఫ్‌లైన్‌లో టెండర్లు పిలవడంపై 'రెన్యువబుల్ ఎనర్జీ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ' అభ్యంతరం తెలిపింది. ఈ ప్రొక్యూర్‌మెంట్ విధానంలోనే టెండర్లు నిర్వహించాలని, అలాగే అర్హత నిబంధనలనూ సడలించి, ఎక్కువమంది టెండరులో పాల్గొనే అవకాశం కల్పించాలని కోరింది. టెండర్ అర్హతల్లో సడలింపునకు ససేమిరా అన్న ఎన్ఆర్ఈడీసీ ఏపీ.. ఆన్‌లైన్‌లో ప్రక్రియను నిర్వహించేందుకు మాత్రం అంగీకరించింది. దీనిపై నలుగురు టెండర్లు దాఖలు చేశారు. కాకినాడకు చెందిన సోలార్ సిస్టమ్స్, హైదరాబాద్‌కు చెందిన సైరస్ సోలార్, గుంటూరుకు చెందిన అమరావతి ఇన్‌ఫ్రా, ఒంగోలుకు చెందిన ఆసియన్ టెక్నాలజీస్ టెండర్లు దాఖలుచేశాయి. వాటిలో 'సోలార్ సిస్టమ్స్' 27 శాతం తక్కువగా టెండరు దాఖలు చేసింది. అమరావతి ఇన్‌ఫ్రా సంస్థకు అది దెబ్బగా మారడంతో, సోలార్ సిస్టమ్స్ టెండర్‌ను ఎన్ఆర్ఈడీసీఏపీ రద్దుచేసింది. ముచ్చటగా మూడోసారి టెండర్లు పిలవగా, బెంగళూరుకు చెందిన ల్యూమినస్ టెక్నాలజీస్ సంస్థ 18 శాతం లెస్‌కు టెండరు దాఖలు చేసింది. ఈసారీ చిన్నపాటి సాంకేతిక కారణాలు చూపి ఆ సంస్థను అనర్హురాలిగా ప్రకటించారు. ఏమైనా అమరావతి ఇన్‌ఫ్రాకే టెండరును ఖరారు చేసేలా ప్రస్తుతం ప్రభుత్వంలో శరవేగంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### లేని అర్హతలు ఉన్నట్టు..

**మూ**డోసారి టెండర్లు పిలిచిన సమయలో టెండరులో పాల్గొనే సంస్థలు.. మూడు సంవత్సరాల్లో రూ.3 కోట్లు టర్నోవర్ చేసి ఉండాలని, దానికి సంబంధించిన వర్క్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లను చూపాలనే నిబంధన విధించారు. అయితే అమరావతి ఇన్‌ఫ్రాకు ఈ అర్హతలేవీ లేవు. 2016-17, 2017-18 ఆర్థిక సంవత్సరాల్లో దాఖలు చేసిన ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్‌లో ఆ సంస్థ సున్నా టర్నోవర్ చూపింది. 2018-19కి మాత్రం రూ.ఎనిమిది కోట్ల టర్నోవర్ చూపింది. అది కూడా 2018 డిసెంబరు నుంచి 2019 మార్చి నాటికి చేసినట్లు చూపింది. అమరావతి ఇన్‌ఫ్రా సంస్థ 2017-18 ఆర్థికసంవత్సరంలో సున్నా టర్నోవర్ చూపుతుండగా, మరోవైపు ఎన్ఆర్ఈడీసీఏపీ, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ నుంచి రెండు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు టెండరు సైట్‌లో అప్‌లోడ్ చేయడం గమనార్హం. ఇలాంటి అవకవతకలను ప్రస్తావిస్తూ.. 'రెన్యువబుల్ ఎనర్జీ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ' అభ్యంతరం వ్యక్తం చేసినా బేఖాతర్ చేస్తూ అమరావతి ఇన్‌ఫ్రాకే టెండర్లు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమవుతోంది. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.47.52 లక్షల మేర నష్టం వాటిల్లనుందని ఈ అసోసియేషన్ సభ్యులు పేర్కొంటున్నారు. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న సంస్థలను కాదని కొన్ని సంస్థలకు లబ్ధి చేకూరేలా ఎన్ఆర్ఈడీసీఏపీ వ్యవహరిస్తోందని, సాంకేతిక, ఆర్థిక అర్హతలను వాటికి అనుగుణంగా మార్పులు చేసిందని ఆరోపిస్తున్నారు. బిడ్లు వేయవద్దంటూ కొందరు ఎన్ఆర్ఈడీసీఏపీ అధికారులే నేరుగా బెదిరింపులకూ దిగారని చెబుతున్నారు. దీనిపై ఎన్ఆర్ఈడీసీఏపీ ఎండీ రమణారెడ్డి వివరణ కోరగా, టెండర్లపై అభ్యంతరాలను పరిశీలిస్తున్నామని, ఎవరికీ ఇంకా టెండరు ఖరారు చేయలేదని తెలిపారు.


**SAINIK SCHOOL KALIKIRI**
Chittoor Dist., Andhra Pradesh - 517 234
(Under the aegis of MoD, Govt of India)
Dt.13 Dec 2019
Sainik School Kalikiri invites Bids for supply of Dry Ration, Fresh Ration, Chicken, Eggs, Milk & Milk Products, Band Equipment, Dhobi Services, Security Services and Housekeeping & Allied Services. For RFP please visit school website www.kalikiri-sainikschool.com
Sd/- PRINCIPAL







## భాష్యం బ్లూమ్స్‌కు ఏషియన్ బెస్ట్‌స్కూల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న హనుమంతరావు

గుంటూరు(విద్య), డిసెంబరు 12: అసియాలోనే బెస్ట్ సీబీఎస్ఈ హైస్కూల్‌గా భాష్యం బ్లూమ్స్ ఎంపికైందని సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏషియన్ ఎడ్యుకేషన్ అవార్డు-2019ను అందుకున్న ఖ్యాతి తమ పాఠశాలకు దక్కిందని ఆయన పేర్కొన్నారు. యుఎస్ఏకు చెందిన ఇంటర్నేషనల్ బ్రాండ్ కన్సల్టింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో మన దేశం తరుపున ఏషియన్ బెస్ట్ సీబీఎస్ఈ హైస్కూల్ కేటగిరిలో భాష్యం బ్లూమ్స్ అవార్డును కైవసం చేసుకుందని వివరించారు. బ్యాంకాక్‌లో ఈ నెల 11న జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్, సీఈవో భాష్యం హనుమంతరావు ఈ అవార్డు అందుకున్నారని తెలిపారు. మెరుగైన విద్యావిధానం, అత్యున్నతమైన ప్రమాణాలతో భాష్యం విద్యాసంస్థలు ఉన్నతమైన ఫలితాలను సాధిస్తున్నాయని వెల్లడించారు.

## కేకేఆర్స్ గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

- రామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో ర్యాంకులు

గుడివాడ, డిసెంబరు 12: రామానుజన్ మేథమెటిక్స్ అకాడమి, మేథమెటిక్స్ లైబ్రరీ ప్రతిష్ఠాత్మకంగా నవంబరు 10న నిర్వహించిన నేషనల్ మేథమెటిక్స్ టాలెంట్ సెర్చ్ పోటీ పరీక్ష తుది ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యారామ్ ఓ ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి విద్యార్థుల్లో వై.ఠాగూర్ రవీంద్రశ్రీ మొదటి, జె.మారుతి రెండో ర్యాంకు, 9వ తరగతిలో భువనరెడ్డి మొదటి, ఆర్.హర్షవర్ధన్ రెండో ర్యాంకు, 10వ తరగతిలో పి.కార్తికేయ రెండో ర్యాంకు, 4వ తరగతిలో వీఎన్.నివేదిత మొదటి ర్యాంకు సాధించారని వివరించారు. వీరిని పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఫ్యాక్ట్ ప్రిన్సిపాల్ ఎం.రామిరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎస్.విజయశేఖర్, కె.జ్యోతి అభినందించినట్టు తెలిపారు.

## శ్రీవారి సేవలో సింగపూర్ మంత్రి ఈశ్వరన్



తిరుమల, డిసెంబరు 12: సింగపూర్ ఐటీశాఖ మంత్రి ఈశ్వరన్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం సాయంత్రం తిరుమలకు వచ్చిన ఆయన గురువారం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈశ్వరన్‌కు వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

## జన్మభూమి కమిటీలు రద్దు

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని అమలుచేసేందుకు గత ప్రభుత్వం వివిధ స్థాయిల్లో ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం గురువారం జీవో ఇచ్చింది. జిల్లా, మండల, మున్సిపల్, గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డు స్థాయిల్లో ఏర్పాటు చేసిన కమిటీలన్నీ రద్దు చేస్తున్నట్లు ఆ జీవోలో పేర్కొన్నారు.

## తిరుపతి సంస్కృత విద్యాపీఠ్‌కు కేంద్రీయ విశ్వవిద్యాలయం హోదా

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్‌తో పాటు మరో రెండు సంస్థలను కేంద్రీయ విశ్వవిద్యాలయాలుగా మార్చుతూ కేంద్ర మానవ వనరులశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ ప్రవేశపెట్టిన బిల్లుకు గురువారం లోక్‌సభ ఆమోదం తెలిపింది.

## 'సరస్వతి పవర్'కు 613 ఎకరాలు

- రద్దయిన మైనింగ్ లీజుల పునరుద్ధరణ

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలోని 613.476 ఎకరాల సున్నపురాయి మైనింగ్ లీజులను మెసర్స్ సరస్వతీ పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. గుంటూరుజిల్లా దాచేపల్లి మండలం తంగెడ, మాచవరం మండలం వేమవరం, చెన్నయపాలెం పరిధిలో ఈ నిక్షేపాలు ఉన్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ గనుల లీజులను పునరుద్ధరించినట్టు గనులశాఖ కార్యదర్శి కె.రాంగోపాల్ పేర్కొన్నారు. మైనింగ్ తవ్వకాలు జరగకపోవడం, లీజుదారు రూ.23,922 బకాయి పడడం, అటవీ పర్యావరణ అనుమతులు తీసుకురావడంలో వైఫలం చెందిన నేపథ్యంలో, ఈ లీజులు గతంలో రద్దయ్యాయని ఈ ఉత్తర్వులో ఆయన వివరించారు.

## ఏపీ స్ఫూర్తిగా యూపీలో 'అభయ్'

- ప్రకాశం ఎస్పీకి యూపీ డీజీపీ ఫోన్



ఈ నెల 4న ఒంగోలులో అభయ్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రకాశం ఎస్పీ సిద్ధార్థ కౌశల్(ఫైల్)

ఒంగోలుక్రైం, డిసెంబరు 12: ప్రకాశం జిల్లా పోలీసులను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తరప్రదేశ్‌లో పోలీస్ రెస్పాన్స్ వెహికల్‌ను ప్రవేశపెట్టారు. ప్రకాశం జిల్లాలో ఈ నెల 4న ప్రారంభించిన 'అభయ్' వాహనాలు మహిళ భద్రత కోసం 'హితోధికం'గా ఉపయోగపడుతున్నాయి. రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల మధ్య మహిళలు.. రవాణా సదుపాయాల్లేక ఎక్కడైనా చిక్కుకుపోతే.. వారిని సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుస్తున్నాయి. మహిళలు ఎక్కడున్నా..100 నంబరుకు ఫోన్ చేస్తే అభయ్ వాహనాలు పది నిమిషాల్లో వారి ముంగిట ప్రత్యక్షమవుతున్నాయి. అందులోని పోలీసులు.. వారిని సురక్షితంగా గమ్యస్థానానికి చేరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ డీజీపీ ఓపీ సింగ్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌తో అభయ్ వాహనాల గురించి ఫోనులో చర్చించారు. అనంతరం ఉత్తర్‌ప్రదేశ్‌లో పోలీసు 'రెస్పాన్స్ వెహికల్' పేరుతో అక్కడ వాహనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధార్థ కౌశల్ మాట్లాడుతూ జిల్లాలో ప్రవేశపెట్టిన అభయ్ వాహనాలను ఉత్తరప్రదేశ్ పోలీసులు ఆదర్శంగా తీసుకున్నారని తెలిపారు.



నేలమట్టమైన క్లాక్ టవర్

ఉప్పాడ సెంటర్లో కూల్చివేతకు ముందు క్లాక్ టవర్

## పిఠాపురంలో క్లాక్ టవర్ కూల్చివేత

- ట్రాఫిక్ అడ్డుగా ఉందని అర్ధరాత్రి తొలగింపు

పిఠాపురం, డిసెంబరు 12: తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం ఉప్పాడ సెంటర్లో ఉన్న క్లాక్ టవర్‌ను గురువారం అర్ధరాత్రి నేలమట్టం చేశారు. ఉప్పాడ సెంటరు నుంచి ప్రభుత్వాస్పత్రి సెంటర్ వరకు రహదారి మధ్య డివైడర్ నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, క్లాక్ టవర్ నిర్మాణం చేపట్టి సుందరీకరణ చేసేందుకు టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా రూ.కోటి మంజూరు చేయించారు. డివైడర్‌తో పాటు సెంట్రల్ లైటింగ్ పనులు ఫైర్ స్టేషన్ వరకు పూర్తయ్యాయి. క్లాక్ టవర్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. ఈలోగా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి రావడంతో టవర్ పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు ట్రాఫిక్‌కు అడ్డుగా ఉందని టవర్‌ను మునిసిపల్ అధికారులు కూల్చివేయాలని నిర్ణయించారు. అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేత పనులు ప్రారంభించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి కనిపించకూడదనే ఎమ్మెల్యే ఒత్తిడితో టవర్ కూల్చివేస్తున్నారని వర్మ ఆరోపించారు. అమరావతిలో ప్రజావేదికను జగన్ కూలగొట్టించగా.. ఇక్కడి ఎమ్మెల్యే ఆ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

## గవర్నర్‌తో ఇంటెలిజెన్స్ చీఫ్ భేటీ

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌తో ఇంటెలిజెన్స్ ఐజీ మనీష్ కుమార్ సిన్హా భేటీ అయ్యారు. కేంద్ర సర్వీసుల నుంచి రాష్ట్రానికి వచ్చిన ఆయనకు జగన్ ప్రభుత్వం కీలక పోస్టింగ్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిన్హా మర్యాదపూర్వకంగా గవర్నర్‌ను కలిసినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. జైళ్ల శాఖ డీజీగా నియమితులైన అహ్‌సాన్ రెజా కూడా గవర్నర్‌ను కలిశారు.

## పరామర్శకు వెళుతూ తిరిగిరాని లోకాలకు

**తుఫాన్ వాహనాన్ని ఢీకొన్న లారీ**

**ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి**

కొనకనమిట్ల, డిసెంబరు 12: లారీ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండలం కొత్తపల్లి 565 ప్రధాన జాతీయరహదారిపై గురువారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. చెల్లెలు భర్త రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో బళ్లారికి చెందిన చెట్లా సుగుణమ్మ, చెట్లా హంసమ్మ కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి బుధవారం రాత్రి బయలుదేరారు. మార్కాపురం మీదుగా చీమకుర్తి మండలం పాటిమీదపాలెం వస్తున్న వీరి వాహనాన్ని.. గురువారం ఉదయం చెన్నై నుంచి మార్కాపురం వైపు ప్లైవుడ్ లోడుతో వెళుతున్న లారీ బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తుఫాన్‌లో ఉన్న 10మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కొత్తపల్లి గ్రామస్థులు, రహదారిపై ప్రయాణిస్తున్న వాహనచోదకులు స్పందించారు. తుఫాన్ డ్రైవర్ తాను కూర్చున్న సీట్లోనే తీవ్రగాయాలతో ఇరుక్కుపోయాడు. వాహనం డోర్లు బలవంతంగా తెరిచిన స్థానికులు క్షతగాత్రులను బయటకు తీశారు. అప్పటికే ముగ్గురు మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సీట్లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను రక్షించేందుకు ఎక్స్‌కవేటర్‌ను వినియోగించాల్సి వచ్చింది. క్షతగాత్రులలో మరో మహిళ పొదిలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందింది.






## అయ్యన్న కుటుంబీకుల మధ్య ఘర్షణ



అయ్యన్న ఇంటిపై వైసీపీ, టీడీపీ జెండాలు

- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

నర్సీపట్నం టౌన్ (విశాఖపట్నం జిల్లా), డిసెంబరు 12: మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సోదరుడు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు కుటుంబాల మధ్య మరోసారి వివాదం తలెత్తింది. ఇరు కుటుంబాలు మొదటి నుంచి కలిసే ఉంటున్నాయి. సోదరులిద్దరూ తెలుగుదేశం పార్టీలో ఉంటూ వచ్చారు. ఎన్నికల అనంతరం సన్యాసిపాత్రుడు వైసీపీలో చేరారు. ఈ నేపథ్యంలో గురువారం సన్యాసిపాత్రుడు, ఆయన తనయుడు వరుణ్... తాము ఉంటున్న పోర్షన్‌పై వైసీపీ జెండా కట్టేందుకు యత్నించడంతో ఇరు కుటుంబాల మధ్య వివాదం తలెత్తింది. ఈ ఘర్షణలో అయ్యన్న పాత్రుడు పిన్ని పెదపాత్రుడి లక్ష్మి స్పృహతప్పి పడిపోయారు. ఆమెను వెంటనే స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. పట్టణ సీఐ స్వామి నాయుడు మాట్లాడుతూ వరుణ్ నుంచి మొదట ఫిర్యాదు వచ్చిందన్నారు. తాము పార్టీ జెండా కట్టుకోవడానికి వెళితే ఉలబాల సరోజని, పెదపాత్రుడి లక్ష్మి, హర్ష, రామచంద్ర అడ్డుకునేందుకు యత్నించారని వరుణ్ ఫిర్యాదుచేశారని తెలిపారు. హర్ష, చింతకాయల విజయ్ వల్ల ప్రాణహాని ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. పెదపాత్రుడి లక్ష్మి కూడా మేడ మీదకు వెళ్లిన తనను సన్యాసిపాత్రుడు, వరుణ్ దూషించి, కొట్టారని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. హర్షపై కూడా దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

## మూలాల ముంపు

తమకు చరిత్రలో ఎన్నడూ లేనంత ద్రోహం జరిగిందంటూ ఈశాన్యం రగిలిపోతున్నది. అసోం ఆగ్రహంతో ఊగిపోతున్నది. ధర్నాలు ర్యాలీలూ దహనాలకూ కాల్పులకూ దారితీస్తున్నాయి. కొత్త పౌరసత్వ చట్టంతో మీ ప్రయోజనాలకు ఏ ముప్పూవాటిల్లదనీ, రానివ్వననీ స్వయంగా ప్రధాని హామీ ఇచ్చినా కాదుపొమ్మంటున్న స్థితిలో ఈశాన్య జనం ఉన్నారు. ఈ చట్టం వెనుక రహస్య ఎజెండా ఉన్నదని దేశ వ్యాప్తంగా అనేకుల్లో అనుమానాలు, భయాలు. భారతదేశ మౌలిక స్వరూప స్వభావాలను సమూలంగా మార్చివేసి, పాలకులు ఆశిస్తున్న హిందూ రాష్ట్ర ఆవిష్కరణ దిశగా అడుగులు పడుతున్నాయని కొందరి వాదన. ఎవరెన్ని అనుకున్నా, అనుమానించినా మోదీ–అమిత్ ద్వయం తాను అనుకున్నదే సాధించింది. ఇప్పటికీ సమయం మించిపోలేదనీ, అవకాశాలు అడుగంటిపోలేదనీ, ప్రజా ఉద్యమాలు, న్యాయపోరాటాలతో ఈ కొత్తచట్టానికి అడ్డుకట్ట వేయవచ్చునని కొందరి ఆశ.

ఇప్పటిపాలకులు లక్ష్యసాధనకు శత్రువులను కలుపుకోగలరు, మిత్రులను చీల్చగలరు. లోక్‌సభలో మందబలం ఉన్నది కనుక బిల్లు నెగ్గుతుందని అనుకున్నదే. కానీ, రాజ్యసభ విన్యాసాలను గమనిస్తే ఈ దేశంలో పిడికెడు పార్టీలు తప్ప మిగతావన్నీ ఇటువంటి సంక్లిష్ట సమయాల్లో సైద్ధాంతికంగా నిలబడవని అర్థమైపోతున్నది. బీజేపీ ఆలోచనలకు అడ్డు తగిలితే, సిద్ధాంతాలకు ఎదురునిలబడితే మెజారిటీ ఆగ్రహానికి గురై పుట్టగతులుండవని వాటి భయం కాబోలు. చివరకు దేశ మౌలిక స్వభావానికి హాని కలిగించే అంశాలను సైతం బలంగా ఢీకొట్టలేని ఆత్మరక్షణలోకి పార్టీలను నెట్టివేయడంలో పెద్దలిద్దరూ విజయం సాధించారు. పెద్దనోట్ల రద్దు, అస్థవ్యస్థ జీఎస్టీ దుష్ప్రభావాలను దేశం అనుభవించడం ఆరంభించగానే పాకిస్థాన్‌తో వైరం పతాకస్థాయికి చేరింది. ఉద్యోగ ఉపాధులు దెబ్బతినిపోవడంతోనే కశ్మీర్ కథ తెరమీదకు వచ్చింది, ముమ్మారు తలాక్ చుట్టూ దేశం ఆగ్రహావేశాలతో ఊగిపోయింది. దేశరక్షణ, ప్రజాభద్రత చుట్టూ వాదనలు సాగుతూ దర్యాప్తు సంస్థలు కొత్తబలాన్ని సంతరించుకుంటే, వ్యక్తులను సైతం ఉగ్రవాదులుగా నిర్ధారించగలిగేస్థాయికి చట్టాలు ఎదిగిపోయాయి. దేశానికి ఒక కొత్తదిశానిర్దేశం చేస్తున్న పాలకులు నిర్వహిస్తున్న అశ్వమేధయాగంలో ఇప్పుడు పౌరసత్వ చట్టం, రేపు దేశవ్యాప్త ఎన్నార్సీ. ప్రస్తుతానికి మాటల్లో లేకపోవచ్చు కానీ, ఉమ్మడి పౌరస్మృతి వీరి మనసు పొరల్లో ఒక ప్రధాన లక్ష్యంగా నాటుకుని ఉన్నదని ఎవరికి తెలియదు.

మలివిడత మహావిజయంతో వారి ఆదర్శాలు, సిద్ధాంతాలు మరింత బలంగా ఆచరణలోకి వస్తున్నాయి. మైనారిటీలను ఆత్మరక్షణలో ఉంచుతూ, భయోత్పాతంలో ముంచుతూ వేగంగా అడుగులు పడుతున్నాయి. మాటల్లో మోదీని మించిపోయారు అమిత్ షా. పౌరసత్వ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా దేశవిభజనకు కాంగ్రెస్‌ను తప్పుబడుతూ, మతపరమైన ఆ మహాపాపం కారణంగానే ఈ చట్టం అవసరపడిందన్న ఆ వాదనను కాలదన్నగలవారే లేకపోయారు. రెండు దేశాల సిద్ధాంతాన్ని మీ పూర్వీకులే ప్రతిపాదించి, సమర్థించారని చెప్పలేకపోయారు. ఈ దేశ పౌరసత్వాన్ని ఓ మతపరీక్షలాగా మార్చివేస్తూ, అందుకు సమర్థనగా పద్నాల్గవ అధికరణలో అవసరమైన భాగాలను మాత్రమే ఉటంకించిన హోంమంత్రి తెలివిడిని విప్పిచెప్పలేకపోయారు. ఈ బిల్లు ముమ్మాటికీ రాజ్యాంగ వ్యతిరేకమని న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులే కాక, పార్లమెంటరీ సంఘాలు సైతం విస్పష్టంగా చెప్పినా, అంతర్జాతీయ నియమ నిబంధనలకు నీళ్ళొదులుతూ ప్రపంచం ముందు అప్రదిష్టపాల్జేస్తున్నా పాలకుల మాటే నెగ్గింది. ఈ చట్టానికీ, ఈ దేశ ముస్లింలకు సంబంధం లేదనీ, వారు నిర్భయంగా ఉండవచ్చునని లోక్‌సభలో చెప్పినవారే, దేశవ్యాప్త ఎన్నార్సీ అవసరం గురించి ఏమన్నారో విన్నాం. అసోంలో అడ్డగోలుగా సాగిన ఎన్నార్సీకి ఈ పౌరసత్వ చట్టం కొనసాగింపు. రేపు దేశవ్యాప్తంగా అమలుకాబోయే ఎన్నార్సీకి రక్షణ కవచం. అసోంని చూసిన తరువాత రేపు దేశవ్యాప్త వడబోత ఏవిధంగా సాగుతుందో, ఎవరిని ఈ భూమిపుత్రులంటుందో, ఎవరిని పైవారంటుందో ఊహకందనివేమీ కావు. అది వేరు, ఇది వేరు అంటూనే ఈ దేశ మూలాలను పెకిలించే ప్రయత్నాలు గొలుసుకట్టుగా సాగిపోతున్నాయి.

# సమ పౌరసత్వానికి సమాధి!



■ యోగేంద్ర యాదవ్

ఇప్పుడు మనం ఏం చేయాలి? ఏం చేసి తీరాలి? 'పౌరసత్వ సవరణ బిల్లు' (సిటిజన్‌షిప్ ఎమెండ్‌మెంట్ బిల్–కాబ్) పార్లమెంటు ఆమోదం పొందిన దృష్ట్యా ఈ ప్రశ్నలు అనివార్యం. కొత్త పౌరసత్వ చట్టం మన రాజ్యాంగంపై ఒక దౌర్జన్యం. ఆ అఘాయిత్యంపై లౌకికవాదుల ప్రతిస్పందన గురించి పునరాలోచించవలసిన సందర్భమిది. పోరాటాన్ని న్యాయస్థానాలు, చట్టసభల నుంచి ప్రజల మధ్యకు తీసుకువెళ్ళాలి. ప్రజారంగమే పోరాట వేదిక కావాలి. ఎందుకంటే ప్రజాభిప్రాయమే తుది తీర్పు. ప్రతిస్పందనాత్మక వ్యతిరేకత నుంచి క్రియాశీలక ప్రతిఘటనకు దిగాలి; అమూర్త భావనలు, వాదాలను పక్కన నెట్టి మరింత వాస్తవిక అవగాహనకు, చైతన్యశీల భావ వ్యాప్తికి పూనుకోవాలి.

'పౌరసత్వ చట్టం 2019' సంకల్పమే పక్షపాతపూరితమైనది, సమాజంలో విభేదాలు సృష్టించేది. అసోంలో భారతీయ జనతా పార్టీ బెంగాలీ హిందూ ఓటు బ్యాంకును రక్షించుకోవడం ఒక్కటే ఈ చట్టం ధ్యేయం కాదు. 2021లో పశ్చిమబెంగాల్ శాసనసభా ఎన్నికల తరుణంలో మతోన్మాద భావోద్వేగాలను ప్రజ్వలింపచేసే లక్ష్యానికే అది పరిమితం కాదు. 'మతపరమైన వేధింపులు, హింసాత్మక పీడనకు గురై మన దేశానికి వలసవచ్చిన మత మైనారిటీలకు ఆశ్రయమివ్వడం కొత్త పౌరసత్వ చట్ట ప్రకటిత లక్ష్యం. ఇది, ఆ చట్టం అసలు లక్ష్యాన్ని ఉద్దేశపూర్వకంగా కప్పిపుచ్చుతున్నది. అసలు లక్ష్యం భారత గణతంత్ర రాజ్యంలో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులేనన్న లాంఛనప్రాయ సంకేతాన్ని పంపడమే. కఠోర వాస్తవమిది.

పౌరసత్వ చట్టం మన స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చిన, మార్గదర్శకత్వం నెరపిన భారత్ భావనపైన ఒక మహాదాడి. దేశవ్యాప్త జాతీయ పౌర జాబితా (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ –ఎన్ఆర్సీ) తో కలిసి ఈ చట్టం మన గణతంత్ర రాజ్య స్వభావాన్ని వికృతీకరిస్తుంది. ఆ చట్టంతో మన గణతంత్ర రాజ్య ప్రస్థానం 'లౌకిక' పథం నుంచి మిథ్యా లౌకిక బాటకు మళ్ళింది. స్టాండప్, ప్లీజ్ స్టాండప్. భారత్ భావనను విశ్వసించే, గౌరవించే ప్రతి ఒక్కరూ ఆ తిరోగమన పరిణామానికి వ్యతిరేకంగా పోరాడాలి. మనం ఏమి చేయాలి? కొత్త పౌరసత్వ శాసనాన్ని వ్యతిరేకించేవారు ఆ చట్టాన్ని గురించిన అధికారిక కథనాలలోని లోగుట్టును ఐదు ప్రశ్నలతో బహిర్గతం చేయాలి. అవి: (1) మన ఇరుగు పొరుగు దేశాలలో మత పరమైన వేధింపులు, హింసాకాండకు గురవుతున్న వారికి మన దేశం ఆశ్రయమివ్వదలుచుకుంటే కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్‌లకు చెందిన వారికే ఎందుకు? ఇతర పొరుగు దేశాలైన మయన్మార్, నేపాల్, చైనాలకు సంబంధించిన వారి మాటేమిటి? (2) మత ప్రాతిపదికన హింసాత్మక పీడన కలవరపడే అంశమే. అయితే, కేవలం మత వేధింపులు మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం ఎంతవరకు సబబు? ప్రాంతీయ వివక్ష, అన్యాయాలు (పాకిస్థాన్‌లోని బెలూచిస్థాన్), జాతి వివక్షల (నేపాల్‌లో తెరాయి ప్రజలు, శ్రీలంకలో తమిళులు) గురించి భారత్ ఎందుకు పట్టించుకోవడం లేదు? (3) మతపరమైన వేధింపులు, శిక్షలకు మాత్రమే పరిమితం కావాలన్నదే యోచన అయితే అవే పరిస్థితులు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లోని అహ్మదీయాలు, షియాలు; చైనాలోని టిబెటన్లు; యయన్మార్‌లోని రోహింగ్యాలు; శ్రీలంక హిందువులు, ముస్లింలకు ఆశ్రయమివ్వడానికి ఎందుకు నిరాకరిస్తున్నారు? (4) ఇరుగు పొరుగు దేశాలలో మైనారిటీ మతస్థులపై వేధింపులు, శిక్షలు కొనసాగుతుంటే 2014 డిసెంబర్ 31 వరకు మన దేశానికి వలస వచ్చిన ముస్లిమేతర మతస్థులకు మాత్రమే పౌరసత్వమివ్వడమేమిటి? (5) కొత్త చట్టం అమలు నుంచి దేశంలోని కొన్ని ప్రాంతాలకు ఏ ప్రాతిపదికన మినహాయింపునిచ్చారు? ఈ ప్రశ్నలకు అధికారవర్గాల నుంచి గానీ, కొత్త చట్టం సమర్థకుల నుంచి గానీ సంతృప్తికరమైన సమాధానాలు లేవు.

సమాధానాలు ఇవ్వలేని పాలకులు ఈ చట్టం గురించి చవకబారు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. కేవలం పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్‌లలో మాత్రమే అధికారిక మతాలు ఉన్నాయనే తప్పుడు సమాచారాన్ని ఇస్తున్నారు (శ్రీలంక రాజ్యాంగం బౌద్ధ మతానికి ప్రాధాన్యమివ్వాలని నిర్దేశించింది). భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు భారత పౌరులు కానివారికి వర్తించవని అధికార వర్గాలు చెప్పుతున్నాయి. ఇదొక అబద్ధం. అవి ప్రతి 'వ్యక్తి'కీ వర్తిస్తాయి. అలాగే, ఈ కొత్త చట్టం బెంగాలీ హిందువులకు పౌరసత్వాన్ని ఇవ్వదన్న వాదనలో నిజం లేదు (బంగ్లాదేశ్ నుంచి వచ్చిన బెంగాలీ హిందువులకు భారత పౌరసత్వం లభిస్తుందని అస్సోం మంత్రి హిమంత బిశ్వ శర్మ మంగళవారం నాడు కూడా చెప్పారు).





'మతపరమైన వేధింపులు, హింసాత్మక పీడనకు గురై మన దేశానికి వలసవచ్చిన మత మైనారిటీలకు ఆశ్రయమివ్వడం కొత్త పౌరసత్వ చట్టం ప్రకటిత లక్ష్యం. కానీ, దాని అసలు లక్ష్యం భారత గణతంత్ర రాజ్యంలో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులేనన్న సంకేతాన్ని పంపడమే. ఇక, మనకు లౌకిక భారతదేశమైనా ఉంటుంది లేదా అసలు భారతదేశమనేదే లేకపోయే విపత్తయినా వాటిల్లుతుంది.

భారతీయ జనతా పార్టీ పార్లమెంటులో సంఖ్యాబలంతో బిల్లుపై చర్చలో విజయం సాధించింది. అయితే, వాస్తవాల ప్రాతిపదికన విస్తృత ప్రజాచర్చలో అధికార పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వమేమో అన్ని వాస్తవాలను, వ్యతిరేకతలను ఉపేక్షించి, బిల్లు విషయంలో తన మాట నెగ్గించుకున్నది. తన చర్యకు ప్రజల ఆమోదం లభిస్తుందనే విశ్వాసంతోనే ప్రభుత్వం అందుకు పూనుకున్నది. భారతీయ ఆత్మను రక్షించడానికి ఒక మహాపోరాటం జరగవలసి వున్నది. ఈ చట్టానికి న్యాయపరీక్ష అనివార్యం. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో దానిని తప్పక సవాల్ చేస్తారు. న్యాయవ్యవస్థకే అదొక పరీక్ష అవుతుంది. సాధారణ సమయాలలో ఇటువంటి కేసులలో తీర్పును వెలువరించడంలో న్యాయమూర్తులకు పెద్దగా సంక్లిష్టతలు ఎదురు కావు. అయితే ఇవి అసాధారణ రోజులు కదా. తమకు అనుకూలమైన తీర్పులు వెలువడే విషయమై పాలకులు అమిత శ్రద్ధ చూపుతున్న కాలమిది. ఈ దృష్ట్యా, కొత్త పౌరసత్వ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేస్తే అదొక సంతోషదాయక, ఆశ్చర్యకర పరిణామమవుతుంది. న్యాయవ్యవస్థ తీర్పు ఎలా వున్నప్పటికీ అది రాజకీయ పోరాటానికి ప్రత్యామ్నాయం కాదు, కాబోదు. ఆ చట్టానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని పెద్ద ఎత్తున సమీకరించవలసివున్నది. ఇది మాత్రమే అంతిమ ఫలితాన్ని నిర్ణయిస్తుంది.

ఇప్పటికే ఈ పోరాటానికి బీజాలు పడ్డాయి. పార్లమెంటులో బిల్లు ప్రవేశం నాటినుంచి దేశవ్యాప్త నిరసనలు వెల్లువెత్తాయి. ఇవి వేర్వేరు రకాలు. తమను లక్ష్యం చేసుకుంటున్నారని విశ్వసిస్తున్న ముస్లిం బృందాలు ఒకవైపు, ఈశాన్య రాష్ట్రాలలో వెల్లువెత్తిన నిరసనలు మరొకవైపు కనిపిస్తున్నాయి. ఈ రెండింటి మధ్య తేడా వున్నది. బెంగాలీ హిందువులకు పౌరసత్వం కల్పిస్తారనే భయంతో ఈశాన్య రాష్ట్రాలు మండిపడుతుంటే, తమను వివక్షాపూరితంగా మినహాయిస్తున్నారనే భయంతో ముస్లిం బృందాలు నిరసన తెలుపుతున్నాయి. ఇక, దేశ వ్యాప్తంగా పౌర హక్కుల బృందాలు, ప్రజా ఉద్యమాల వారితో సహా సకల సామాజిక వర్గాలు తెలుపుతున్న నిరసనలూ సాగుతున్నాయి. అవిభాజక పౌరసత్వానికై ఈ మూడు రకాల పోరాట స్రవంతులను సమైక్యం చేయవలసి వున్నది. కొత్త సవాళ్ళను దీటుగా ఎదుర్కోవడానికి లౌకికవాదులు కొత్త వ్యూహాలను అనుసరించాల్సిన అవసరం ఉన్నది. కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారు తొలుత ఈశాన్య రాష్ట్రాలలో వలసకారులకు వ్యతిరేకంగా ఉద్యమాలు ఎందుకు ప్రజ్వరిల్లుతున్నాయో అర్థం చేసుకోవాలి. అస్సామీలు తదితర ప్రజల భయాందోళనలపై అవగాహన పెంపొందించుకోవాలి. తమ మాతృభూమిలోనే తాము మైనారిటీలమై పోతున్నామనేది ఈశాన్య భారతీయుల ఆందోళన. అదే సమయంలో నిస్సహాయ పరిస్థితులలో వలస వచ్చిన వారి దీనాలాపాలను కూడా అర్థం చేసుకోవాలి. వలస, ఆశ్రయానికి సంబంధించి తమపై వివక్ష చూపని విధానాలను ఆ శరణార్థులు కోరుతున్నారు.

లౌకిక భారతదేశ రక్షణకు జరిగే ఉద్యమం, ప్రస్తుత పాలకుల రాజకీయాలు, విధానాలకే పరిమితం కాకుండా ఒక సువిశాల భూమికతో ప్రతిస్పందించాలి. ప్రతిస్పందనాత్మక వ్యతిరేకత నుంచి క్రియాశీలక ప్రతిఘటనకు సాగాలి. కొత్త తరానికి లౌకికవాద ఆదర్శాలను నూరిపోయాలి. మన మేధో కార్యకలాపాలకు, సాంస్కృతిక వారసత్వాలకు లౌకికవాదమే ప్రాతిపదిక కావాలి. స్వాతంత్ర్యవీరులు రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌ల బలిదానం రోజైన డిసెంబర్ 19న కొత్త పౌరసత్వ చట్ట వ్యతిరేకులంతా దేశవ్యాప్తంగా సమైక్య కార్యాచరణకు ఉపక్రమించనుండడం ఉత్సాహపరుస్తోంది. లౌకిక భారతదేశం భవిష్యత్తుపై ధైర్యాన్నిస్తోంది. మానవతను మహా ప్రదీప్తం చేస్తోన్న భారతీయ ఆత్మ; సుజల, సుఫల, సస్యశ్యామల సువిశాల భౌగోళిక భారత్ సమగ్రత, సమైక్యతల సంరక్షణ కోసం జరుగుతున్న పోరాటమిది. మనకు లౌకిక భారతదేశమైనా ఉంటుంది లేదా అసలు భారత దేశమనేదే లేకపోయే విపత్తయినా వాటిల్లుతుంది.

*(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)*

## మాతృభాషతోనే మానసిక ఎదుగుదల

మాతృభాషతో మనిషికి మానసిక సంబంధం ఉంటుంది. కాబట్టి, విద్యార్థులు మానసికంగా వికసించాలంటే మాతృభాషలో బోధన అవసరం. విద్యలో సమానత్వం రావాలంటే ఆంగ్లమాధ్యమం కంటే కూడా ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో ఒకటి నుండి పది తరగతుల వరకు తెలుగు మాధ్యమం అమలు చేయాలి. బీదలు, ధనికులు అందరూ ఒకటే మీడియంలో చదవినప్పుడు ముఖ్యమంత్రి ఆశయం నెరవేరుతుంది.

ప్రాథమిక స్థాయిలో శాస్త్రవిజ్ఞానపు పరిజ్ఞానం, జ్ఞానేంద్రియానుభూతిని పొందే జ్ఞానం అవసరం. శాస్త్ర విజ్ఞానపు బోధన మాతృభాషలో ఉంటేనే, విద్యార్థిలో మనోవికాసం కలిగి, నేటి ప్రపంచానికి కావలసిన సృజనాత్మకత పెరిగే అవకాశాలుంటాయి. శాస్త్ర విజ్ఞానం జాతీయ, అంతర్జాతీయ భాషలలో అందుబాటులో ఉంటుంది. ప్రాథమికోన్నత స్థాయి నుండి త్రిభాషా వ్యవహార ప్రయోగశాలలుంటే (Spoken language labs) విద్యార్థి ఆయా భాషలలో వ్యావహారిక భాషా పరిజ్ఞానాన్ని పొంది, శాస్త్రీయ అంశాలను అర్థం చేసుకోగలుగుతారు. అయితే, ఆయా భాషలలో వ్యవహార జ్ఞానం పొందాలంటే పునాది మాతృభాషలోని అభివ్యక్తీకరణ అవసరం. నిర్దుష్టమైన, నిర్దిష్టమైన భాషావ్యవహార జ్ఞానం ఏర్పడాలంటే మాతృభాషలోనే మర్యాదపూర్వక అభివ్యక్తీకరణ, వ్యాకరణం సుస్పష్టంగా తెలిసి ఉంటే పరభాషలలోని వ్యాకరణాన్ని అర్థం చేసుకుంటూ ఆ భాషలోనూ విషయాన్ని అభివ్యక్తీకరించగలుగుతారు.

ఆంగ్లమాధ్యమంలో చదువుకునే పిల్లలలో 'ఎస్ మిస్., కమ్ మిస్' అనే ఇంగ్లీషు పదాలుతప్ప సరిగ్గా భావాలను వ్యక్తంచేయలేని వారే ఎక్కువ. తెలుగు మాతృభాషగా లేని విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం గల సి.బి.ఎస్.ఈ. స్కూళ్లల్లో చదువుకోవచ్చు. కానీ, తెలుగు జాతి విద్యార్థులకు ప్రామాణిక పాఠ్యాంశ ప్రణాళికతో ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తప్పని సరిగా తెలుగు మాధ్యమంలో బోధన ఉంటేనే విద్యా ప్రమాణాలు అధికంగా ఉంటాయి.



ఆంగ్లమాధ్యమంలో చదువుకునే పిల్లలలో 'ఎస్ మిస్., కమ్ మిస్' అనే ఇంగ్లీషు పదాలు తప్ప సరిగ్గా భావాలను వ్యక్తం చేయలేని వారే ఎక్కువ. తెలుగు మాతృభాషగా లేని విద్యార్థులు ఆంగ్ల మాధ్యమం గల సి.బి.ఎస్.ఈ. స్కూళ్లల్లో చదువుకోవచ్చు. కానీ, తెలుగు జాతి విద్యార్థులకు ప్రామాణిక పాఠ్యాంశ ప్రణాళికతో ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు తప్పనిసరిగా తెలుగు మాధ్యమంలో బోధన ఉంటేనే విద్యా ప్రమాణాలు అధికంగా ఉంటాయి.

ఎనిమిదవ తరగతి నుండి త్రిభాషా ప్రయోగశాలల్లో శిక్షణనిస్తే మన తెలుగు బిడ్డలు ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళి ఉత్తమ స్థాయి ఉద్యోగాలు సంపాదించుకోగలుగుతారు. ఒకటవ తరగతి నుండి డిగ్రీ వరకు ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా ఆచరణలో పెడితే ఇంగ్లీషు మాధ్యమం అవసరమే ఉండదు. ఇంగ్లీషు మీడియంలో చదివి శాస్త్ర విజ్ఞానం బోధించే గురువులకు వ్యవహార భాషాజ్ఞానం తక్కువ. ఒక పాఠ్యాంశంగా ఇంగ్లీషును చదివిన వారికి వ్యవహారభాష మీద పట్టు ఎక్కువ. అందుకే ఇంగ్లీషు మీడియంలో చదివిన వారి కంటే తెలుగు మీడియంలో చదివిన వాళ్లు ఇంగ్లీషులోనూ స్పష్టంగా మాట్లాడుతున్నారు.

తెలుగు అకాడమీ ప్రచురించిన 8–10 తరగతుల తెలుగు మీడియం పుస్తకాల్లో విజ్ఞాన శాస్త్ర పారిభాషిక పదాలను బ్రాకెట్టులో ఇంగ్లీషులో కూడా పెట్టటం మనకు తెలిసిందే. ఇంటర్మీడియేట్ స్థాయి నుండి విద్యార్థులు తమ ఇష్టాలు, లక్ష్యాలకనుగుణమైన మీడియంను ఎంచుకునే వెసులుబాటు ఉండవచ్చు. ఆంగ్లమాధ్యమంలో చదుకున్న వారందరూ అమెరికా, లండన్ వెళ్ళి ఉద్యోగాలలో స్థిరపడలేదనేది కూడా ఎంతో వాస్తవం. మాతృభాషలో వ్యవహార జ్ఞానం పటిష్ఠంగా ఉంటే రష్యా, జపాన్, జర్మనీ, ఫ్రెంచ్ వంటి భాషలలో పిల్లలు వేసవి శెలవులలో మూడునాల్గు నెలలు శిక్షణ ఇవ్వొచ్చు. దానితో ఒక్క అమెరికా, ఇంగ్లండులే కాదు ఏ దేశమేగినా ఆయా దేశ భాషల్లో వ్యవహారం నడిపించగలరు.

ఇక సాంకేతిక పరంగా ఇంగ్లీషు భాషా ప్రయోజనం ఎంత? అని ఆలోచిస్తే కంప్యూటర్ లాంగ్వేజీకి ఏ భాషా లేదు. మన భారతీయులు కనిపెట్టిన '0','1' అనే బైనరీ లాంగ్వేజీలోనే ఉంటుంది. అంతేగాక కంప్యూటర్ ప్రోగ్రాములలో, ఆపరేషన్లలో, లాంగ్వేజీలో ఆంగ్ల భాషలోని పదాల అర్థం కంటే సంక్షిప్త పారిభాషిక పద వినియోగం ముఖ్యం. దానికి అక్షరాలు చదవగలిగే ఆంగ్లభాషా పరిజ్ఞానం, ప్రాథమిక స్థాయి ఆంగ్లం సరిపోతుంది. మానవ సహజమైన ఇంటెలిజెన్స్ ఉంటేనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని అల్లగలరు. దీనికి కూడా ఆంగ్లభాషా నైపుణ్యం అవసరంలేదు. ఎందుకంటే, మెదడు ముందుగా మాతృభాషలోనే ఆలోచించి మేధకు పదును పెడుతుందనేది ప్రకృతి సహజమైన విషయం.

జాతీయోద్యమం నాటి సాహిత్య చరిత్ర అధ్యయనంలో భాగంగా ఇంగ్లీషు పరిపాలనా వ్యవస్థలో ఆంగ్ల పాఠశాలలుంటే గ్రామీణ విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు చదువుకోలేకపోయే వారు. మాతృభాషలో బోధనను ప్రవేశపెట్టేసరికి చాలామంది గ్రామీణ విద్యార్థులు, స్త్రీలు, విద్యావంతులయ్యారు. దానితో శాస్త్రవిజ్ఞానాన్ని అందించే ఉన్నతవిద్య కూడా మాతృభాషలోనే అందించాలని జాతీయ నాయకుల ఉద్దేశంగా ఉండింది. మాతృభాషా మాధ్యమం ప్రవేశ పెట్టిన తరువాతనే భారతదేశంలో విద్యాభివృద్ధి శాతం పెరిగిందనేది చారిత్రక వాస్తవం.

స్వామి వివేకానంద చెప్పినట్లుగా విద్య అనేది ధైర్య, స్థైర్యాలను, ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి చేస్తుంది. ఇవన్నీ పిల్లలకు అలవడాలంటే మాతృభాష బోధనే ఉత్తమం. దీన్ని ముఖ్యమంత్రి గ్రహించాలని విజ్ఞప్తి.

■ డా. జె. కనకదుర్గ
విశ్రాంత ప్రధాన అధ్యాపకురాలు

## ఈ 'వివక్ష'ను వ్యతిరేకించండి

*(పౌరసత్వ సవరణ బిల్లుకు నిరసనగా తన ఉద్యోగానికి రాజీనామా చేసిన మహారాష్ట్ర ఐపీఎస్ అధికారి అబ్దుర్ రహ్మాన్ రాసిన బహిరంగ లేఖ పూర్తిపాఠం)*



**ప్రియమైన సోదర సోదరీమణులారా,**

చట్టవిరుద్ధంగా దేశంలోకి వచ్చిన శరణార్థుల్లో ముస్లిమేతరులైన హిందు, సిక్కు, క్రైస్తవ, బౌద్ధ మతస్థులకు భారతీయ పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ(సవరణ)బిల్లు, 2019, ముస్లింల పట్ల వివక్ష చూపుతుందని స్పష్టంగానే తెలుస్తున్నది. చట్టం ముందు అందరూ సమానమే అన్న రాజ్యాంగ ప్రాథమిక భావనకు వ్యతిరేకంగా ఉన్న ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగపు 14, 15, 25 అధికరణలను ఇది ఉల్లంఘిస్తున్నది. రాజ్యాంగ ఆత్మ, మౌలికతకే ఇది వ్యతిరేకం. ఒక వ్యక్తికి పౌరసత్వం కల్పించడం లేదా తిరస్కరించడానికి మతాన్ని ఆధారంగా తీసుకోవడం సహేతుకం కాదు.

మతం ఆధారంగా దేశాన్ని విభజించాలనేదే ఈ బిల్లు ప్రధానోద్దేశంగా ఉంది. ఇది ముస్లింలలో అనేక భయాందోళనలు రేకెత్తించింది. పౌరసత్వం కాపాడుకోవడం కోసం ముస్లింలు తమ మతవిశ్వాసాలను వీడి అన్యమతంలోకి మారేలా ఇది నిర్బంధ పెడుతుంది. ఇది వేర్పాటువాద, రాజ్యాంగ వ్యతిరేక బిల్లు.

ఎన్ఆర్సీ (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్)తో పాటే దీన్ని అమలు చేస్తారని మనం చాలాసార్లు విన్నాం. అసోంలో ఎన్ఆర్సీ అమలు తీరును, ఫలితాన్ని చూశాం. అక్కడ 19 లక్షల మంది ఎన్ఆర్సీలో నమోదు కాలేదు. వీరిలో 14–15 లక్షల మంది హిందువులే. ఆందోళనకరమైన దీని అమలు వల్ల నష్టపోయిన వారిలో దళితులు, గిరిజనులు, ఓబీసీలు, ముస్లింలతో పాటు అన్ని మతాలకు చెందిన పేదలే ఎక్కువగా ఉన్నారు. తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి అవసరమైన పత్రాలు సమర్పించడానికి వీరు అత్యధికంగా వ్యయం చేసి, ఆఫీసుల చుట్టూ తిరిగి, అధికారుల వెంట పరుగులు తీశారు. వారి కాళ్లావేళ్లాబడ్డారు.

ఎన్ఆర్సీ, క్యాబ్ (సిటిజన్‌షిప్ (అమెండ్‌మెంట్) బిల్లు) సంయుక్తంగా అమలు చేస్తే, ముస్లిమేతరులు అవసరమైన పత్రాలు సమర్పించకపోయినా వారిని శరణార్థులుగా ప్రకటించి భారతీయ పౌరసత్వాన్ని కట్టబెడతారు. అంటే, తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవలసిన బాధ్యత, భారం ముస్లింలపైనే పడుతుంది. వేల సంవత్సరాలుగా భారత దేశంలో నివసిస్తున్న ముస్లింలు అనేక గందరగోళాలు, కనాకష్టాలు అనుభవించవలసి ఉంటుంది. వీరిలో మెజారిటీ ప్రజలు ఈ దేశంలో జన్మించిన వారే. భారత దేశపు ఆత్మ అయిన మత బహుళత్వం, సహనశీలతలకు ఈ బిల్లు పూర్తి వ్యతిరేకం. దీని అమలు దేశ ప్రజల మధ్యనున్న సౌభ్రాతృత్వాన్ని, సత్సంబంధాలను నాశనం చేస్తుంది.

ఈ బిల్లును నేను ఖండిస్తున్నాను. సహాయ నిరాకరణగా ప్రభుత్వ సర్వీసులో కొనసాగవద్దనీ, రేపటి నుంచి ఆఫీసుకు వెళ్లకూడదనీ నిర్ణయించుకున్నాను. అందుకే, నా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నాను. నేను సర్వీసులో కొనసాగుతూ పేద ప్రజలకు న్యాయం చేకూర్చాలని కోరుకుంటున్న వారికి క్షమాపణలు తెలియజేసుకుంటున్నాను.

ఈ బిల్లు వల్ల భారీగా నష్టపోతున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ముస్లిం, తదితర అణగారిన, పేద ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో దీనికి తమ వ్యతిరేకతను ప్రకటించాలని వినమ్ర పూర్వకంగా కోరుతున్నాను. అదే విధంగా, దీన్ని వ్యతిరేకించాలంటూ సుసంపన్న, సమైక్య భారత్ ఆదర్శంగా గల సహనశీలురు, సెక్యులర్లు, న్యాయ ప్రేమికులైన హిందూ సోదరులకు కూడా విజ్ఞప్తి చేస్తున్నాను. దీన్ని సుప్రీం కోర్టులో సవాల్ చేయాలంటూ పౌర, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలను కోరుతున్నాను.

— అబ్దుర్ రహ్మాన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు 70, జూబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

## గమనం.. వందనం..



■ తెలకపల్లి రవి
గమనం

తెలుగు పత్రికల్లో దీర్ఘ కాలం కొనసాగుతూ వచ్చిన శీర్షికల్లో ఒకటైన గమనం 2020 అరుదెంచుతున్న వేళ మీ దగ్గర సెలవు తీసుకుంటుంది. భూకంపాలు ప్రభుత్వ పతనాలూ అన్నిటి విశ్వరూప సాక్షాత్కారం అన్నట్టుగా ఈ కాలమ్ నన్ను ఇన్నేళ్లలోనూ లక్షలాది పాఠకులకు చేరువ చేసింది. ప్రేమాభిమానాలు సంపాదించి పెట్టింది. మధ్యలో కొంత విరామం వున్నా దాదాపు పదిహేడేళ్ళ పైబడిన పయనమిది. అర్థవంతమైన అక్షరయాత్ర. స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథంతో పాటు అదే భాషలో ఇతర పత్రికల సంపాదకత్వ బాధ్యత కూడా చూస్తున్న వారితో కాలమ్ రాయించడం బహుశా చాలా చాలా అరుదై వుంటుంది. నాకైతే అలాటి మరో ఉదాహరణ కూడా తెలియదు. ఆంధ్రజ్యోతి యాజమాన్యం, సంపాదకవర్గ సౌజన్యం వల్లనే అది సాధ్యమైంది. కె.రామచంద్రమూర్తి సంపాదకుడుగా వుండగా అనుకున్న ఆలోచన ఇది. కె. శ్రీనివాస్ ఫోన్ చేసి ముహూర్తం నిర్ణయించారు. 2003లో అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం చివరి పాదంలో వుండగా రాయడం మొదలైంది. గమనం నామకరణం అయ్యాక మొదట ప్రతి బుధవారం వచ్చేది. అనుకోని కారణాల వల్ల 2007 చివరలో ఆగిపోయి మళ్లీ 2008 చివరలో కావచ్చు పునఃప్రారంభమైంది. ఆ రోజు ఆర్కేకు ఫోన్ చేస్తే ఎప్పటి నుంచి రాస్తారు అంటూ వెంటనే కొనసాగించారు. కాకపోతే వచ్చే వాటికి చోటు కల్పించడం సమస్యగా వుంది గనక వారం వారం గాకుండా ప్రతి రెండో శుక్రవారం వెలువడుతూ వచ్చింది. ఈ మధ్య కాలంలో జాతీయంగా వామపక్షాల మద్దతుతో యుపిఎ ఆవిర్భావం, విడిపోవడం, వైఎస్ రాజశేఖర రెడ్డి పాలన, ఆరోపణలూ పోరాటాలూ టిఆర్ఎస్ విస్తరణ, కెసిఆర్ వ్యూహ ప్రతివ్యూహాలు... ప్రతిదీ గమనంలో కనిపించింది. గమనం శీర్షికలు కూడా పదాల విరుపుతో ప్రాసతో రాయడం ఒక ఒరవడిగా మారింది.

ఒకటిన్నర దశాబ్దం పైబడిన నా కాలమ్‌లో నాకు నిర్దేశకాలు ఇవ్వడం గాని, నియంత్రించడం గాని జరగలేదని మనస్ఫూర్తిగా చెప్పగలను. మరో పత్రిక పేరు కూడా రాయడానికి ఇష్టపడని సంప్రదాయం మీడియాలో వున్నా ఆంధ్రజ్యోతి సంపాదకులు ఏనాడూ అడ్డు పెట్టింది లేదు. వార్తా కథనాలతో ఏకీభవించనివారు కూడా ఆంధ్రజ్యోతి సంపాదక పేజీని భిన్న కోణాల సమాహారంగా చూస్తారందుకే. అన్ని విషయాలపై స్వేచ్ఛగా రాయడానికి, అభిప్రాయాలు పంచుకోవడానికి నాకు అవకాశమిచ్చింది ఆంధ్రజ్యోతి గమనం. ఆదరించింది పాఠక జనం, మిత్ర గణం. అందరికీ అక్షరాలా వందనం.

మొదలు పెట్టినప్పుడు రాజకీయ పరిణామాల కన్నా సాంస్కృతిక అంశాలు ఎక్కువగా తీసుకునేవాణ్ణి. డయానా పదో వర్ధంతికి 'రాజుసఖి', ప్రిన్స్ చార్లెస్ మళ్లీ పెళ్లి చేసుకున్నప్పుడు 'అమర ప్రేమ భ్రమర ప్రేమ', లవకుశ చిత్రంలో కొత్త కోణాలు చూపించేలా 'లవకుశ నవదిశ' చదివి ఒక ప్రొఫెసర్ ఇప్పటికీ కలిసినప్పుడల్లా గుర్తు చేస్తుంటాడు. గద్దర్ వేషధారణకు సంబంధించి రంగనాయకమ్మ వ్యాసంపై స్పందనను 'డ్రస్సూ అడ్రస్సు', ఒక నిర్మాత హుసేన్ సాగర్‌లో దూకినప్పుడు 'వినోదం విషాదం', ఆనంద్‌తో సహా చిత్రాలకు వచ్చిన అవార్డులపై 'నందులూ ఆనందులూ' అంటూ రాశాను. ప్రపంచాన్ని వుర్రూతలూపిన హారీ పాటర్‌పై 'హార్నీ హారీ' అంటూ పలకరించాను. టీవీ చర్చలకూ వెళ్లడం వల్ల ఎజెండా ఎక్కువై ఏది రాయాలో ఎంచుకోవడం ఎప్పుడూ కష్టంగానే వుండేది. 'దారుణాలూ కారణాలూ', 'ఉరి గురి', 'దళితులూ జ్వలితులూ', 'నిజాలు జనాలు', విశేషాలూ సశేషాలూ, విలాసాలు వికృతాలూ ఇలాటివన్నీ గమనంలో కనిపించాయి. మీడియాపైన కూడా తరచూ రాస్తుండేవాణ్ని. 'దృశ్యమూ భాష్యమూ' అన్నది టీవీలకు మారిపోతున్న కాలంపై సమీక్ష. తెలుగు సినిమా వజ్రోత్సవ వేళ వివాదాన్ని 'ది ఎండ్ లెజెండ్' అంటూ పరామర్శించడం ఇప్పటికీ గుర్తుంది.



ఏడాది ముగిసిపోతున్న వేళ 'స్వగతాలూ స్వాగతాలూ' అంటూ ముగించామోసారి. వాస్తవం చెప్పాలంటే దినపత్రికలో మామూలుగా చర్చకు రాని అంశాలు తీసుకుని రాస్తే అమితాదరణ లభించేది. నేను పాల్గొన్న సభలూ కార్యక్రమాలపై సింహాచలం టు భద్రాచలం, కడప టు ఢిల్లీ ఇలా సింహావలోకనం చేసేవాణ్ణి. మంచి పుస్తకాల పరామర్శ చేసేవాణ్ణి.

కేవలం కళలూ సాహిత్యమే కాదు, కీలకమైన రాజకీయ పరిణామాలూ అంతర్జాతీయ విషయాలను కూడా వదలిపెట్టింది లేదు. 'తెలుగు తల్లి' అనేది అప్పటి వివాదంపై పరామర్శ. 'ఇండియా ఇంగ్లీషు', 'భాష భాష్యం', 'ఏలిక నాలిక' 'ఎన్‌కౌంటర్లు గన్‌కౌంటర్లు' వంటివన్నీ ఆ తరహాకు చెందినవే. 'నిజమూ నిజామూ' అన్నది మరొటి. 'క్షమలూ భ్రమలూ' అన్నది ఉరిశిక్ష ఖైదీలకు సంబంధించిన మీమాంస. సభలో వైఎస్– చంద్రబాబుల మధ్య జరిగిన వివాదమే 'నేతలూ మాతలూ'. 'కళ కార్పణ్యం' అన్నది చిత్రకారులు దర్శకులపై దాడికి స్పందన. 'సేతువూ హేతువు' రామసేతుపై ఇప్పటికీ సాగుతున్న రభసే. ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్‌ను అజ్ఞాతంగా హతమార్చి వార్త విడుదల చేసినప్పుడు 'షహీద్ సద్దాం' అని రాశాను. కమ్యూనిస్టుల విజయాలను 'ఎరుపూ గెలుపూ' అని వర్ణించినట్టే ఎదురు దెబ్బలు తగిలినప్పుడు 'మార్క్సిస్టు మధనం' అనీ రాశాను. 'ప్రకటన ప్రభావం' పదేళ్ల కిందట డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటనపై రాసింది. అందుకే ఇది కేవలం నా కాలమ్ మాత్రమే కాదు, కాలానికి దర్పణం.

వైఎస్ రాజశేఖర రెడ్డి, జయలలిత, నండూరి రామమోహనరావు, బూదరాజు రాధాకృష్ణ, దాసరి నారాయణ రావు, సి. నారాయణరెడ్డి, విజయ నిర్మల వంటి వారెందరికో గమనంలో నివాళి అర్పించాను. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ కన్ను మూసినప్పుడు 'రాగమూ రత్నమూ' అంటూ పతాక శీర్షికల్లో 'షెహనాయి రోదిస్తున్న స్వరం' అని రాస్తే ఒక పాత్రికేయ మిత్రుడు కదలిపోయి ఫోన్ చేయడం ఇంకా గుర్తుంది. కమ్యూనిస్టు యోధుడైన మా నాన్న నరసింహయ్యకు 'ఆయనే మా నాయన' అంటూ జోహార్లు పలికితే చదివి కళ్లు చెమ్మగిల్లాయని ప్రముఖులు ఫోన్ చేశారు.

ఆర్కే 'కొత్తపలుకు', రామచంద్రమూర్తి 'సకాలం', కె. శ్రీనివాస్ 'సందర్భం' లోని విషయాలను కూడా ప్రస్తావించి భిన్నంగా రాసినా ఏనాడూ అభ్యంతర పెట్టింది లేదు. నిజం చెప్పాలంటే ఒకటిన్నర దశాబ్దం పైబడిన నా కాలమ్‌లో నాకు నిర్దేశకాలు ఇవ్వడం గాని, నియంత్రించడం గాని జరగలేదని మనస్ఫూర్తిగా చెప్పగలను. ఇదే కాలంలో మరో ప్రముఖ పత్రికలో కాలమ్ కోసం చర్చ జరిగింది. వారు రాజకీయాలు ముట్టుకోరాదని, విషయం ముందే చెప్పాలనీ బోలెడు షరతులు పెట్టారు. ఆ పత్రికకు సంబంధించిన అంశాలు కూడా గమనంలో నేను యథేచ్ఛగా రాసేవాణ్ని. మరో పత్రిక పేరు కూడా రాయడానికి ఇష్టపడని సంప్రదాయం మీడియాలో వున్నా ఆంధ్రజ్యోతి సంపాదకులు ఏనాడూ అడ్డు పెట్టింది లేదు. వైఎస్ ప్రభుత్వ హయాంలో మార్గదర్శి సమస్యపై వ్యాఖ్యానం ప్రచురించింది గమనం మాత్రమే. రాష్ట్ర విభజన తర్వాత 'ఏపి క్యాపిటల్ ఎట్ పిపిపి' అన్నా, విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై దాడిని గురించి 'ఒకదాడి అనేక నిజాలు' అని భిన్న కోణాలు రాసినా నిరాఘాటంగా ప్రచురించారు. వార్తా కథనాలతో ఏకీభవించని వారు కూడా ఆంధ్రజ్యోతి సంపాదక పేజీని భిన్న కోణాల సమాహారంగా చూస్తారందుకే. ఈ కాలంలో మంత్రులూ ఎంఎల్ఎలూ ఎంపిలూ మాజీలూ దర్శకులూ ప్రవచన కర్తలూ కూడా ఫోన్లు చేసి అభినందించడం సర్వసాధారణంగా జరుగుతూ వచ్చింది. ఇతర పత్రికల సంపాదకులూ పాత్రికేయులు కూడా స్నేహపూర్వకంగా మెచ్చుకోవడం మరపురాని అనుభవం.

ఈ కాలంలో దేశంలో చాలా పరిణామాలు జరిగాయి. సమీకరణాలు మారాయి. తెలుగు రాష్ట్రాలనే బహువచనం వచ్చింది. మీడియా ఎలక్ట్రానిక్ దశ దాటి సోషల్ మీడియాగా మారింది. స్నేహితులందరూ సన్నిహితులుగా వుండలేని స్థితిగతులు చాలామందికి వచ్చాయి. అరివీర భయంకర విమర్శకులు ఆస్థానాలలో చేరిపోయారు. విశ్వాసాలు విలువలూ నిరంతర తాకిడికి గురవుతున్నాయి. ఆశయాలను అవహేళన చేయడం పరిపాటిగా మారింది. సంపదలూ సర్కార్లు మీడియాను శాసిస్తామంటున్నాయి. భిన్నాభిప్రాయాలను ఛిన్నాభిన్నం చేయాలని చిందులేస్తున్నాయి. అసహనం తాండవిస్తున్న ఇలాటి వేళ అన్ని విషయాలపై స్వేచ్ఛగా రాయడానికి, అభిప్రాయాలు పంచుకోవడానికి నాకు అవకాశమిచ్చింది ఆంధ్రజ్యోతి గమనం. ఆదరించింది పాఠక జనం, మిత్ర గణం. అందరికీ అక్షరాలా వందనం. ■

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శుక్రవారం • 13 డిసెంబర్ 2019

సొగసు

# జబర్దస్త్ జాకెట్స్!

**దుస్తులకు కొత్త రూపం, హుందాతనం జోడించాలంటే వాటి పైన 'జాకెట్' ధరించాలి. చుడీదార్ మీదకు ఇలాంటి జాకెట్లు బాగా నప్పుతాయి. నచ్చిన డిజైన్లలో, అందమైన రంగుల్లో, ఆకర్షణీయమైన పనితనంతో కూడిన జాకెట్స్‌కు ముస్తాబులో చోటు కల్పించి, ట్రెండ్ సెట్టర్‌గా వెలిగిపోండి!**

**కాంట్రాస్ట్:** ప్లెయిన్ కలర్ చుడీదార్ మీదకు డిజైన్ ఉన్న జాకెట్ సరికొత్త ఆకర్షణ తెచ్చిపెడుతుంది. పువ్వులు, లతలు ఉన్న జాకెట్ లేదా జామెట్రిక్ డిజైన్ కలిగిన జాకెట్ ఎంచుకోవచ్చు. శాటిన్ చుడీదార్ మీదకు కాటన్‌తో తయారైన జాకెట్ బాగుంటుంది. ఒకవేళ కాటన్ చుడీదార్ అయితే జాకెట్ శాటిన్‌దై ఉండాలి.



**రాజస్థానీ స్టయిల్:** రొటీన్‌కు భిన్నమైన జాకెట్ ధరించాలనుకుంటే, రాజస్థానీ స్టయిల్ జాకెట్ ఎంచుకోవాలి. ఛాతి దగ్గర కుచ్చులుగా ఉండే ఈ జాకెట్ ఎలాంటి చుడీదార్‌కి అయినా నప్పుతుంది. అయితే చుడీదార్ ఏ రంగులో ఉంటుందో జాకెట్ కూడా అదే రంగులో ఉండాలి.

**ఎంబ్రాయిడరీ:** ప్లెయిన్ కలర్ చుడీదార్ మీద ధరించే జాకెట్ ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్నదైతే మరింత ఎట్రాక్టివ్‌గా కనిపిస్తారు. ఎంబ్రాయిడరీ కోసం వాడిన రంగు ధరించిన ప్యాంట్ రంగుతో మ్యాచ్ అయ్యేలా ఉండాలి.

నగ ధగ

# పూసల ఊసులు!



బంగారం, వజ్రాల నగలతో పాటు పూసల నగలకూ ఆదరణ పెరుగుతోంది. రొటీన్‌కు భిన్నంగా కనిపించాలనుకునేవారు ఈ నగలను ఎంచుకోవచ్చు. దుస్తులకు మ్యాచ్ అయ్యే పూసల నగలు ఎంచుకుంటే నలుగురి దృష్టినీ ఆకర్షించవచ్చు!

**పలు రంగుల్లో:** మోజనైట్స్, టాంజనైట్స్, రష్యన్ ఎమరాల్డ్స్, లైట్ గ్రీన్ ఎమరాల్డ్స్... రంగును బట్టి నచ్చిన రకం పూసలు ఎంచుకోవాలి. గులాబీ, ఆకుపచ్చ, లేత నీలం, ఆకుపచ్చ రంగుల్లో మెరిసిపోయే ఈ పూసలతో తయారైన నగలు ప్రత్యేక ఆకర్షణ కలిగి ఉంటాయి.



మార్పిడి సమయంలో ఈ పూసలకు పెట్టిన ధర రాకపోయినా, నగలకు కొత్త ఆకర్షణ తెచ్చిపెడతాయి. కాబట్టి వేడుకల్లో ధరించడానికి నిస్సంకోచంగా వీటిని ఎంచుకోవచ్చు.

**అందరికీ తగినవి:** అబ్బాయిల కోసం పులిగోళ్లలో పొదిగే ఎమరాల్డ్స్, పరిమాణాన్ని బట్టి రూ. 3 నుంచి 5 లక్షల ధరలో దొరుకుతాయి. అలాగే మెడలో ముత్యాలు, ఎమరాల్డ్స్, సైడ్ పెండెంట్ కూడా ధరించడం తాజా ఫ్యాషన్. వయసు పైబడిన మహిళలు శంఖుచక్రనామాల పెండెంట్లు, అమ్మవారి పెండెంట్లు ధరించవచ్చు. ముడికి తగిలించుకునే నగలూ ఎంచుకోవచ్చు!



• **మంజులా రావు**
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

ఇలా చేయండి!

## బద్ధకం పోవాలంటే..



బద్ధకంగా అనిపించిన వెంటనే ఒళ్లు విరుచుకుంటాం! అనాలోచితంగా చేసే ఈ చర్యతో శరీరంలోని కండరాలు వదులై, మెదడు చురుకుగా మారుతుంది. అయితే ఇదే ఫలితాన్నిచ్చే యోగాసనాలు కూడా ఉన్నాయి!

**బాలాసనం:** పసిపిల్లలను పోలిన ఈ భంగిమతో పిరుదులు, కాలి పిక్కలు, తొడలతో పాటు ఉదరం దగ్గర కండరాలు సాగుతాయి.

**త్రికోణాసనం:** నడుము కింది భాగం, కాళ్లలోని కండరాలు స్ట్రెచ్ అవుతాయి. ఎక్కువ సమయం ముడుచుకుని ఉన్న కాళ్లకు రక్తప్రసరణ మెరుగవుతుంది.

**అదోముఖ శవాసనం:** ఈ ఆసనంతో ఉదరం, భుజాలు, ఛాతి దగ్గరి కండరాలు స్ట్రెచ్ అవుతాయి. ఛాతిలో పట్టేసినట్టు అనిపించే భావన పోతుంది.

న్యూస్‌మేకర్

# లెక్కల చిక్కుముడి విప్పింది!

**నీనాగుప్తా... గణితంలోని చిక్కు ప్రశ్నలను అలవోకగా పరిష్కరించగల దిట్ట. తాజాగా 70 ఏళ్లకు పైగా చిక్కుముడిలా ఉన్న ఒక ప్రశ్నకు పరిష్కారం చూపినందుకు ఈ ఏడాది ప్రతిష్టాత్మకమైన 'శాంతి స్వరూప్ భట్నాగర్' అవార్డు గెలుచుకున్నారు నీనా. ఈ అవార్డు అందుకున్న పిన్నవయస్కురాలిగా, మొదటి మహిళా గణితవేత్తగా గుర్తింపు సాధించిన ఈ 35ఏళ్ల గణిత మేధావి విశేషాలు...**

కోల్‌కత్తాకు చెందిన నీనా గుప్తా ప్రస్తుతం అక్కడి

$$\begin{cases} 2x_1 + x_2 = 7 \\ x_1 + x_2 - 3x_3 = -10 \\ 6x_2 - 2x_3 + x_4 = 7 \\ 2x_3 - 3x_4 = 13 \end{cases}$$

'ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్' (ఐఎస్ఐ, కోల్‌కత్తా)లో మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బీజగణితం, రేఖాగణితంలో నిపుణురాలైన ఆమె డెబ్బయి ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న 'జరిస్కీ క్యాన్సలేషన్ ప్రాబ్లమ్'కు పరిష్కారం చూపారు. దాంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత మేధావుల ప్రశంసలు అందుకున్న నీనాను ఈ ఏడాది గణితం విభాగంలో 'శాంతి స్వరూప్ భట్నాగర్' అవార్డుకు ఎంపికచేశారు. "బీజగణితం, రేఖాగణితంలో ఈమధ్య కాలంలో జరిగిన అత్యుత్తమ వర్క్"అని ఈ సందర్భంగా అవార్డ్ కమిటీ ప్రస్తావించడం విశేషం.

- 2014లో 'ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ' నీనాకు 'యంగ్ సైంటిస్ట్' అవార్డు ప్రదానం చేసింది.
- మ్యాథ్స్‌లో అడ్వాన్స్డ్ స్టడీకి గానూ 2014లో 'రామానుజన్ ప్రైజ్' గెలుచుకున్నారు నీనా.

**అమ్మే తొలి గురువు..**

గణితం అంటే నీనాకు చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. దానికి తోడు వాళ్ల అమ్మ ఆమెకు పదో తరగతి వరకు ఇంటి వద్ద గణితం భోదించేవారు. కోల్‌కత్తాలోని ఖల్సా స్కూల్లో టెన్త్ చదివిన నీనా బెతునే కాలేజీ నుంచి గణితంలో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఐ.ఎస్.ఐ.లో పీజీ చేసి, అక్కడే బీజగణితం, రేఖాగణితంలో పీహెచ్‌డీ చేశారు. "నేను పీహెచ్‌డీ చేస్తున్న రోజుల నుంచి 'జరిస్కీ క్యాన్సలేషన్ ప్రాబ్లమ్' గురించి తెలుసు. కానీ నేనే దీనికి ఒక పరిష్కారం చూపెడతానని ఎప్పుడూ అనుకోలేదు"అంటారు నీనా. ఈ విజయం ఆమెకు ఒక్క రోజులో సాధ్యపడలేదు. దీని వెనుక కొన్ని ఏళ్ల నిరంతర శ్రమ, ఓపిక దాగున్నాయి. "గణితంలో మూలాల మీద పట్టు ఉండడం, టీచర్ల సహకారం, ప్రోత్సాహం నా విజయానికి కారణం. విజయం సాధించిన ప్రతి వ్యక్తి వెనుక ఒక్కరు కాదు చాలామంది ఉంటారు. మా అమ్మానాన్న నన్ను ఉన్నత విద్యావంతురాలిగా చూడాలని కలలు కన్నారు. వారు అనుకున్న దానికన్నా ఎక్కువే సాధించాను. గణితవేత్తగా ఈ ప్రయాణంలో నా పీహెచ్‌డీ గైడ్



ప్రొఫెసర్ అమర్త్య కుమార్ దత్త ప్రోత్సాహం మరువలేనిది. నా భర్త, కుటుంబసభ్యుల తోడ్పాటు ఎంతో ఉంది. తమంత తాముగా సమస్యలకు పరిష్కారం కనుక్కునే వారికి మ్యాథ్స్ సరైన ఎంపిక. గణితంలోని చిక్కు ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో ఉండే ఆనందం, తృప్తి అవార్డు అందుకోవడం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. నాతో పాటు ఈ ఏడాది మిగతా విభాగాల్లో శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు అందుకున్న 547మందిలో మహిళలు 17 మంది మాత్రమే ఉన్నారు. పరిశోధనా రంగంలో మహిళల సంఖ్య తక్కువ ఉండడానికి ప్రధాన కారణం ఆడపిల్లల్ని ఉన్నత చదవులకు పంపకపోవడమే. ఈ విషయంలో సమాజంలో మరింత అవగాహన పెరగాలి" అని వివరిస్తారు నీనా.

## ముత్యాల ముగ్గు

25 చుక్కలు
సరిచుక్క
1 వచ్చే వరకు



**తుమ్మల సులోచన**
నల్లగొండ

21 చుక్కలు
5 వరుసలు





**అజంత**
ఎర్రబల్లి, నెల్లూరు జిల్లా

## ముత్యాల ముగ్గు వేయండి

పండగ నెల వచ్చేసింది.
మరోసారి ముగ్గుల సందడి తెచ్చేసింది.
ఎప్పటిలానే ఇంటింటా వాకిట్లో...
ముత్యాల ముగ్గుల హంగామాకు **ఆంధ్రజ్యోతి** శ్రీకారం చుట్టేసింది.
వెన్నెల పిండారబోసినట్లు ఈ ధనుర్మాసంలో...
మీ వాకిళ్లన్నీ ముగ్గుల పరిమళాలతో గుబాళించనివ్వండి. తెలుగింటి ఆడపడుచులు ఈ ముగ్గుల సందడిని మీ ఇంటికే పరిమితం కానివ్వకుండా నలుగురితో పంచుకోండి.
అందుకు మీరు చేయాల్సిందల్లా...

చక్కటి చుక్కల ముగ్గులను స్పష్టంగా తెల్ల కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపడమే!
ముగ్గుకు ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా తెలపండి.
ముగ్గుతో పాటు మీ పాస్‌పోర్టు సైజు ఫోటో, మంచి క్వాలిటీలో, పెద్ద సైజులో పంపడం తప్పనిసరి.

**వెంటనే మీ ముత్యాల ముగ్గులు పంపండి.**
**మీ పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.**

**మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.**
ఈ-మెయిల్: navya@andhrajyothy.com



‘మాసాలలో మార్గశిరాన్ని నేనే!’ అన్నాడు శ్రీకృష్ణుడు. అంతేకాదు, ఆ మాసంతో ముడిపడిన ధనుర్మాస వ్రతం పరమ విశిష్టం. ప్రత్యేకించి తన హృదయాన్ని మాలగా శ్రీకృష్ణుడికి అర్పించి, ఆయన కోసం అల్లిన దండలను తాను ధరించి, ‘ఆముక్తమాల్యద’గా వినుతికెక్కిన గోదాదేవి ‘తిరుప్పావై’ పాశురాలను వెలయించిన పవిత్ర సమయం ధనుర్మాసమే! ఆ స్వామిని తన స్వామిగా చేసుకున్న ఆండాళ్ భక్తి ఆ పాశురాల్లా ఆద్యంత రమ్యం!

# సుమధుర భక్తి వేదం!

విశేషం

ఈనెల 16 నుంచి ధనుర్మాసం

శ్రీరంగనాథుడిని భర్తగా పొందడానికి ధనుర్మాసంలో మార్గళి వ్రతాన్ని ఆచరించిన సందర్భంలో, వటపత్ర శాయిని కీర్తిస్తూ గోదాదేవి పాడిన పాశురాలు ‘తిరుప్పావై’గా నాలాయిర ప్రబంధంలో నిబద్ధమయ్యాయి. ద్రవిడ వేదానికి తిరుప్పావై హృదయం లాంటిది.

‘తిరుప్పావై’ అనే మాట వినగానే గోదాదేవి కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. గోదాదేవినే ‘ఆండాళ్’ అని పిలుస్తారు. ఉపనిషత్సారమైన బ్రహ్మవిద్య తిరుప్పావైగా ప్రసిద్ధి పొందింది. తమిళంలో ఈ గ్రంథాన్ని ‘వేదమనైత్తుక్కుం విత్తాంగు’ అంటారు. ‘వేదరాశి అంతా ఒక వృక్షం అయితే, దాని బీజం తిరుప్పావై’ అని భావం. పణ్ణిద్దరు (పన్నెండు మంది) ఆళ్వారులు పాడిన/ రచించిన పాశురాలు ’నాలాయిర (నాలుగువేల) దివ్య ప్రబంధం’గా, ‘ద్రవిడవేదం’గా ప్రసిద్ధి పొందాయి. ఆ ఆళ్వారులలో గోదాదేవి ఒక్కరే మహిళ.

మహావిష్ణువు ఆజ్ఞ మేరకు సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మి భూలోకంలో గోదాదేవిగా అవతరించింది. శ్రీవిష్ణుచిత్తుల (పెరియాళ్వార్) ముద్దుబిడ్డగా పెరిగి, ఆండాళ్‌గా అందరి హృదయాలనూ దోచుకుంది. శ్రుతి, స్మృతుల మూలార్థాన్ని తేట తేట పదాలతో తమిళంలో పాశురాలుగా పాడి, ధనుర్మాస (శ్రీ) వ్రతాన్ని ఆచరించింది. ఆనాడు గోపికలు అనంత శక్తిస్వరూపుడైన శ్రీకృష్ణుణ్ణి ‘ప్రియమైన’ చెలికాడు అనే దృష్టితో ఆరాధించారు. ఆయనను పొందగలిగారు. అదే దృష్టితో నారాయణుణ్ణి గోదాదేవి ఆరాధించింది. ఆమె శ్రీకృష్ణుణ్ణి ప్రియునిగా భావించి, నాయికా భావంతో శ్రీరంగనాయికగా ప్రకటితమైన మహిత ప్రేమమూర్తి.

**మార్గాలన్నిటికీ తలమానికం**

‘ధనుస్సు’ అంటే ఉపనిషత్ అర్థంలో ‘ప్రణవం’! అదే ‘ఓంకారం’, అదే పరబ్రహ్మం!! ‘ఆ పరమాత్మను చేరుకోవడానికి ఓంకారాన్ని ఉపాసించడమే సరైన సాధనం’ అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. ద్వాపర యుగంలో శ్రీకృష్ణుణ్ణి పొందడానికి గోపికలు కాత్యాయనీ వ్రతాన్ని ఆచరించిన విధానాన్ని తెలుసుకున్న ఆండాళ్ ధనుర్మాస వ్రతాన్ని చేయాలని సంకల్పించింది.

సూర్యుడు మార్గశిర మాసంలో- ధను రాశిలో ప్రవేశించినప్పటి నుంచి మకర రాశిలో ప్రవేశించే వరకూ... ఆ ముప్ఫై రోజులూ ధనుర్మాసం. మార్గశీర్షంలో ప్రారంభమైన ఈ మాసం మకర సంక్రాంతి వరకూ కొనసాగుతుంది. అందుకే మార్గశీర్ష మాసానికి అంత ప్రాధాన్యం. ‘మార్గం’ అంటే దారి. భగవంతుణ్ణి పొందడానికి భక్తులకు ఎన్నో మార్గాలు ఉన్నా వాటన్నిటికీ ఇది శీర్షం. అంటే శిరస్థానీయమైనది. అందుకే ఈ వ్రతానికి ‘మార్గశీర్ష వ్రతం’ అనీ, ‘స్నాన వ్రతం’ అనీ, ‘శ్రీవ్రతం’ అనీ.. . ఇలా ఎన్నో పేర్లు ఉన్నాయి.

**విశ్వ మంగళప్రదం**

తన నెచ్చెలులు అందరినీ స్నానానికీ, వటపత్రశాయిని సేవించడానికీ రమ్మంటూ వేకువజామునే ఆండాళ్ ఆహ్వానించింది. భవతాప తప్తులైన వారి తాపం చల్లారాలంటే సౌలభ్య, సౌశీల్య, వాత్సల్యాది గుణపూర్ణుడైన ఆ స్వామిలో విశ్వాసం ఉంచి, జ్ఞానం పొందాలనీ, అదే పరమానందమనీ చెప్పింది. ఆ వ్రతం తమకే కాదు, విశ్వం అంతటికీ మంగళప్రదమని చెబుతూ అందరినీ ఒప్పించింది.

వైష్ణవ సంప్రదాయంలో మధుర భక్తి భావనకూ మిగిలిన అన్ని భక్తి భావనల కన్నా విశేష ప్రాధాన్యం ఉంది. వ్యక్తిగత సామీప్యం, అనన్య భావన అనే రెండిటిలో వ్యక్తిగత సామీప్యంలో ఉన్న మాధుర్యానికి ఉన్న ఔన్నత్యం మరెక్కడా కనిపించకపోవడమే దీనికి కారణం. ఆ భావనను పరిపూర్ణంగా ఆవాహన చేసుకొని గోదాదేవి పాడిన పాశురాలు దివ్య ప్రేమబంధంలో ఎగసిపడే తరంగాలు. హృదయ విపంచిని మీటే మధురనాదాలు. ఎదను పులకింపజేసే మంజుల మలయానిల వీచికలు.

● ఎ.సీతారామారావు

ధర్మపథం

## మౌనం అంటే...

‘మౌనేన కలహం నాస్తి’ అంటారు పెద్దలు. అంటే ‘మాట్లాడకుండా ఉండేవారికి గొడవలు రావు’ అని అర్థం. చెట్లు మాట్లాడవు. అలాగే రాళ్ళు మాట్లాడవు, రప్పలు మాట్లాడవు. నిర్జీవులేవీ మాట్లాడవు. కాబట్టి మనం కూడా అలా నిర్జీవుల్లా ప్రవర్తిస్తే సరిపోతుందా? మరి, పాములూ, తేళ్ళూ మాట్లాడవు. చీమలు మాట్లాడవు, పోట్లాడవు. కానీ అవి కనిపించగానే భయపడతాం. వెనకాముందూ చూడకుండా చంపడానికి ప్రయత్నిస్తాం. కాబట్టి కలహం, శత్రుత్వం అనేది కేవలం మాటల వల్ల మాత్రమే కలకదు. మాట్లాడనంత మాత్రాన కలగకుండానూ ఉండదు.



మాట్లాడని వాళ్ళని ‘మౌని’ లేదా ముని అంటాం. మాట్లాడకుండా చెడ్డ పనులు చేస్తే ముని అవుతాడా? కాబట్టి ‘మౌని’ అంటే మాట్లాడని వాడు మాత్రమే కాదు, చెడ్డ పనులు చేయనివాడు. అందుకే ‘మునేర్భావో మౌనం’ అంటారు. అంటే ముని భావం, ఆలోచన మౌన రూపంలో ఉంటుంది. బుద్ధుడి కాలంలో శ్రమణక సాంప్రదాయాలు అనేకం ఉండేవి. కొందరు అసలు మాట్లాడేవాళ్ళే కాదు. శ్రమణకులు భిక్ష మీదే జీవించేవారు. భిక్ష స్వీకరించి మౌనంగా వెళ్ళిపోయేవారు. కానీ బౌద్ధ భిక్షువులు అలా మౌనంగా వెళ్ళిపోకూడదు. భిక్షను స్వీకరించాక, అది అందించిన వారికి కొంత ధర్మ ప్రబోధం చేసేవారు. ప్రబోధం చేయకుండా భిక్ష స్వీకరించకూడదు. అది బౌద్ధ నియమం.

దీన్ని ఇతర శ్రమణులు ఎత్తి చూపుతూ-

“చూశారా! ఈ బౌద్ధ భిక్షువులు మౌనం పాటించరు. బుద్ధుణ్ణి ‘శాక్య ముని’ అంటారు. ఎంత హాస్యాస్పదం! భిక్ష స్వీకరించాక ధర్మ ప్రబోధం చేస్తారు. వీరు మునులు (శ్రమణులు) కారు” అని గేలి చేస్తూ ఉండేవారు.

కొందరు భిక్షువులు ఈ విషయాన్ని బుద్ధునికి చెప్పారు. అప్పుడు బుద్ధుడు- “భిక్షువులారా! మౌనం అంటే నోరు మూసుకొని ఉండడం కాదు. ఒక మూల నోరు మెదపకుండా కూర్చోవడం కాదు. అలా ఎవరైతే ప్రవర్తిస్తారో- నిజానికి వారు దుర్బలులు. తమ జ్ఞానాన్నీ, తమకు తెలిసిన సాధననూ, ఇతరులకు పంచడం ఇష్టపడని పిసినారులు, స్వార్థపరులు. ఎవరు మంచి పనులు చేస్తారో, ఇతరులు అలా చేసేట్టు చేస్తారో వారే మౌనులు. ‘మౌనం’ అంటే మంచి భాషణం. మంచి భావం. అంతేకాని మాట్లాడకపోవడం కాదు” అని చెప్పాడు.

● బొర్రా గోవర్ధన్

సందేశం

## దేవుణ్ణి మరచినవారికి గుణపాఠం

యెమన్ రాజ్యం సబా పాలకుల హస్తగతం అయింది. దాంతో ముఅన్నియా పాలన అంతమైంది. సబాలు కూడా పాత రాజుల సాంప్రదాయాలు, భాష, విధానాలనే అవలంబించారు. అతి కొద్దికాలంలోనే వారు అసాధారణ ప్రగతి సాధించారు. మారిబ్ పట్టణం రాజధానిగా వారి పరిపాలన కొనసాగింది. యెమన్ చాలా సారవంతమైన దేశం. విశాలమైన లోయలు, మైదానాలతో విరాజిల్లే దేశం. కానీ నీటి సమస్య తీవ్రంగా ఉండేది. వర్షాకాలంలో వానలు బాగా కురిసేవి. కానీ వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండేది కాదు. మొత్తం నీరంతా వృథాగా పోయేది.

యెమన్ ప్రజలు కష్టజీవులు. ఒక గొప్ప నీటిపారుదల వ్యవస్థను నిర్మించుకున్నారు. అక్కడ సహజమైన నదులేవీ లేవు. అందుకని వర్షపు నీటిని ఆనకట్టల ద్వారా తమ అవసరాల కోసం తరలించేవారు. ఈ కాలువల ఆధారంగానే వ్యవసాయం జరిగేది. మారిబ్‌లో చాలా పెద్ద నీటిపారుదల వ్యవస్థ ఉండేది. ప్రాచీన కాలంలో ఇటువంటి వ్యవస్థలూ, ఇలాంటి ఇంజనీరింగ్ నైపుణ్యం చాలా అరుదుగా కనబడుతూ ఉంటుంది. కేవలం బాబిలోనియాలో మాత్రమే ఇటువంటి నీటిపారుదల వ్యవస్థ ఉండేది. మారిబ్ నుంచి యెమన్‌లోని చాలా ప్రాంతాలకు నీరు సరఫరా అయ్యేది. దీనివల్ల ఆ ఎడారి నేలలు చాలా వరకూ సస్యశ్యామలం అయ్యాయి.

మారిబ్ పట్టణం ఒక పెద్ద ఉద్యానవనంలా ఉండేది. ప్రజలు బాగా కష్టపడి పనిచేసేవారు. ఫలితంగా పంటలు పుష్కలంగా పండేవి. పశుసంపదతో, పాడి పంటలతో దేశం అలరారేది. కానీ ఈ సౌభాగ్యం యావత్తూ అల్లాహ్ ప్రసాదించినదని ప్రజలు మరచిపోతే... సంపద, భోగభాగ్యాలు కూడా శాపాలుగా పరిణమిస్తాయి. భోగభాగ్యాల జీవితం ఆ ప్రజలను ఏమరుపాటుకు గురిచేసింది. దేవుణ్ణి మరచిపోయేలా చేసింది. అనేక రకాల చెడులు వారిలో చోటు చేసుకున్నాయి. వారు స్వార్థపరులుగా, అహంకారులుగా తయారయ్యారు. చివరకు సోమరులు అయ్యారు. ఆనకట్టల నిర్వహణలో అశ్రద్ధ వహించారు.

ఒక రాత్రి విపత్తు విరుచుకుపడింది. అతి పెద్ద ఆనకట్ట



తెగింది. కట్ట తెంచుకున్న నీరు ఒకదాని తరువాత ఒకటిగా అనేక ఆనకట్టలను ధ్వంసం చేసింది. ఆ భారీ వరదలో దేశం యావత్తూ నాశనం అయింది. నీటిపారుదల వ్యవస్థ మొత్తం కుప్పకూలిపోయింది. ఒకప్పుడు ఉద్యానవనంగా అలరారిన దేశం శిథిల నగరంలా మారిపోయింది. అడవి చెట్లు, పిచ్చి మొక్కలు తప్ప మరేదీ పండని నేలగా రూపాంతరం చెందింది. ఉద్యానవనాల్లో కిలకిలరావాలతో ఆహ్లాదపరచిన పక్షులు కూడా వలస పోయాయి. సబా ప్రజలు ఇళ్ళూ, వాకిళ్ళూ వదిలి ఇతర ప్రాంతాలకు తరలిపోవాల్సి వచ్చింది. కొందరు సిరియా వెళ్ళిపోయారు. మరికొందరు మక్కాకూ, ఇంకొందరు ఎస్రిబ్‌కూ, ఇతర ప్రదేశాలలోకూ వెళ్ళి స్థిరపడ్డారు. ఈ విధంగా ప్రజలు చెల్లాచెదురైపోయారు.

ఈ విపత్తు గురించి దివ్య ఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొని ఉంది: “మేము సబా వారి ఆనకట్టను తెంచి, వారిపైకి వరదను పంపాము.” (దివ్య ఖుర్‌ఆన్ - సబా 34:16)

సబా ప్రజలకు ఎదురైన విపత్తు గురించి తరువాతి తరాలు కథలు కథలుగా చెప్పుకున్నాయి. అల్లాహ్ కారుణ్యం వల్ల అపరిమిత సౌభాగ్యాలు పొందినవారు తమ దేవుణ్ణి మరచిపోయి ఏ విధంగా నాశనమయ్యారనేది అనేక తరాల వారికి గుణపాఠంగా మిగిలిపోయింది.

● మహమ్మద్ వహీదుద్దీన్

నవజీవన వేదం

## ఆ నేర్పు తెలుసుకోవాలి!



ఉద్యోగాలు చేసేటప్పుడు స్థితప్రజ్ఞ లక్షణంతో పాటు, పెద్ద వాళ్ల దగ్గర పనిచేసే సమయంలో ఇంకాస్త జాగ్రత్తలు కూడా నేర్చుకోవాలి. దాన్ని భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణకవి పద్యం ద్వారా తెలుసుకుందాం. ఎలా ఉన్నా కాని కొందరు యజమానులు తప్పు పడుతూ ఉంటారు.

**మౌనముచేత మూగయు సమంచిత వక్త ప్రలాపి చెంగటన్ / బూని వసించ దిట్ట దమ ముందట దవ్వుగ నుండెనేని శా / లీనుడు దాల్మిభీరుడు అవలిప్తుడు దాలిమి లేని బంటు భూ / జానుల సేవ దుష్కరము అసాధ్యము యోగులకైన నిద్ధరన్**

రాజుల దగ్గర, నాయకుల దగ్గర, అధిపతుల దగ్గర పనిచేయడం చాలా కష్టం. ఎవ్వరికీ సాధ్యం కాదు. స్థితప్రజ్ఞుడైన యోగికి కూడా వాళ్ల దగ్గర పనిచేయడం కష్టం. యజమాని మాట్లాడుతుంటే మౌనంగా వింటున్నామనుకో.. “ఏం మాట్లాడకుండా నిలుచున్నావేంటి?” అంటారు. ఒకవేళ స్పందించామనుకో “ఏంటి ప్రతిదానికి వాగుతున్నావు. నీకేదో తెలిసినట్టుగా!” అంటారు. మనం అదును చూసి మాట్లాడినా “ఏంటి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నావు” అంటారు. కాస్త దూరంగా నిలుచుంటే “అలా దూరంగా ఉన్నావేంటి? దగ్గర కొచ్చి నిలబడు” అంటారు. మాట్లాడితే తప్పు, మాట్లాడకపోతే తప్పు, దూరంగా నిలబడితే తప్పు. కొంతమంది యజమానులు ఇలా ఏడిపించుకు తింటారు అందులో అనుమానం లేదు. ఓపికగా అన్నీ భరిస్తూ ఉన్నా...“ఆయనకు భయం ఎక్కువండీ! దేనికీ స్పందించడు” అని అంటారు. కాస్త గట్టిగా మాట్లాడితే “వాడికి బాగా పొగరండీ” అంటారు. వెరసి అలాంటి యజమానుల దగ్గర స్థితప్రజ్ఞులైనటువంటి వారు కూడా పనిచేయలేరు. అందుకే ఇలాంటి పద్యాలు తెలుసుకోవడం ద్వారా ఎవరి దగ్గర ఎలా ఉండాలో నేర్చుకోవచ్చు.



● డా. గరికిపాటి నరసింహారావు

దైవమార్గం

## ఆయన కోరుకొనేది!



పేతురు ఒక మత్స్యకారుడు. ఎక్కడ చేపలు బాగా దొరుకుతాయో, ఎప్పుడు చేపలు పట్టాలో అతనికి బాగా తెలుసు. ఒక రోజు రాత్రి అతనూ, మరికొందరు అపోస్తలులూ చేపలు పట్టడానికి వెళ్ళారు. రాత్రంతా గడిచింది. ఒక్క చేప కూడా వలల్లో పడలేదు. ఇక వెనక్కి తిరిగి పోదామనే నిర్ణయానికి దాదాపుగా వాళ్ళు వచ్చారు. ఈలోగా తీరం నుంచి యేసుప్రభువు పిలుపు వినిపించింది. పడవకు కుడి వైపున వల వేస్తే చేపలు పడతాయని ఆయన చెప్పాడు. చేపల వేటలో చెయ్యి తిరిగిన తమకు ఆయన సలహా ఇవ్వడం ఏమిటని వాళ్ళకు అనిపించి ఉండొచ్చేమో! కానీ అయినా ఏదో ఆశతో అటువైపు వల వేశారు. మొయ్యలేనన్ని చేపలు పడ్డాయి!

తీరానికి వాళ్ళు చేరుకున్న తరువాత పేతురును యేసు ప్రభువు మూడుసార్లు అడిగాడు- “నన్ను ప్రేమిస్తున్నావా?” అని.

“అవును” అని జవాబు చెప్పాడు పేతురు.

“ఇక మీదట నువ్వు మనుషుల్ని పడతావు, చేపలను కాదు” అన్నాడు యేసుప్రభువు. వ్యక్తుల్లో విశ్వాసాన్ని నింపి, వారికి సువార్తను అతను చేరవేయాలన్నది ఆయన మాటల్లోని సందేశం.

మనకు కావలసినవన్నీ దేవుణ్ణి అడుగుతూ ఉంటాం. మరి దేవుడు మన నుంచి ఏం కోరుకుంటాడు? ఆయనకు కావలసినవి ఆడంబరమైన ఆరాధనలూ, విలువైన కానుకలూ, ఆర్భాటమైన ప్రార్థనా మందిరాలూ కావు. దేవుడు మనకు అందించేదీ, ఆశించేదీ ప్రేమ! ఆయన ప్రేమ మన కోరికలను తీరుస్తుంది. తన వాక్యాన్ని వ్యాప్తి చేయడానికి మన ప్రేమను ఆయన సాధనంగా మలుచుకుంటాడు. “నన్ను ప్రేమిస్తున్నావా?” అని పేతురును యేసుప్రభువు పదేపదే అడగడానికి కారణం అదే!

కిడ్‌సైంటిస్ట్




## సీక్రెట్ లెటర్

మీ స్నేహితుడికి ఓ ఉత్తరం రాయాలి. అయితే అందులో ఉన్న సమాచారం ఎవ్వరి కంటపడకూడదు. మరి అలా ఉత్తరం రాయాలంటే ఇలా చేయండి.

**కావలసినవి:**

- కాగితం
- ఇంకుపిల్లర్
- నారింజ లేదా నిమ్మకాయ

**తయారీ**

ముందుగా చిన్న పాత్రలో నారింజ రసం లేదా నిమ్మరసం తీసుకోండి. ఇంకుపిల్లర్‌లోకి ఆ రసం తీసుకొని కాగితంపై రాయండి. తరువాత కాగితాన్ని ఆరబెట్టండి. మీరు రాసింది కనిపించకపోయినా తరువాత చదవొచ్చు. అదెలా అంటే ఆ కాగితాన్ని వెలుగుతున్న బల్బు లేదా కొవ్వొత్తికి దగ్గర పెట్టి వేడి అయ్యేలా చూడండి. కాగితం కాస్త వేడెక్కగానే అక్షరాలు నెమ్మదిగా కనిపించడం మొదలవుతుంది. అయితే కాగితం బాగా వేడెక్కకుండా చూసుకోవాలి. కాగితాన్ని బల్బు లేదా కొవ్వొత్తికి మరీ దగ్గరగా పెడితే మాడిపోవడం జరగొచ్చు. అందుకే కాస్త దూరంగా పెట్టి కాగితం వేడి అయ్యేలా చూసుకుంటే మీరు రాసిన అక్షరాలు కనిపిస్తాయి.

### A, E అక్షరాలు ఉపయోగించి పదాలు పూరించండి



| | |
|---|---|
| _nt | Z_br_ |
| _llig_tor | J_m |
| V_n | C_ndl_ |
| _gg | Y_rn |

### పదాలు పట్టికలో కనిపెట్టండి

letter N

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| G | S | A | G | R | N | U | T | O | R | P |
| L | G | E | R | R | G | L | O | V | E | S |
| A | N | U | T | C | R | A | C | K | E | R |
| S | I | C | N | J | C | J | L | Y | A | E |
| S | N | S | A | B | L | T | K | N | R | E |
| E | E | E | R | S | K | C | E | E | N | S |
| S | S | B | W | K | C | R | A | E | E | N |
| P | T | M | H | I | K | R | U | D | T | O |
| G | I | N | A | E | R | B | R | L | A | T |
| J | I | S | L | E | N | G | I | E | H | E |
| N | E | T | E | O | G | P | A | S | V | S |




### దారి కనుక్కోండి?





చుక్కలు కలిపి రంగులు వేయండి

### డైలీ సుడోకు -222

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 4 | | | | 7 | 9 |
| | | | 2 | | | | | |
| | 7 | 4 | | 1 | | | | 3 |
| | 9 | | 1 | 3 | | | 8 | 2 |
| | | | | 6 | | | | |
| 4 | 1 | | | 5 | 2 | | 6 | |
| 2 | | | | 4 | | 7 | 5 | |
| | | | | | 1 | | | |
| 1 | 5 | | | | 9 | | | |

సుడోకు - 221 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 7 | 6 | 3 | 1 | 4 | 9 | 8 | 5 |
| 5 | 1 | 4 | 8 | 9 | 2 | 6 | 7 | 3 |
| 3 | 8 | 9 | 6 | 7 | 5 | 1 | 2 | 4 |
| 1 | 2 | 5 | 9 | 3 | 6 | 8 | 4 | 7 |
| 4 | 6 | 3 | 7 | 2 | 8 | 5 | 9 | 1 |
| 7 | 9 | 8 | 5 | 4 | 1 | 2 | 3 | 6 |
| 9 | 3 | 1 | 2 | 6 | 7 | 4 | 5 | 8 |
| 6 | 5 | 2 | 4 | 8 | 3 | 7 | 1 | 9 |
| 8 | 4 | 7 | 1 | 5 | 9 | 3 | 6 | 2 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.


DWAYNE JOHNSON
JACK BLACK
KEVIN HART
KAREN GILLAN
జుమాంజీ
మరో ప్రపంచం
REAL D 3D, 3D, IMAX 3D, 4DX
IN CINEMAS TODAY
#Jumanji
/JumanjiMovie
/sonypicturesofindia
/sonypicsindia
/sonypicturesindia
KFC ENTERTAINMENT RELEASE


RANI MUKERJI
YASH RAJ FILMS PRESENTS
MARDAANI 2
WRITER-DIRECTOR GOPI PUTHRAN PRODUCER ADITYA CHOPRA
RELEASING TODAY
FOR MOBILE DOWNLOADS SMS MAR2 TO 53131
WWW.YASHRAJFILMS.COM
/ yrf
U/A
ఐనాక్స్ CMR విశాఖపట్నం
ఐనాక్స్ BR విశాఖపట్నం
ఐనాక్స్ చిత్రాలయ విశాఖపట్నం
ముక్తా - వైజాగ్
ఐనాక్స్ SRMT కాకినాడ
PVR సినిమాస్ విజయవాడ
క్యాపిటల్ సినిమాస్ విజయవాడ
సినీపోలీస్ PVP మాల్ విజయవాడ
సినీపోలీస్ పవర్ 1 మాల్ విజయవాడ
ఐనాక్స్ LEPL విజయవాడ
ఐనాక్స్ ఊర్వశి విజయవాడ
ద సినిమాస్ గుంటూరు
ద సినిమాస్ నెల్లూరు
ఐనాక్స్ జ్యోతి కర్నూలు
SVC - కర్నూలు


నేడే
ప్రపంచవ్యాప్తంగా
విడుదల
100 CRORES ACADEMY
Jayakumaar's Musical
VARANGI Movies
వీరశాస్త్ర
అయ్యప్ప కటాక్షం
సుమన్ 100వ చిత్రం
కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, పాటలు
వి.యస్.పి.తెన్నేటి
వి.యస్.పి.తెన్నేటి
T.S.బద్రీష్ రామ్
దర్శకత్వం
రుద్రాభట్ల వేణుగోపాల్
lahari MUSIC
100 CRORES ACADEMY THROUGH:


నేడే విడుదల
SURESH PRODUCTIONS PVT. LTD.
people MEDIA FACTORY
VENKY మామ
K.S. RAVINDRA (BOBBY)
D.SURESH BABU T.G.VISHWA PRASAD
THAMAN S VIVEK KUCHIBHOTLA PRASAD MURELLA
వెంకి మామ
U/A
ADITYA MUSIC

# రిటైర్‌మెంట్ ఎప్పటికీ మిస్టరీనే!

- వెంకటేశ్



**"అనుకోకుండా సినిమాల్లోకి వచ్చాను. హార్డ్‌వర్క్‌ని నమ్ముకున్నా. ప్రతిరోజు ఒక బోనస్‌గా భావిస్తా. నాలో ఇంకా విషయం ఉందని దర్శకనిర్మాతలు నమ్ముతున్నారు కాబట్టే సినిమాల్లో కొనసాగగలుగుతున్నా. లేకపోతే ఎప్పుడో బయటకి పంపేవారు. ఐదేళ్ల నుండి రిటైర్ అయిపోదాం అనుకుంటున్నాను. ఇంకా. ఏదో ఎనర్జీ నడిపిస్తోంది. అదేమిటన్నది ఎప్పటికీ మిస్టరీనే" అని వెంకటేశ్ అన్నారు. ఆయన మేనల్లుడు నాగచైతన్యతో కలిసి నటించిన చిత్రం 'వెంకీమామ'. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గురువారం వెంకటేశ్ విలేకర్లతో మాట్లాడారు.**

ఫ్యామిలీ యాంగిల్ ఒకటే కాకుండా ఎమోషన్స్, యాక్షన్, డ్రామా సమపాళ్లలో ఉన్న సినిమా ఇది. ప్రేక్షకుల్ని ఆద్యంతం నవ్విస్తుంది. నాకు మంచి జ్ఞాపకం లాంటి సినిమా. మామాఅల్లుళ్లతో ఇలాంటి కథ రావడం కష్టం. పైగా రియల్ లైఫ్ మామా అల్లుడు కలసి నటించడం అనేది అరుదుగా కుదురుతుంది. నా మేనల్లుడు నాగచైతన్యతో కలిసి యాక్ట్ చేయడం వల్ల అనుకుంటా తెలియని ఎనర్జీ పెరిగింది. అందుకే ఈవెంట్స్‌లో నాకు తెలియకుండానే గెంతుతున్నా. ఇంటికెళ్లాక అవన్నీ గుర్తు చేసుకుంటే 'నేనేంటి ఇలా చేశాను' అని నవ్వొచ్చేది. 33 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ నా పుట్టినరోజున సినిమా విడుదల కాలేదు. ఫ్యాన్స్ ఆ విషయం గుర్తుచేసి సంతోషపడ్డారు. బాబీ ఈ సినిమా కోసం కష్టపడ్డాడు. ఇందులో రెండు విభిన్నమైన పాత్రలే కనిపిస్తాయి కానీ వెంకటేశ్, చైతన్య ఎక్కడా కనిపించరు.

**వాడి కోసం పోటీ పడేవాళ్లం..**

చిన్నతనంలో చైతూ చాలా క్యూట్‌గా ఉండేవాడు. వాణ్ణి ముద్దాడటానికి, ఎత్తుకోవడానికి మేమంతా పోటీ పడేవాళ్లం. ఎప్పుడూ కామ్‌గా ఉంటాడు. నాలాగే తనకూ సినిమాల్లోకి రావాలని ఉండేది కాదు. ఏదో అలా వచ్చేశాం. రానా, చైతూతో ఓ సినిమా చేయాలన్నది నాన్నగారి కోరిక. అది ఇప్పటికి నెరవేరింది. చైతూకి నా పోలికలే ఎక్కువని అంటారు. ఇద్దరం సైలెంట్‌గా ఉంటాం. ఎవరితో ఎక్కువగా మాట్లాడం. సమయపాలనలో ఇద్దరిదీ ఒకటే దారి. నా కన్నా 15 నిమిషాల ముందే సెట్‌లో ఉంటాడు. తెలియని విషయాలను తెలుసుకుంటాడు. తను ఎంచుకునే కథలంటే నాకు ఇష్టం.

**ఓవర్ నైట్ సాధ్యం కాదు...**

నేను, రానా, చైతూ అనుకుని సినిమాల్లోకి రాలేదు. అలా జరిగిందంతే! 'కలియుగ పాండవులు'తో హీరోగా ట్రై చేశా. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. ఆ తర్వాత నాకు ఎన్ని ఫ్లాపులు వచ్చినా పెద్దగా పట్టించుకోలేదు. మంచి సినిమా చేస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని నా నమ్మకం. ఓవర్‌నైట్ ఏదీ సాధ్యం కాదు. కష్టపడాలి, ఎన్నో విషయాలు నేర్చుకోవాలి. ఇండివిద్యువాలిటీ, ఈగో ఎంత తక్కువ ఉంటే అంత ఎక్కువ నేర్చుకోవచ్చు. చేసే పనిలో నీతి, నిజాయతీ ఉండాలి. ఎదుటివాళ్లతో పోల్చుకోకుండా మన పని మనం చేసుకుంటే జీవితం సాఫీగా ఉంటుందని నమ్ముతా.

**ఎన్టీఆర్‌తో నటించాలనుంది...**

నా సినిమాలు ప్రేక్షకులు కోరుకునే అంశాలతో కొత్తగా ఉండాలనుకుంటా. సరైన కథ, స్ర్కీన్‌ప్లే ఉంటే వండర్‌ఫుల్ సినిమా తీయొచ్చు. అందుకే కథ మీద ఎక్కువ వర్క్ చేయాలి. సీన్స్ సరిగ్గా రాయకపోతే.. నటులుగా మేమెంత చేసినా వృధానే. వరుణ్‌తేజ్, నాగచైతన్య లాంటి యంగ్ హీరోలతో కలిసి పనిచేయడం కొత్త అనుభూతి కలిగించింది. సినిమాలో పాత్ర నిడివి ఎంతుంది అన్నది నేను ఎప్పుడూ ఆలోచించలేదు. అలా ఆలోచిస్తే మంచి సినిమాలు చేయలేం. మల్టీస్టారర్స్‌కి బెస్ట్ ఆప్షన్ వెంకటేశ్ అన్న మాటలో నిజం లేదు. నా వయసు హీరోలతో మల్టీస్టారర్ సినిమాలు చేయను. ఒకప్పుడు వివేకానంద పాత్ర పోషించాలని ఉండేది. కానీ అలాంటి కథలు కరువయ్యాయి. జూనియర్ ఎన్టీఆర్, నానితో నటించాలనుంది. మా అబ్బాయి అర్జున్ చాలా చిన్నోడు. అప్పుడే అతని కెరీర్ విషయాలొద్దు. 'అసురన్' జనవరి నుండి షూటింగ్ ప్రారంభమవుతుంది. శ్రీకాంత్ అడ్డాల కసిగా వర్క్ చేస్తున్నాడు. నాక్కూడా కొత్త తరహా చిత్రం.

# వాస్తవ ఘటనలతో 'అశ్వద్థామ'



బుజ్జీ, శంకర్, ఉషా ముల్పూరి, రమణ సాల్వ

నాగశౌర్య హీరోగా శంకర్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'అశ్వద్థామ'. మెహరీన్ నాయిక. రమణ సాల్వ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 31న విడుదల చేయనున్నట్టు సోమవారం నిర్మాత ఉషా ముల్పూరి తెలిపారు. ఇంకా ఆమె మాట్లాడుతూ "మా ఐరా క్రియేషన్స్ సంస్థలో మూడో చిత్రమిది. వాస్తవ ఘటనల ఆధారంగా నాగశౌర్య మంచి కథ రాశాడు. అతడి కథను రమణ సాల్వ చక్కగా తెరకెక్కించాడు. అన్ని వర్గాలనూ ఆకట్టుకునే చిత్రమిది" అన్నారు. "నాగశౌర్య కథకు ప్రతిభావంతులతో కూడిన సాంకేతిక బృందం తోడవడంతో సినిమా బాగా వస్తోంది" అని శంకర్‌ప్రసాద్ ముల్పూరి అన్నారు. "సకాలంలో చిత్రీకరణ పూర్తి చేశాం. 'కెజియఫ్'కు ఫైట్స్ కంపోజ్ చేసిన అన్బు-అరివు మాస్టర్స్ తెలుగులో చేసిన తొలి చిత్రమిది. వాళ్ల యాక్షన్ కొరియోగ్రఫీ సినిమాకు ప్లస్ అవుతుంది" అని సహనిర్మాత బుజ్జి అన్నారు. "సినిమాలో యాక్షన్ మాత్రమే కాదు... మంచి ఎమోషన్ ఉంది. పాటలు పూర్తయ్యాయి. నేపథ్య సంగీత పనుల్లో ఉన్నాం" అని సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల అన్నారు. దర్శకుడు రమణ సాల్వ, ఎడిటర్ గ్యారీ బి. హెచ్, సినిమాటోగ్రాఫర్ మనోజ్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అయ్యప్ప భక్తులు తప్పక చూడాలి

- వి.ఎస్.పి. తెన్నేటి

"అయ్యప్ప భక్తులు నల్లటి దుస్తులే ధరించాలా? కషాయం వేసుకోకూడదా? 21 రోజులు మాల వేసుకోవచ్చా? వంటి ప్రశ్నలకు సమాధానాలతో పాటు సినిమాలో పలు విమర్శకులకు సహేతుక జవాబులు ఇచ్చాం. ఎవర్నీ విమర్శించలేదు. అయ్యప్ప భక్తులు, ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన చిత్రమిది" అని వి.ఎస్.పి. తెన్నేటి అన్నారు. టి.ఎస్. బద్రిష్‌రామ్‌తో కలిసి నిర్మించడంతో పాటు ఆయన కథ, కథనం, మాటలు, పాటలు అందించిన ఆధ్యాత్మిక చిత్రం 'వీరశాస్త అయ్యప్ప కటాక్షం'. రుద్రాభట్ల వేణుగోపాల్ దర్శకుడు. తెలుగులో సుమన్ వందో చిత్రమిది. శుక్రవారం విడుదలవుతోంది. "దేవుణ్ణి నమ్మడం అంటే మనల్ని మనం నమ్మడమే. దేవుడి ఆశీస్సులతో అద్భుతాల సమాహారంగా ఈ సినిమా రూపొందింది" అని దర్శకుడు అన్నారు. "పిల్లలకు ఇటువంటి భక్తి చిత్రాలు చూపించడం ద్వారా మంచి విషయాలు తెలుసుకుంటారు" అని సుమన్‌కు జంటగా నటించిన జ్యోతి అన్నారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి





తెలుగు ప్రేక్షకులకు గొల్లపూడి మారుతీరావు నటుడిగా సుపరిచితులైనా స్వతహాగా ఆయన రచయిత, వక్తగా, కాలమిస్ట్‌గా కూడా ఆయనకు మంచి పేరుంది. 'డాక్టర్ చక్రవర్తి' (1963) సినిమాతో రచయితగా ఆయన చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. తొలి ప్రయత్నంలోనే ఉత్తమ కథారచయితగా నంది అవార్డు అందుకొన్నారు. ఇలా కథారచయితగా, స్ర్కీన్‌ప్లే రచయితగా, సంభాషణల రచయితగా, నటుడిగా ఐదు సందర్భాల్లో ఆయన నంది అవార్డులు అందుకొన్నారు. ఆయన రాసిన 'కళ్లు' నాటకం సినిమాగా రూపుదిద్దుకొంది. 1975లో ఈ నాటకం రాశారు గొల్లపూడి. దీనికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. అంతే కాదు 'అదాన్ ప్రదాన్' కార్యక్రమంలో భాగంగా నేషనల్ బుక్ ట్రస్ట్ వారు అన్ని భారతీయ భాషల్లోకి ఈ నాటకాన్ని అనువదించారు. ఇదే నాటకం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు సాహిత్యం వారికి పాఠ్యపుస్తకంగా ప్రతిపాదించారు. 'ఆంధ్రజ్యోతి'తో గొల్లపూడిది ప్రత్యేక అనుబంధం. 'జీవనకాలమ్' పేరుతో ఓ శీర్షికను కొన్నేళ్ల పాటు ఆయన నిర్వహించారు. బీఎస్సీ (ఆనర్స్) పూర్తి చేసిన తర్వాత గొల్లపూడి 1959లో ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్‌గా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించారు. తర్వాత రేడియోలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికయ్యారు. అనంతరం ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి పొందారు. ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ, సంబల్‌పూర్, చెన్నై, కడప కేంద్రాల్లో ఆయన రెండు దశాబ్దాలు పనిచేశారు. ఇక సినిమాల్లోకి రాకముందు నాటకాలు, నవలలు, కథలు రాశారు గొల్లపూడి. అలాగే మాటల రచయితగా సినీరంగంపైనా, వ్యాఖ్యాతగా టీవీ రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. తెలుగు సాహిత్యంపై ఆయన రాసిన పరిశోధనాత్మక రచనలు, నాటకాలు ఆంధ్రప్రదేశ్‌లోని పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉపయోగపడుతున్నాయి. టీవీ రంగంలోనూ గొల్లపూడి ప్రతిభ ప్రదర్శించారు. 'మనసున మనసై', 'ప్రజావేదిక', 'సినీ సౌరభాలు' తదితర కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కొన్ని సీరియల్స్‌లో కూడా నటించారు.

**42 ఏళ్ల వయసులో నటన**

సినిమా రచయితగా చాలా బిజీ ఉన్న రోజుల్లో ఆయనతో 'ఇంట్లో రామయ్య-వీధిలో కృష్ణయ్య' చిత్రంలో వేషం వేయించారు దర్శకుడు కోడి రామకృష్ణ. అప్పుడు గొల్లపూడి వయసు 42 ఏళ్లు. ఆ వయసులో నటించడం మొదలు పెట్టి ఎవరిని ఉద్ధరించాలని అయిష్టంగానే ఆ చిత్రంలో నటించారు గొల్లపూడి. కానీ ఆ సినిమానే ఆయనకు లైఫ్ ఇచ్చింది. 'ఇంట్లో రామయ్య వీధిలో-కృష్ణయ్య' విడుదల కాకముందే ఆ చిత్ర హీరో చిరంజీవి ద్వారా 'ఇది పెళ్లంటారా' చిత్రంలో అవకాశం వచ్చింది. తన పేసును ప్రేక్షకులు రిసీవ్ చేసుకోరనే గొల్లపూడి అనుకొన్నారు. కానీ అదృష్టం! ఆ తర్వాత 30 ఏళ్ల ఏకధాటిగా ఎన్నో చిత్రాల్లో నటించారాయన. ఆర్టిస్ట్‌గా మంచి పాత్రలే లభిస్తున్నా తనలోని రచయితను నటుడు డామినేట్ చేయడం గొల్లపూడికి బాధ అనిపించేది.

**మూడో సినిమాకే ద్విపాత్రాభినయం**

రేడియోలో పనిచేసిన అనుభవానికి తోడు గొల్లపూడి స్టేజి ఆర్టిస్ట్ కావడంతో నటన సులువైంది. తొలి సినిమా తర్వాత 'మనిషికో చరిత్ర', 'ఇది పెళ్లంటారా', 'తరంగిణి' చిత్రాల్లో విలక్షణమైన పాత్రలు పోషించారు. వాటిల్లో 'మనిషికో చరిత్ర', 'తరంగిణి' చిత్రాలు ఏడాదిపాటు ఆడాయి. మూడో సినిమాకే ద్విపాత్రాభినయం చేశారు. ఒక నటుడు ఐదేళ్ల పాటు నటిస్తే ఎలాంటి పాత్రలు వస్తాయో.. గొల్లపూడి తొలి ఐదు సినిమాలకే అలాంటి పాత్రలు వెదుక్కుంటూ వచ్చాయి. ఆ తర్వాత ఇరవై ఏళ్లు వెనక్కి తిరిగి చూసుకొనే అవసరం ఆయనకు కలగలేదు. 'ఏ కారు ఎక్కుతున్నానో, ఏ డ్రస్సు మారుస్తున్నానో, ఎవరితో మాట్లాడుతున్నానో కూడా తెలియనంత బిజీగా ఉండేవాణ్ణి' అని ఓ సారి చెప్పారు గొల్లపూడి. ;ప్రతినాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, హాస్యనటుడిగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలు ఆయన పోషించారు 250కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 'సంసారం ఒక చదరంగం', 'స్వాతిముత్యం', 'తరంగిణి', 'త్రిశూలం' తదిరత చిత్రాల్లో ఆయన పోషించిన పాత్రలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. . కాలమంతా ఒకే తీరుగా ఉండదు. కొత్త నీరు వచ్చినప్పుడు పాత నీరు కొట్టుకుపోవడం సహజం. అలాగే పరిశ్రమలో జరిగిన మార్పుల కారణంగా గొల్లపూడికి అవకాశాలు తగ్గాయి. అయినా అడపాదడపా తనని వెదుక్కుంటూ వచ్చే పాత్రలను ఆయన అంగీకరిస్తూనే ఉన్నారు.

**జీవితంలో అసంతృప్తి లేదు**

సినిమా రచయిత కావాలనీ, నటుడిగా ఎదగాలనీ గొల్లపూడి ఏనాడూ అనుకోలేదు. నటుడు కావడానికి ముందు రెండు దశాబ్దాల పాటు రచనలు చేశారు. 'ఇది కావాలి' అని అర్రులు చాచే అవసరం తనకెప్పుడూ రాలేదని గొల్లపూడి చెబుతుండేవారు. అందుకే జీవితంలో అసంతృప్తి అన్నది లేదని అనేవారు.

## 'కృష్ణా'తో గొల్లపూడి అనుబంధం

సాహిత్యవాడ విజయవాడతో గొల్లపూడి మారుతీరావుకు అపారమైన అనుబంధమే ఉంది. మారుతీరావు ప్రస్థానానికి పునాది పడింది విజయవాడలోనే. ఆయన ఇక్కడ ఆకాశవాణి కేంద్రంలో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తూనే 'రాగరంజని' నాటకాన్ని రాశారు. ఇది ఆయన కెరీర్‌ను మలుపు తిప్పింది. ఈ నాటకానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ముందుమాట రాశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఈ నాటకాన్ని దేశ రాజధాని ఢిల్లీలో వీక్షించారు. విజయవాడలో ప్రతి ఏటా జనవరిలో పుస్తక మహోత్సవం నిర్వహిస్తారు. తొలిసారిగా ఆయన 15వ పుస్తక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తర్వాత మళ్లీ 21వ పుస్తక ప్రదర్శనకు హాజరయ్యారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం 2007, 2011, 2015లో నిర్వహించిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు గొల్లపూడి మారుతీరావు హాజరయ్యారు. విజయవాడ ఆకాశవాణి నుంచి పదోన్నతులపై వివిధ ప్రాంతాలకు వెళ్లి, సినీరంగంలో అడుగుపెట్టినా కృష్ణా తీరాన్ని మాత్రం ఆయన మరచిపోలేదు. 1960వ సంవత్సరంలో విజయవాడలోనే ఆంధ్రప్రభ దినపత్రికలో ఉపసంపాదకుడిగా పనిచేశారు. ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రత్యేకంగా 'జీవనకాలమ్' శీర్షికతో వ్యాసాలు రాసేవారు. విజయవాడలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనకే కాకుండా, నాటక పోటీలకు, సాహిత్య సభలకు ఆహ్వానిస్తే తీరిక లేదనకుండా హాజరయ్యేవారు. ఆయనను జిల్లా రచయితలు మండలి వెంకటకృష్ణారావు పురస్కారంతో సత్కరించారు. మారుతీరావు సినీరంగంలోకి వెళ్లడం వల్ల సాహిత్యానికి దూరమయ్యారని కొందరు రచయితలు అభిప్రాయపడుతున్నారు. అన్ని ప్రక్రియల సాహిత్యాన్ని కలబోసుకుని తనలో నింపుకొన్న వ్యక్తి గొల్లపూడి మారుతీరావు అని మరికొందరు రచయితలు కొనియాడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

## నాకు క్లాసులు తీసుకున్నారు

- చిరంజీవి



చిరంజీవితో...

"1979లో 'ఐల వ్‌యు' సినిమా చేసినప్పుడు, ఆ సినిమా ప్రొడ్యూసర్ భావన్నారాయణ నాకు గొల్లపూడి మారుతీరావును పరిచయం చేశారు. అప్పటికే ఆయన పెద్ద రచయిత. సాహిత్య పరంగా కూడా ఎంతో పేరు ప్రఖ్యాతులున్న వ్యక్తి, విద్యాధికుడు. ఆయన దగ్గర డైలాగ్స్ నేర్చుకోవడానికి వెళ్లాను. డైలాగులు ఎలా పలకాలో నాకు క్లాస్‌లు తీసుకున్నారు. అలా మా ఇద్దరి మధ్య గురుశిష్యుల అనుబంధం ఉండేది. ఆ సరదా పరిచయం స్నేహంగా మారింది. ఎన్నో సాహిత్య పరమైన విషయాలు చెప్పేవారు. తన గతం గురించి, గొప్ప గొప్ప కవులు, రచయితల గురించి చెప్తుంటే చాలా ఆసక్తికరంగా వింటుండేవాడిని. సాహిత్యం గురించి, గొప్ప రచయితల గురించి తెలుసుకునే అవకాశం ఆయన ద్వారానే కలిగింది. కోడి రామకృష్ణ గారి దర్శకత్వంలో నేను నటించిన 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'లో శాడిజం భర్తగా నటించి ఆయన శైలి కామెడీతో మెప్పించారు. ఆ తర్వాత 'ఆలయ శిఖరం', 'అభిలాష', 'ఛాలెంజ్' లాంటి హిట్ సినిమాల్లో భాగమయ్యారు. ఎప్పుడు కలిసినా గతాన్ని గుర్తు చేసుకునేవాళ్లం. ఆ మధ్య తన కుమారుడు పేరున నిర్వహించే గొల్లపూడి శ్రీనివాస్ అవార్డ్ ఫంక్షన్‌కి వెళ్లాను. అదే చివరిసారి ఆయన్ను కలవడం. ఆరోగ్యంగానే ఉన్నారు. ఇలా అవుతుందని ఊహించలేదు. అలాంటి బహుముఖ ప్రజ్ఞాశాలి మనకు దూరమవ్వడం బాధాకరం. వారి కుటుంబానికే కాదు, యావత్తు సినీ ప్రపంచానికి తీరని లోటు."

"యువతరం అజ్ఞాతంగా ఉన్న శక్తిని దుర్వినియోగం చేసుకుంటోందేమో అనిపిస్తుంది. వాళ్లకున్న రిజర్వాయర్ ఆఫ్ ఎనర్జీని కాని, నింపుకోవలసిన జీనియస్‌ను కాని.. నింపుకోకుండా బయటికొస్తున్నారు. ఇవాళ మీడియా అనేది బ్లాస్ట్. ఒక చిన్న పని చేస్తే పదహారు ఛానళ్లు వాడిని మహానుభావుడ్ని చేస్తున్నాయి. నెగిటివ్ ఏంటంటే - పదహారేళ్లున్న ఓ కుర్రాడు లెక్చరర్ చొక్కా పట్టుకున్నా అన్ని ఛానళ్లు చూపిస్తున్నాయి. అలా చూపిస్తే వాడేమవుతాడు? హీరో అవుతాడు"

- ఓపెన్‌హార్ట్ విత్ ఆర్కే కార్యక్రమంలో గొల్లపూడి

**తెలుగువారందరికీ బాధాకరం**

"రేడియో, నాటక, టీవీ, సినిమా, పత్రికారంగాలలో తనదైన గుర్తింపును తెచ్చుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి గొల్లపూడి మారుతీరావుగారు. ఆయన మృతి తెలుగువారందరికీ బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను."

-తెదేపా అధినేత చంద్రబాబునాయుడు

**ఉన్నది ఉన్నట్లు మాట్లాడతారు**

"గొల్లపూడి మారుతీరావు ఎంత మంచి నటులో, అంత గొప్ప రచయిత. సామాజిక కోణంలోనే ఆయన రచనలు ఉండేవి. సమాజంలో ఉన్న లోటుపాట్లను, పాలకుల తీరును ఉన్నది ఉన్నట్లు నిర్మొహమాటంగా తన రచనల ద్వారా వ్యాఖ్యానాల ద్వారా చెప్పేవారు."

-కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

**దిగ్గజాన్ని కోల్పోయాం**

"గొల్లపూడి మారుతీరావుగారి ఆకస్మిక మరణం నన్ను తీవ్రంగా కలిచివేసింది. తెలుగు చిత్రసీమకు ఆయన అందించిన సేవలు అసామాన్యమైనవి. ఈరోజు మేం ఓ దిగ్గజాన్ని కోల్పోయాం."

- మహేశ్‌బాబు

**ఇష్టమైన నటుల్లో ఒకరు**

"నాకు ఇష్టమైన నటుల్లో గొల్లపూడి మారుతీరావుగారు ఒకరు. ఆయన మాట్లాడే విధానం. ఆయన నటన కుటుంబ ప్రేక్షకులు మెచ్చేలా ఉంటాయి. మిమ్మల్ని ఎప్పటికీ మర్చిపోలేము"

-నాని

**నాకు దక్కిన గౌరవం**

"గొల్లపూడి మారుతీరావు గారితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అద్భుతమైన వ్యక్తాయన. చిత్రసీమకు మీరు అందించిన సేవలకు మా ధన్యవాదాలు సర్"

- వరుణ్ తేజ్

**ఎప్పటికీ మరువలేం**

"ఆయన రచన.. ఆయన నటన.. ఎప్పటికీ మరువలేం. గొల్లపూడి మారుతీరావు గారి ఆత్మకి శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను"

- అనిల్ రావిపూడి







| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 169.14 | 61.65 | 138 | 470 | | |
| 40,581.71 | 11,971.80 | 37,930 | 43,730 | 70.83 | 64.14 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | 2 పైసలు | |

# 'ఆర్థికం' ఆగమాగం



## మార్కెట్లో ధరల దండయాత్ర

## పారిశ్రామికం పడకేసింది

» మూడేళ్ల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం » 5.54 శాతానికి ఎగబాకిన సూచీ
» ఐఐపీ -3.8 శాతానికి పతనం » వరుసగా 3 నెలల్లోనూ క్షీణతే

భారత ఆర్థిక వ్యవస్థను ప్రతికూలతలు కారు మబ్బుల్లా కమ్ముకుంటున్నాయి. సవాళ్ల తీవ్రత పెరుగుతోంది. ప్రస్తుత స్థూల ఆర్థిక పరిస్థితులకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

న్యూఢిల్లీ: దేశంలో ధరలు ప్రచండ రూపం దాలుస్తున్నాయి. మార్కెట్ ధరల ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ నవంబరులో 5.54 శాతానికి ఎగబాకింది. ఆహార ధరలు, ముఖ్యంగా ఉల్లి, ఇతర కూరగాయలు, పప్పు దినుసుల రేట్లు భగ్గుమంటుండటమే ఇందుకు ప్రధాన కారణం. సూచీకిది మూడేళ్లకు పైగా గరిష్ఠ స్థాయి. 2016 జూలైలో 6.07 శాతంగా నమోదైంది. ఈ ఏడాది అక్టోబరులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.62 శాతంగా, సెప్టెంబరులో 3.99 శాతంగా నమోదైంది. గత ఏడాది నవంబరులో 2.33 శాతానికి పరిమితమైంది. జాతీయ గణాంకాల కార్యాలయం(ఎన్ఎస్ఓ) గురువారం విడుదల చేసిన డేటాలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది నవంబరులో ఆహార ధరల వార్షిక పెరుగుదల (ద్రవ్యోల్బణం) 10.01 శాతంగా నమోదైంది. అక్టోబరులో ఈ పెరుగుదల 7.89 శాతంగా, 2018 నవంబరులో -2.61 శాతంగా ఉంది.
- గత నెలలో కూరగాయల ధరల ద్రవ్యోల్బణం 35.99 శాతానికి ఎగబాకింది. పప్పు దినుసులు, దాని సంబంధిత ఉత్పత్తుల రేట్లు 13.94 శాతం పెరిగాయి. చిరుధాన్యాలు, కోడి గుడ్ల ద్రవ్యోల్బణం 3.71 శాతంగా.. మాంసం, చేపల ధరల పెరుగుదల 9.38 శాతంగా నమోదైంది.
- సమీక్షా కాలానికి ఇంధనం, విద్యుత్ చార్జీల వార్షిక పెరుగుదల 1.93 శాతంగా ఉంది.
- రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి (+ లేదా - 2%) కట్టడి చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి లక్ష్యాన్ని నిర్దేశించింది.
- ఈ నెలలో ధరల సూచీ 5.8-6 శాతానికి చేరుకోవచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తోంది.

### 'స్టాగ్‌ఫ్లేషన్' దశలో ఉన్నామా..?

ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే, ఆర్థిక వ్యవస్థ స్టాగ్‌ఫ్లేషన్ దశలోకి ప్రవేశించినట్లు అన్పిస్తున్నదని ఎల్ అండ్ టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రధాన ఆర్థికవేత్త రూప రీజ్ నిట్చర్ అభిప్రాయపడ్డారు. ఈ సారి పరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేట్లను తగ్గించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. వ్యవస్థలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయిలో కొనసాగుతుండటంతో పాటు నిరుద్యోగం, బలహీన డిమాండ్ సమస్యలతో సతమతం అయ్యే దశను స్టాగ్‌ఫ్లేషన్ వ్యవహరిస్తారు. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఆందోళనకర స్థాయికి ఎగబాకింది. దేశంలో ఉద్యోగ కల్పన రేటు మందగించింది. కేర్ రేటింగ్స్ ప్రకారం.. 2017-18లో ఉద్యోగాల వృద్ధి 3.9 శాతానికి, 2018-19లో 2.8 శాతానికి తగ్గింది. మరోవైపు మార్కెట్లో గిరాకీ లేక పరిశ్రమలు ఉత్పత్తిని తగ్గించేశాయి. పారిశ్రామికోత్పత్తి వృద్ధి తిరోగమనంలో కొనసాగుతుండటమే ఇందుకు నిదర్శనం.

## పారిశ్రామికోత్పత్తి తిరోగమనం



దేశీయ పారిశ్రామిక రంగం తిరోగమన బాటలో పయనిస్తోంది. వరుసగా మూడో నెలా ప్రతికూల వృద్ధి నమోదైంది. ఎన్ఎస్ఓ డేటా ప్రకారం.. అక్టోబరు నెలకు పారిశ్రామికోత్పత్తి సూచీ(ఐఐపీ) -3.8 శాతానికి పడిపోయింది. వస్తు తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల పనితీరు పేలవంగా ఉండటం ఇందుకు ప్రధాన కారణం. సెప్టెంబరులోనైతే ఈ సూచీ -4.3 శాతానికి పతనమైంది. ఆగస్టులో -1.4 శాతానికి పరిమితమైంది. జూలైలో మాత్రం 4.9 శాతం వృద్ధిని నమోదు చేసుకోగలిగింది. గత ఏడాది అక్టోబరులో ఐఐపీ 8.4 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) ప్రథమార్ధానికి (ఏప్రిల్-అక్టోబరు) పారిశ్రామికోత్పత్తి సూచీ 0.5 శాతం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి వృద్ధి 5.7 శాతంగా ఉంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది అక్టోబరులో మాన్యుఫాక్చరింగ్ రంగ ఉత్పత్తి వృద్ధి -2.1 శాతానికి పడిపోయింది. 2018లో ఇదే నెలకు 8.2 శాతం వృద్ధి నమోదైంది.
- విద్యుత్ రంగంలో ఉత్పత్తి వృద్ధి ఈ అక్టోబరులో -12.2 శాతానికి క్షీణించింది. గత ఏడాదిలో ఇదే నెలకు 10.8 శాతం వృద్ధి చెందింది.
- సమీక్షా కాలానికి మైనింగ్ రంగ వృద్ధి -8.0 శాతానికి పతనమైంది. ఏడాది క్రితం ఇదే సమయంలో 7.3 శాతం వృద్ధి చెందింది.
- ఈ అక్టోబరులో పెట్టుబడుల రాకకు ప్రామాణికమైన భారీ యంత్రాల రంగ వృద్ధి 21.9 శాతం క్షీణించింది. ప్రాథమిక వస్తువుల రంగం -6 శాతం, ఇంటర్మీడియేట్ గూడ్స్ సెక్టార్ 22.2 శాతం, మౌలిక రంగ ఉత్పత్తుల రంగం -9.2 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నాయి.
- కన్స్యూమర్ డ్యూరబుల్స్ -18 శాతం, కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్‌లో -1.1 శాతం వృద్ధి నమోదైంది.
- మాన్యుఫాక్చరింగ్ రంగంలోని 23 పరిశ్రమల విభాగాల్లో 18 ప్రతికూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

### ఫిబ్రవరిలో రెపో తగ్గింపు లేనట్లేనా..?

పారిశ్రామిక రంగం కుదేలవుతున్నప్పటికీ ద్రవ్యోల్బణం అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో ఫిబ్రవరి సమీక్షలోనూ ఆర్‌బీఐ రెపో రేట్లను తగ్గించకపోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 5న ప్రకటించిన ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ రెపో రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధానికి (2019 అక్టోబరు- 2020 మార్చి) రిటైల్ ధరల ఆధారిత ద్రవ్యోల్బణ సూచీ 5.1-4.7 శాతంగా నమోదు కావచ్చని ఆర్‌బీఐ అంచనా. అయితే, మరో రెండు నెలల పాటు సూచీ గరిష్ఠ స్థాయిలోనే కొనసాగవచ్చని భావిస్తోంది.

## నిరోధం 12000 వద్ద పరీక్ష

**టెక్ వ్యూ**

నిఫ్టీ పాజిటివ్‌గా ప్రారంభమై ప్రధాన నిరోధం 12000 వరకు వెళ్లింది. ఆ స్థాయిలో మైనర్ రియాక్షన్ సాధించి 61 పాయింట్ల లాభంతో క్లోజయింది. గత రెండు రోజులుగా మైనర్ రికవరీ సాధిస్తోంది. ప్రస్తుతం 20 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. 12000 వద్ద కీలక స్థాయిలో నిలిచి ఉంది. వీక్లీ చార్టులకు శుక్రవారంనాటి ముగింపు చాలా కీలకం.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 12000 మద్దతు : 11920**

- 12000 స్థాయిలో మైనర్ రియాక్షన్ కనిపిస్తోంది. మరింత అప్‌ట్రెండ్ కోసం అంతకన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. మరో ప్రధాన నిరోధం, ఈ నెల 5వ తేదీన ఏర్పడిన టాప్ 12100.
- మైనర్ మద్దతు స్థాయి 11920 కన్నా దిగజారితే మైనర్ కరెక్షన్‌లో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 11860, 11800.

■ వి.సుందర్ రాజా

## మిడ్ సెషన్ నిస్తేజం

**ఆస్ట్రో వ్యూ**

**తిథి** : మార్గశిర బహుళ విదియ; నక్షత్రం : ఆర్ద్ర

**అప్రమత్తం** : ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, కర్కాటక, వృశ్చిక రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 10.10**

**ధోరణి** : నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 10.30 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.15 వరకు నిలకడగాను, తదుపరి 2.30 వరకు నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తిరిగి చివరి వరకు మెరుగ్గా ట్రేడ్ కావచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం** : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ఎటిపి కన్నా పైన ఉంటే లాంగ్ పొజిషన్లు తీసుకుని 10.30కి క్లోజ్ చేసుకోవాలి. 12.30 సమయానికి ఎటిపి కన్నా దిగువన ట్రేడవుతుంటే షార్ట్ పొజిషన్లు తీసుకుని 2 గంటల కల్లా క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం : 12015, 12050**

**మద్దతు స్థాయిలు : 11935, 11900**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 12వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 436 | విశాఖపట్నం | 470 |
| 13వ తేదీకి.. | | వరంగల్ | 439 |
| చిత్తూరు | 458 | దజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 452 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 82 | విజయవాడ | 92 |
| వరంగల్ | 83 | గుంటూరు | 92 |
| మహబూబ్‌నగర్ | 82 | ఒంగోలు | 94 |
| కరీంనగర్ | 82 | చిత్తూరు | 86 |
| కర్నూలు | 82 | నెల్లూరు | 86 |
| విశాఖపట్నం | 92 | అనంతపురం | 77 |
| గోదావరి | 90 | | |

### బులియన్



| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 37,790 | 38,800 | --- | 38,800 | 37,820 |
| క్రితం ముగింపు | 37,780 | 38,610 | 39,210 | 38,860 | 37,770 |
| 22 క్యారెట్లు | 35,960 | 36,000 | --- | 35,960 | 36,020 |
| క్రితం ముగింపు | 36,010 | 35,750 | 36,070 | 35,780 | 35,970 |
| వెండి (కిలో) | 43,900 | 44,600 | --- | 44,900 | 46,900 |
| క్రితం ముగింపు | 43,500 | 44,500 | 44,500 | 44,400 | 46,600 |

# రూ.15,000 కోట్లు




## భారత్ బాండ్ ఈటీఎఫ్‌తో నిధుల సమీకరణ లక్ష్యం

### ఇష్యూ ప్రకటించిన ఎడెల్‌వీజ్ ఏఎంసీ.. 20న ముగింపు

న్యూఢిల్లీ: దేశంలోని ఇన్వెస్టర్లకు మరో పెట్టుబడి సదుపాయం అందుబాటులోకి వచ్చింది. భారత్ బాండ్ ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)ను గురువారం నాడు ఎడెల్‌వీజ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ప్రారంభించింది. ఇది దేశంలోనే తొలి కార్పొరేట్ బాండ్ ఈటీఎఫ్. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పెట్టుబడులు, పబ్లిక్ అసెట్‌మేనేజ్‌మెంట్ విభాగం (దీపమ్).. భారత్ బాండ్ ఈటీఎఫ్‌ను రూపొందించడంతోపాటు నిర్వహణ బాధ్యతను ఎడెల్‌వీస్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి కట్టబెట్టారు. ఈ నేపథ్యంలో ఈ కంపెనీ పబ్లిక్ ఇష్యూను ప్రకటించింది. భారత్ బాండ్ ఈటీఎఫ్ ద్వారా రూ.15,000 కోట్ల వరకు సమీకరించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం.

- ఈటీఎఫ్ ద్వారా ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ తొలుత రూ.3,000 కోట్లు సమీకరించాలని ప్రతిపాదించింది. ఒకవేళ దీనికి ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన వస్తే మరో రూ.2,000 కోట్లు సమీకరిస్తుంది. ఈ ఈటీఎఫ్ మెచ్యూరిటీ కాలపరిమితి మూడేళ్లు (2023).
- స్వల్పకాలానికి పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్లు దీన్ని ఎంచుకోవచ్చు. పదేళ్ల కాలపరిమితి కలిగిన ఈటీఎఫ్ ద్వారా రూ.4,000 కోట్లు సమీకరిస్తారు. దీనికి మంచి స్పందన లభిస్తే మరో రూ.6,000 కోట్లు సమీకరిస్తారు. దీర్ఘకాలిక పెట్టుబడి ఉద్దేశం ఉన్న ఇన్వెస్టర్లు దీన్ని ఎంచుకోవచ్చు. ఈ ఈటీఎఫ్ ఏఏఏ-రేటింగ్ ఉన్న ప్రభుత్వ రంగ కంపెనీల బాండ్లలో పెట్టుబడి పెడుతుంది.
- మూడేళ్ల మెచ్యూరిటీ కలిగిన ఈటీఎఫ్ నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్ -ఏప్రిల్ 2023ని, 10 ఏళ్ల మెచ్యూరిటీ ఈటీఎఫ్ నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్-ఏప్రిల్ 2030ని అనుసరిస్తుంది. నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్-ఏప్రిల్ 2023 వార్షిక ఈల్డ్ 6.69 శాతం.. నిఫ్టీ భారత్ బాండ్ ఇండెక్స్-ఏప్రిల్ 2030 ఈల్డ్ 7.58 శాతంగా ఉంటుందని అంచనా.
- ఒక్కో యూనిట్ కనీస పరిమాణం రూ.1,000 ఉంటుంది. ఇన్వెస్టర్లు ఈ నెల 20 వరకు యూనిట్లను కొనుగోలు చేయవచ్చు.
- కాగా డీమ్యాట్ ఖాతా లేని ఇన్వెస్టర్ల కోసం భారత్ బాండ్ ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్ఓఎఫ్)ను కూడా ప్రారంభిస్తున్నారు.
- భారత్ బాండ్ ఈటీఎఫ్‌కు యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. ఇష్యూలో వీరికి కేటాయించిన పరిమాణానికి దాదాపు రూ.3,000 కోట్ల విలువైన బిడ్స్ వచ్చాయి. ఇది ఇష్యూ పరిమాణం కన్నా దాదాపు 1.7 రెట్లు అధికం.

### బ్యాంకింగ్, మెటల్ షేర్ల మద్దతుతో ముందుకు..

దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం నాడు ర్యాలీ నెలకొంది. మెటల్, బ్యాంకింగ్ షేర్లు అధిక లాభాలను నమోదు చేసుకోవడంలో బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ సూచీలు ముందడుగు వేశాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా పెరిగింది. చివరకు సెన్సెక్స్ 169.14 పాయింట్ల లాభంతో 40,581.71 పాయింట్ల, నిఫ్టీ 61.65 పాయింట్ల లాభంతో 11,971.80 పాయింట్ల వద్ద ముగిశాయి. గ్లోబల్ ట్రెండ్స్ సానుకూలంగా ఉండటం కూడా మార్కెట్‌కు కలిసి వచ్చింది. వచ్చే ఏడాదిలో వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదని యూఎస్ ఫెడరల్ రిజర్వు నుంచి వచ్చిన సంకేతాలు ఇందుకు కారణం.

## ఈ-ఇన్వాయిస్‌తో అనేక ప్రయోజనాలు

» జీఎస్‌టీఎన్ సీఈఓ ప్రకాష్ కుమార్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎలక్ట్రానిక్ ఇన్వాయిస్ (ఈ-ఇన్వాయిస్) విధానం వచ్చే జనవరి నుంచి అమల్లోకి రానుందని, దీని ద్వారా అనేక ప్రయోజనాలు ఉంటాయని వస్తు సేవల పన్ను నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) సీఈఓ ప్రకాష్ కుమార్ తెలిపారు. ఈ-ఇన్వాయిస్‌తో వ్యయాలు తగ్గడమేకాకుండా తప్పులు దొర్లకుండా, మోసాలు జరగకుండా ఉంటాయన్నారు. సప్లయర్, కస్టమర్ సంబంధాలు కూడా మెరుగుపడతాయని చెప్పారు. తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టాప్సీ) గురువారంనాడిక్కడ నిర్వహించిన నిర్వహించిన ఈ-ఇన్వాయిస్ సదస్సులో భాగంగా ప్రకాష్ కుమార్ మాట్లాడారు. ఈ సమావేశంలో వివిధ కంపెనీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ-ఇన్వాయిస్ విధానం వినియోగదారులకు అనుకూలంగా ఉంటుందని ప్రకాష్ కుమార్ చెప్పారు. పన్ను చెల్లింపుల్లో భారత్ స్థానం 115గా ఉందని తెలిపారు.

## డాన్యుబ్ హోమ్ విస్తరణ



డాన్యుబ్ గ్రూప్ వ్యవస్థాపక చైర్మన్ రిజ్వాన్ సజన్, అదెల్ సజన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హోమ్ ఫర్నిషింగ్, ఇంటీరియర్ ఉత్పత్తులను అందిస్తున్న దుబాయ్ కంపెనీ డాన్యుబ్ హోమ్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో మరింతగా విస్తరించడంపై దృష్టిసారించింది. ఇప్పటికే ఈ కంపెనీ హైదరాబాద్‌లో ఒక స్టోర్‌ను నిర్వహిస్తోంది. వచ్చే మూడేళ్లలో ఇక్కడ మరో మూడు స్టోర్లను ఏర్పాటు చేయానుకుంటున్నట్టు డాన్యుబ్ గ్రూప్ డైరెక్టర్ అదెల్ సజన్ తెలిపారు. కస్టమర్లకు అందుబాటులో ఉండటం వల్ల అమ్మకాలను పెంచుకునే అవకాశం ఉందని, అందుకే కొత్త స్టోర్లను ఏర్పాటు చేయనున్నామని ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ లోనూ రెండు స్టోర్లను ప్రారంభించే యోచన ఉందన్నారు. ఒక్కో స్టోర్ కోసం కనీసం రూ.30 కోట్ల పెట్టుబడి అవసరం ఉంటుందని, ఐదు స్టోర్ల కోసం రూ.150 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. తమ ఉత్పత్తుల అమ్మకాలను పెంచుకోవడానికి వచ్చే ఏడాది మొదటి త్రైమాసికంలో ఈ-కామర్స్ కంపెనీలతో చేతులు కలుపుతామని, రెండో త్రైమాసికంలో తమ సొంత ఈ-కామర్స్ వెబ్‌సైట్ ప్రారంభిస్తామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ స్టోర్ల ద్వారా వచ్చే ఏడాది రాబడిలో 25 శాతం వృద్ధిని ఆశిస్తున్నామన్నారు. తాము విక్రయిస్తున్న ఉత్పత్తుల్లో 85 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, రానున్న కాలంలో దేశీయంగా తయారీని పెంచుకుంటామన్నారు.

## 10 ఏళ్ల టాక్స్ హాలిడే

పారిశ్రామికవేత్తలకు కజకిస్థాన్ ఆహ్వానం

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): భారత్‌కు విశ్వసనీయమైన భాగస్వామిగా ఉన్న కజకిస్థాన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ఆ దేశ రాయబారి యెర్లాన్ అలింబయేవ్ కోరారు. కజకిస్థాన్‌లో పెట్టుబడులు పెట్టేవారికి పలు రాయితీలతో పాటు పదేళ్ల వరకు టాక్స్ హాలిడే ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. పెట్రోలియం, ఐటీ, పారిశ్రామిక వాణిజ్య, ఔషధ, విద్య, వ్యవసాయం, ఫుడ్ ప్యాకేజ్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశం మొత్తం మీద 12 సెజ్‌లు, 22 ఇండస్ట్రియల్ జోన్లు ఉన్నాయని తెలిపారు. డాక్టర్ రెడ్డీస్, రాంకీ గ్రూప్ అధినేతలతో సమావేశమై తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని కోరినట్లు ఆయన చెప్పారు. భారత్,కజకిస్థాన్ మధ్య ఎగుమతుల్లో జాప్యాన్ని నివారించేందుకు ఇరాన్‌లోని ఛాబర్ పోర్టు నుంచి ఎగుమతి, దిగుమతి సేవలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో కజకిస్థాన్ 25వ స్థానంలో ఉందన్నారు.



యెర్లాన్‌తో కాన్సుల్ జనరల్ నవాబ్ మీర్ నాసిర్

### హైదరాబాద్‌లో కజకిస్థాన్ కాన్సులేట్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కజకిస్థాన్ కాన్సులేట్ త్వరలో హైదరాబాద్‌లో ఏర్పాటు కానుంది. గౌరవ కాన్సుల్ జనరల్‌గా నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌ను కజకిస్థాన్ ప్రభుత్వం నియమించినట్లు యెర్లాన్ తెలిపారు.

## రోజుకు 40 ర్యాకులు ఇస్తాం

» సింగరేణికి రైల్వే శాఖ వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఉత్పత్తి చేయనున్న బొగ్గును రవాణా చేసేందుకు అవసరమైనన్ని ర్యాకులు సమకూర్చేందుకు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రస్తుతం రోజుకు 35 ర్యాకులను బొగ్గు రవాణాకు సరఫరా చేస్తున్న రైల్వే శాఖ డిసెంబరు నెలంతా రోజుకి 38, జనవరి నుంచి మార్చి వరకు రోజుకి 40 ర్యాకులను సమకూర్చుతామని వెల్లడించింది. గురువారం నాడిక్కడ సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌తో రైల్వే శాఖకు చెందిన చీఫ్ ఆపరేషన్ మేనేజర్ (సీఓఎం) కె శివప్రసాద్, చీఫ్ ఫ్రైట్ ట్రాఫిక్ మేనేజర్ బి నాగ్యా సమావేశమై, బొగ్గు రవాణాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వర్షాకాలంలో తగ్గిన ఉత్పత్తితో పాటు ఈ ఆర్థిక సంవత్సరంలోని చివరి 3 నెలల్లో నిర్దేశిత లక్ష్యాల మేర బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది కాబట్టి దీనికి అనుగుణంగా తగినన్నీ రైల్వే ర్యాకులు సరఫరా చేయాలని .శ్రీధర్, ఈడీ జె అల్విన్ చేసిన సూచనతో రైల్వే అధికారులు అంగీకారం వ్యక్తం చేశారు. ఇంజన్ ఆన్ లోడింగ్ అగ్రిమెంటు ఫలితంగా సింగరేణి సీహెచ్‌పీలో వ్యాగన్లలోకి వేగంగా బొగ్గు లోడింగ్ జరుగుతోందని తెలిపారు.

## జోయాలుక్కాస్‌లో డిజైనర్ జువెలరీ ఫెస్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఆభరణాల రంగంలో సుప్రసిద్ధమైన జోయాలుక్కాస్ దేశవ్యాప్తంగా అన్ని షోరూమ్‌లలోనూ డిజైనర్ జువెలరీ ఫెస్ట్ నిర్వహిస్తోంది. ఈ ఫెస్ట్ సమయంలో అన్ని షోరూమ్‌లలోనూ ఇంతకు ముందెన్నడూ కనీవిని ఎరుగని అద్భుతమైన డిజైన్లతో నగలు అందుబాటులో ఉంచుతారు. అలాగే పెళ్లి కూతుళ్ల ఆభరణాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సమయంలో ఆభరణాలు, అన్‌కట్ వజ్రాలు కొనుగోలు చేసే వారికి ప్రత్యేక ఆఫర్లు కూడా అందుబాటులో ఉన్నట్టు గ్రూప్ సీఎండీ జోయాలుక్కాస్ తెలిపారు. రూ.50 వేలు, ఆ పైబడిన విలువలో డైమండ్ నగలు కొనుగోలు చేసే వారికి ఒక గ్రాము బంగారం నాణెం, అంతే విలువలో ఇతర ఆభరణాలు కొనుగోలు చేసే వారికి 500 ఎంజీ బంగారు నాణెం బహుమతిగా అందిస్తామని చెప్పారు.

### కార్వీ కేసులో తర్వాత తీర్పిస్తాం!

**యాక్సిస్ బ్యాంక్ పిటిషన్‌పై శాట్ తీర్పు రిజర్వు**

ముంబై: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో యాక్సిస్ బ్యాంక్ పిటిషన్‌పై సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) తన తీర్పును రిజర్వు చేసింది. కార్వీ తాకట్టు పెట్టిన షేర్లను తిరిగి ఖాతాదారులకు బదిలీ చేయడాన్ని సవాలు చేస్తూ బుధవారం యాక్సిస్ బ్యాంక్ శాట్‌ను ఆశ్రయించింది. యాక్సిస్ బ్యాంక్ వద్ద ఖాతాదారుల షేర్లను తనఖా పెట్టి కార్వీ రూ.100 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ వసతిని పొందింది.

### ఇన్ఫీపై యూఎస్‌లో దావా

లాస్‌ఏంజిల్స్: దేశంలో రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్‌పై అమెరికాలో క్లాస్ యాక్షన్ లాసూట్ (దావా) దాఖలైంది. లాస్‌ఏంజిల్స్‌కు చెందిన వాటాదారుల హక్కుల పరిరక్షణ సంస్థ 'ది స్కాల్ లా ఫర్మ్' ఈ దావా వేసింది. స్వల్పకాలానికి ఆదాయ, లాభాలను పెంచి చూపేందుకు కంపెనీ తన ఆర్థిక నివేదికల్లో తప్పుడు లెక్కలు ప్రకటించిందని ఆరోపించింది. రెండు నెలల క్రితం ఇన్ఫోసిస్‌పై ప్రజావేగు బృందం చేసిన ఆరోపణల ఆధారంగానే ఈ సంస్థ తాజాగా కంపెనీపై దావా వేసినట్టు తెలుస్తోంది.

### నేత్రికా చేతికి ఏపీఎస్

న్యూఢిల్లీ : హైదరాబాద్‌కు చెందిన ఆన్‌లైన్ యాంటీ పైరసీ సంస్థ.. యాంటీ పైరసీ సొల్యూషన్స్ (ఏపీఎస్)ను కొనుగోలు చేసినట్లు రిస్క్ మేనేజ్‌మెంట్ ,కార్పొరేట్ ఇన్వెస్టిగేషన్ సంస్థ నేత్రికా కన్సల్టింగ్ వెల్లడించింది. మేధో సంపత్తి హక్కులు (ఐపీఆర్), బ్రాండ్ ప్రొటెక్షన్‌లో సామర్థ్యాలను పెంచుకునేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని తెలిపింది. అయితే ఏపీసీని ఎంత మొత్తానికి కొనుగోలు చేసిందనేది మాత్రం వెల్లడించలేదు. 2008లో ఏర్పాటైన ఏపీఎస్.. హైదరాబాద్‌లోని కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది.

### లోక్‌సభకు దివాలా చట్ట సవరణ బిల్లు

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో దివాలా స్మృతి చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ముందుగా బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనకు పంపాలని డిమాండ్ చేశాయి.. కార్పొరేట్ కంపెనీల దివాలా పరిష్కార చర్యలకు అడ్డంకులను తొలగించడంతోపాటు ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ఈ బిల్లులో పలు సవరణలు ప్రతిపాదించారు. దివాలా పరిష్కార చర్యల్లో భాగంగా కంపెనీని దక్కించుకున్న వారిని ఆ కంపెనీ పాత ప్రమోటర్ల అక్రమాలు, వాటికి సంబంధించిన నేర విచారణ ప్రభావితం చేయకుండా రక్షణ కల్పించడం అందులో ప్రధానమైంది. చిన్న మొత్తం బకాయిల రికవరీకే రుణదాతలు కంపెనీపై దివాలా చర్యలు చేపట్టకుండా అడ్డుకోవడం మరో ముఖ్యమైన సవరణ. 2016లో అమలులోకి వచ్చిన దివాలా స్మృతి చట్టాన్ని ఇప్పటికే మూడుసార్లు సవరించారు.




గేటు వద్ద బాబును అడ్డుకుంటున్న మార్షల్స్



తోపులాటలో లోకేశ్, బలరాం



# అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటారా?

- మా సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తన దారుణం
- చొక్కాకు నల్ల రిబ్బన్ కూడా పెట్టుకోకూడదా?: టీడీపీ
- ప్రతిపక్ష సభ్యులే మార్షల్స్‌ను నెట్టారు: వైసీపీ

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'అసెంబ్లీ గేటు వద్ద అరగంట పాటు మమ్మల్ని ఆపేశారు... మేం సభలో సభ్యులం, మమ్మల్ని అవమానించిన చీఫ్ మార్షల్‌పై చర్య తీసుకోవాలి' అని ప్రతిపక్ష టీడీపీ శాసనసభలో పట్టుబట్టింది. ప్రభుత్వమే జీవోలిస్తూ పత్రికా స్వేచ్ఛను హరించడం దారుణమని, నిషేధం విధించిన మూడు టీవీ చానెళ్లను అనుమతించాలని నినదించింది. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో గురువారం నాడు సభలో గంటన్నరపాటు అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం నడిచింది. మార్షల్స్ అడ్డుకున్న కారణంగా సభలోకి 25 నిమిషాలు ఆలస్యంగా వచ్చిన టీడీపీ సభ్యులు... నేరుగా స్పీకర్ పోడియం సమీపంలోకి వెళ్లి తమకు జరిగిన అవమానాన్ని వివరించారు. నల్ల రిబ్బనుతో నిరసన తెలపడం సభ్యుల హక్కు అని, కాదనడానికి చీఫ్ మార్షల్ ఎవరంటూ అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. చీఫ్ మార్షల్‌ను పిలిపించి మాట్లాడాలని, సభ్యుల హక్కులు కాపాడాలని, చీఫ్ మార్షల్‌పై చర్య తీసుకోకుంటే సభలో ఉండలేమన్నారు. 'గత సభలో వైసీపీ సభ్యులు ఏకంగా నల్లచొక్కాలతోనే వచ్చారు. రేపు మేము అలా వస్తే మార్షల్స్ ఏకంగా మా చొక్కాలు విప్పిస్తారా? ఎటువంటి ప్లకార్డులూ పట్టుకోని ప్రతిపక్ష నేత చంద్రబాబుపై చేతులేసి వెనక్కి నెట్టారు. ఇంతకన్నా దారుణం మరొకటి ఉండదు. మేం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ సభ్యులు ప్లకార్డులతో వచ్చి, స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టి, కెమెరాకు వాటిని అడ్డుపెట్టి బల్లలెక్కి నిరసన వ్యక్తం చేయలేదా? కాదంటే చెప్పండి... ఇదే క్షణం స్పీకర్‌కు రాజీనామా లేఖ అందజేసి వెళ్లిపోతాం' అని ఆవేశంగా ప్రశ్నించారు. దీంతో మైకు కట్ చేయడంతో సభా వ్యవహారాల మంత్రి బుగ్గన నిబంధనలు చదివారు. తమకున్న సమాచారం మేరకు మార్షల్స్‌ను టీడీపీ సభ్యులే నెట్టారని, వాళ్లు ఏమీ అనలేదని చెప్పారు.

## పేపర్లు పట్టుకోకూడదా?: చంద్రబాబు

పత్రికా స్వేచ్ఛ హరించేలా జీవో 2430 ఇవ్వడం, మూడు టీవీ చానెళ్లను అడ్డుకోవడం పట్ల తమ పార్టీ నిరసనలో భాగంగా మా ఎమ్మెల్యేలు ప్లకార్డులు పట్టుకున్నా... వద్దనగానే పక్కన పడేశారని చంద్రబాబు సభలో వివరించారు. అయితే సభలో మాట్లాడేందుకు ప్రిపేర్ చేసుకున్న పేపర్లు తెస్తుంటే వాటిని కూడా అనుమతించబోమనడం ఏంటని నిలదీశారు. మార్షల్స్ చంద్రబాబును అడ్డుకున్నారో, టీడీపీ ఎమ్మెల్యేలు మార్షల్స్‌ను తోశారో చూడాలంటూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వీడియో ప్రదర్శన చేయించారు. ఆ వీడియోలో తోపులాటకు సంబంధించింది ఏదీలేదు. జగన్‌పై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను చూపించారు. 'ఒక ఉన్మాది సీఎంగా ఉంటే మీరు కూడా అలాగే వ్యవహరిస్తారు' అని మార్షల్స్‌పై కోప్పడ్డ వ్యాఖ్యలపై అధికార పక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. చంద్రబాబు క్షమాపణ చెప్పాలని వైసీపీ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. దీంతో సభలో కాసేపు గందరగోళం ఏర్పడింది. ఈ సమయంలో కలుగజేసుకున్న సీనియర్ సభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి సభలో వ్యక్తి దూషణలు పెరిగి పోతున్నాయని, కులాలు, మతాలు దాటి మాట్లాడటం సరికాదన్నారు. ఈ సమయంలో టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి లేచి 'సీఎం హోదాలో ఉన్న చంద్రబాబును చెప్పుతో కొట్టాలంటూ ప్రతిపక్ష నేత హోదాలో జగన్ గతంలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెబితే మేం కూడా చెబుతాం' అంటూ మెలిక పెట్టారు. దీంతో సీఎం జగన్ కల్పించుకుని 'వాళ్ల క్షమాపణ చెప్పరఖ్కర్లా. సభలో చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి. వాళ్ల విజ్ఞతకే వదిలేద్దాం. సభను కొనసాగించండి' అని స్పీకర్‌ను కోరారు.

### ఆ జీవోలో ఏముంది..
### ఇంగ్లిష్ రాదేమో: సీఎం

వైసీపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను ఇబ్బంది పెట్టేలా జీవో తెచ్చారనడం సరికాదంటూ సీఎం జగన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ జీవోలో ఏముందో చంద్రబాబు తెలుసుకోవాలని, ఇంగ్లిష్ రాదేమోనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 'నాపై ఎవరైనా తప్పుడు వార్తలు రాస్తే పరువును కాపాడుకోవడం నా హక్కు. అదే బాధ్యత ఇక్కడ ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఇచ్చాం. ఇంగ్లిష్ వచ్చిన వారు ఎవరు చదివినా జీవో స్పష్టంగా అర్థం అవుతుంది. చంద్రబాబుకు ఇంగ్లిష్ రాదేమో! జీవోలో భావం అర్థం చేసుకోవడంలో లోపం ఉందేమో!' అని సీఎం పేర్కొన్నారు.

#### ఇంగ్లిష్ పత్రికలకు భాష రాదా ?: చంద్రబాబు

సీఎం వ్యాఖ్యలపై చంద్రబాబు ఘాటుగా స్పందించారు. 'వెంకటేశ్వర యూనివర్సిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన నాకు ఇంగ్లిష్ రాదంటోన్న ముఖ్యమంత్రి ఎక్కడ చదువుకున్నారో వెల్లడించాలి. ఆ కాలేజీ పేరు చెబితే అక్కడికి వెళ్లి ఇంగ్లిష్ నేర్చుకుంటా. నన్ను నిందిస్తున్నారు... నేషనల్ మీడియా వాళ్లకు ఈయనే భాష నేర్పారా? వాళ్లందరూ జీవోపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాదని చెప్పమనండి ఇక ఈ అంశంపై మాట్లాడను' అన్నారు.

# మార్షల్స్ ఓవరాక్షన్

## గేటు వద్ద బాబు అడ్డగింత.. లోపలకు రానివ్వకుండా నిలిపివేత.. ఆయన చేతిలో ఫైల్ ఇవ్వాలని పట్టు

### టీడీపీ అధినేతపై చీఫ్ మార్షల్ చేయి

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగ్రహంతో ఆగిపోయిన థియోఫిలిస్
- మార్షల్స్ తీరుపై చంద్రబాబు ఆగ్రహం
- అక్కడే నేలపై కూర్చుని ధర్నా
- టీడీపీ ప్రజాప్రతినిధుల బైఠాయింపు
- లోకేశ్‌పైనా సిబ్బంది దురుసుతనం
- ఎమ్మెల్సీ శ్రీనివాసులు కాలుతొక్కిన మార్షల్స్

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాసనసభ వద్ద గురువారం అసాధారణ సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును అసెంబ్లీ లోపలకు రానివ్వకుండా ప్రధాన ద్వారం వద్ద మార్షల్స్ (అసెంబ్లీ భద్రతా సిబ్బంది) అడ్డుకున్నారు. ఆయన వారిపై తీవ్రంగా మండిపడ్డారు. వారి వైఖరిని నిరసనగా అసెంబ్లీ ప్రధాన ద్వారం ముందు కింద కూర్చుని ధర్నా చేశారు. ఆయనతోపాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా బైఠాయించారు. అసెంబ్లీ సమావేశం ప్రారంభానికి ముందు ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మీడియాపై రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలు, తెచ్చిన జీవోలు.. చానళ్లపై నిషేధాన్ని నిరసిస్తూ చంద్రబాబు నాయకత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ వద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన ద్వారానికి కొద్ది దూరంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం నుంచి వారు బ్యానర్, ప్లకార్డులు పట్టుకుని ప్రహరీ గోడ వద్ద ఉన్న గేటు వరకూ వచ్చారు. వారిని అక్కడ అసెంబ్లీ చీఫ్ మార్షల్ ఆధ్వర్యంలో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. బ్యానర్లు, ప్లకార్డులు లోపలకు తేవడానికి వీల్లేదని చెప్పడంతో ఎమ్మెల్యేలు వాటిని ఇచ్చేశారు. చంద్రబాబు చేతిలో కాగితాల ఫైల్ ఉంది. దానిని కూడా తీసుకువెళ్లడానికి వీల్లేదని, తమకిచ్చేయాలని మార్షల్స్ పట్టుబట్టడంతో ఆయన నివ్వెరపోయారు. కాగితాలు తీసుకెళ్లకూడదని ఎవరు చెప్పారు.. కొత్త నిబంధనలు తెస్తున్నారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపలకు వెళ్లడానికి అడుగు ముందుకు వేయడంతో చీఫ్ మార్షల్ థియోఫిలిస్ ఆయనపై చేతులు వేసి ఆపబోయారు. ఇది చూసి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అరవడంతో చీఫ్ మార్షల్ ఆగిపోయారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీ లోపలకు వెళ్లనివ్వకుండా ఆపడం మొదటిసారి చూస్తున్నానని, ఇదేం పద్ధతని చంద్రబాబు ఆయనపై విరుచుకుపడ్డారు. ఇంతకు మించిన నిరంకుశ వైఖరి మరొకటి లేదంటూ ఆయన అక్కడే నేలపై కూర్చుని ధర్నా చేపట్టారు. ఆయనతోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా బైఠాయించారు.



టీడీపీ ఎమ్మెల్యేలను అడ్డుకుంటున్న మార్షల్స్

#### నల్లరిబ్బన్ ఇచ్చేయాలని..

చంద్రబాబు కుమారుడు, ఎమ్మెల్సీ లోకేశ్‌కు ఇక్కడే మరో అనుభవం ఎదురైంది. నిరసనలో భాగంగా ఆయన నోటికి నల్ల రిబ్బన్ కట్టుకొచ్చారు. దానిని తీసివేయాలని మార్షల్స్ కోరారు. ఆయన తీసివేసి జేబులో పెట్టుకున్నారు. జేబులో కూడా పెట్టుకోవడానికి వీల్లేదని.. తమకివ్వాలని మార్షల్స్ కోరారు. దీంతో లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నిరసనలో భాగంగా మేం రేపు నల్ల చొక్కా వేసుకుని వస్తాం. దానిని కూడా తీసివ్వాలని అడుగుతారా? ఈ నిబంధనలు ఎవరు పెట్టారని మీరు అమలు చేస్తున్నారు? మీకు ఏ అధికారాలు ఉన్నాయో చూపించండి. అసలు మమ్మల్ని ఏ కారణంతో ఆపుతున్నారు' అని నిలదీశారు. తమకు వచ్చిన ఆదేశాల ప్రకారమే తాము వ్యవహరిస్తున్నామని, వాటిని అమలు చేసి తీరాల్సిందేనని భద్రతా సిబ్బంది వాదించారు. గేటు కూడా ఒక మనిషి పట్టేలా మాత్రమే తెరిచిఉంచి అందులో నుంచే వెళ్లాలని చెప్పడంతో మళ్లీ వాగ్వాదం జరిగింది. ఈ వాదులాట తోపులాటకు దారితీసింది. చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కాలిని భద్రతా సిబ్బంది తొక్కేశారు. ఆయన కాలికి గాయమై రక్తం వచ్చింది. తర్వాత ఆయన అసెంబ్లీలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని కట్టు కట్టించుకున్నారు. సుమారు అరగంటపాటు ప్రధాన ద్వారం వద్ద ఈ హడావుడి జరిగింది. అనంతరం భద్రతా సిబ్బంది వెనక్కితగ్గి గేట్లు తెరవడంతో టీడీపీ ప్రజాప్రతినిధులు ధర్నా విరమించి లోపలకు వచ్చారు.

### చీఫ్ మార్షల్‌కు మండలి మందలింపు

- చైర్మన్ చాంబర్లో విచారణ
- మరోసారి తప్పు జరగరాదని హెచ్చరిక

అసెంబ్లీ చీఫ్ మార్షల్ థియోఫిలిస్‌ను శాసనమండలి గట్టిగా మందలించింది. చంద్రబాబు సహా టీడీపీ ప్రజాప్రతినిధుల పట్ల మార్షల్స్ వ్యవహరించిన తీరుపై చైర్మన్ ఎం.ఎ.షరీఫ్ చాంబర్లో అఖిల పక్ష సమావేశం విచారణ జరిపింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కారాదని, సభ్యుల పట్ల మార్షల్స్ గౌరవ మర్యాదలు చూపకపోతే సహించబోమని హెచ్చరించింది. మార్షల్స్ తమ పట్ల అమర్యాదగా ప్రవర్తించారని, లోనికి రానివ్వకుండా తమను అడ్డుకుని తమ హక్కులకు భంగం కలిగించారని శాసనమండలిలో పలువురు ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. దీనిపై చైర్మన్ తన చాంబర్లో అన్ని పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. చీఫ్ మార్షల్ థియోఫిలిస్‌ను పిలిపించారు. ఈ సమావేశానికి ప్రభుత్వం తరపున మంత్రులు బుగ్గన, సుభాష్ చంద్రబోస్, బొత్స, చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు; టీడీపీ నుంచి యనమల రామకృష్ణుడు, లోకేశ్, టీడీ జనార్దనరావు, గౌనివారి శ్రీనివాసులు; బీజేపీ నుంచి మాధవ్; పీడీఎఫ్ నుంచి బాలసుబ్రమణ్యం హాజరయ్యారు. మహిళా భద్రతా సిబ్బందిపై టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు దురుసుగా ప్రవర్తించారని చీఫ్ మార్షల్ ఆరోపించారు. దీనిపై టీడీపీ సభ్యులు మండిపడ్డారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికే అసత్య ఆరోపణలు చేస్తున్నారని.. పైగా కావాలని పురుష సిబ్బందిని వెనక్కి పంపి.. మహిళా సిబ్బందిని ముందుకు తీసుకొచ్చి వారితోనే తమను అడ్డగించారని విమర్శించారు. లోకేశ్ తన ల్యాప్‌టాప్‌లో అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద జరిగిన ఘటనల వీడియోను అందరికీ చూపించారు. దీంతో చీఫ్ మార్షల్ మౌనం వహించారు. అందరి అభిప్రాయాలూ విన్నాక మండలి చైర్మన్ షరీఫ్ రూలింగ్ ఇచ్చారు. ప్రజాప్రతినిధులను మార్షల్స్ అడ్డుకోరాదని.. వారి పట్ల గౌరవ మర్యాదలతో వ్యవహరించాలని ఆదేశించారు.

- ప్రభుత్వ వేధింపులతోనే కోడెల ఆత్మహత్య
- టీడీపీ కార్యకర్తలపై 650 దాడులు
- వేల మందిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులు
- ఇళ్ల కూల్చివేత, ఆర్థిక మూలాలపై దెబ్బ
- ఆస్తుల ధ్వంసం.. ప్రజావేదిక నేలమట్టం
- ఇవన్నీ ఉన్మాద చర్యలు కావా?
- మీడియాను గుప్పిట్లో పెట్టుకోవడానికే నల్ల జీవోలు
- టీడీపీ అధినేత చంద్రబాబు నిప్పులు
- జగన్ సర్కారు తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు



గత అసెంబ్లీలో పోడియంను చుట్టుముట్టిన వైసీపీ ఎమ్మెల్యేల వీడియోను విలేకర్లకు చూపిస్తున్న చంద్రబాబు

# ఉన్మాదమంటే కోపమా?

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉన్మాద ప్రభుత్వమంటే జగన్ సర్కారుకు కోపం వచ్చిందని, అది చేసిన చర్యలన్నీ ఉన్మాదాన్నే ప్రతిబింబిస్తున్నాయని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. కేసులు వేసి కోర్టుల చుట్టూ తిప్పుతామని బెదిరిస్తూ.. మీడియాను గుప్పిట్లో పెట్టుకోవడానికే జగన్ సర్కారు నల్ల జీవోలు తెస్తోందని చంద్రబాబు ఆరోపించారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి విజయవాడలోని రాజ్‌భవన్‌లో గురువారం సాయంత్రం గవర్నరు బిశ్వభూషణ్ హరిచందన్‌ను ఆయన కలిశారు. వైసీపీ ప్రభుత్వం మీడియాపై పెడుతున్న ఆంక్షలను, ఇస్తున్న ఆదేశాలను వివరించారు. అనంతరం మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'ఈ ప్రభుత్వ వేధింపులతోనే మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలపై 650 దాడులు చేశారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులు నమోదు చేశారు. ఆస్తులు ధ్వంసం చేశారు. ఇళ్లు కూల్చేయడం, ఆర్థిక మూలాలు దెబ్బతీయడం, చివరకు ప్రజా వేదిక కూల్చివేయడం ఉన్మాదం కాదా' అని ప్రశ్నించారు. తాము ప్రజల తరపున వివిధ సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతుంటే వాటికి సమాధానం చెప్పడం చేతగాక.. ముఖ్యమంత్రి తనను తిట్టి.. తిట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు. 'మా ప్రభుత్వం ఇంగ్లీషు మీడియం పెడితే.. పేదలకు విద్యను దూరం చేసి చైతన్య, నారాయణ స్కూళ్లకు మేలు చేయడానికి చేశామని యాగీచేశారు. వీళ్లు పెట్టిన తీరును మేం తప్పుబడితే చైతన్య, నారాయణ స్కూళ్లకు లాభం చేయడానికే మాట్లాడుతున్నామంటున్నారు. ఇది రెండు నాలుకల ధోరణి కాదా? ఇంగ్లీషు మీడియం వద్దని మేం అనడం లేదు. రెండూ ఉంచండి. ఏది తీసుకోవాలో విద్యార్థులు, తల్లిదండ్రుల ఇష్టానికి వదిలివేయండి. ఏదీ బలవంతంగా రుద్దకండి. విద్యార్థి పైకి రావడానికి ఒక్క ఆంగ్ల మాధ్యమమే చాలదు. విజ్ఞానం కూడా కావాలి. అదే చెబితే మేం ఇంగ్లీషును వ్యతిరేకిస్తున్నామని దుష్ప్రచారం చేస్తున్నారు' అని ఆక్షేపించారు.

## వీడియోల ప్రదర్శన

విలేకరుల సమావేశంలో రెండు వీడియోలను చంద్రబాబు ప్రదర్శించారు. గురువారం ఉదయం అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద తనను ఆపిన సంఘటన వీడియో ఇందులో ఒకటి. మీడియా స్వేచ్ఛపై నిరసన కార్యక్రమం నిర్వహిస్తే తట్టుకోలేకపోతున్నారని, తనను కూడా అసెంబ్లీ లోపలికి పోనివ్వకుండా ఆపాలని ప్రయత్నించారని ఆయన విమర్శించారు. 'కొత్తగా వచ్చిన అసెంబ్లీ చీఫ్ మార్షల్ మొరటుగా వ్యవహరిస్తున్నాడు. ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఆపడం, మహిళా ప్రజాప్రతినిధులతో ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం.. ప్రతిపక్ష నేతనైన నాతోనే ఎలా ప్రవర్తించాడో మీడియా అంతా చూసింది. అతనిపైనా, ఇతర మార్షల్స్‌పైనా వెంటనే చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరాం' అని వివరించారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు సభలో చేసిన నిరసన ఫొటోల వీడియో కూడా చూపించారు. 'టీడీఎల్పీ ఉప నేత బుచ్చయ్యచౌదరి ఆరోగ్యం బాగోలేక వేరే గేటు నుంచి వస్తుంటే ఆయన చేతిలో పేపర్లు కూడా లాక్కోవాలని చూశారు. అసెంబ్లీలో మేం ఉన్నది 23 మందిమి. మమ్మల్ని ఆపడానికి వందల మందిని పెట్టుకున్నారు. వాళ్లు అసెంబ్లీకి లిక్కర్ బాటిల్స్ కూడా తెచ్చారు. నా చాంబర్ వద్ద అద్దం కూడా పగలగొట్టారు. కాగితాలు చించి స్పీకర్ మీద విసిరారు. నల్ల బట్టలు వేసుకుని పోడియం పైకి ఎక్కి కూర్చున్నారు. మేం వాళ్ల మాదిరిగా చేశామా' అని విరుచుకుపడ్డారు.

### స్పీకర్‌ను, మంత్రులను డమ్మీ చేశారు

'అసెంబ్లీలో స్పీకర్‌ను, మంత్రులను డమ్మీలుగా మార్చారు. స్పీకర్ అనుమతి లేకుండానే నిన్న అసెంబ్లీ బయట జరిగిన వీడియోను తెచ్చి సభలో ప్రదర్శించారు. మంత్రులను పక్కన కూర్చోబెట్టి ముఖ్యమంత్రి తానే సమాధానాలు చెబుతున్నారు. తాను నిష్పాక్షికమని స్పీకర్ చెబుతూనే ప్రతిపక్ష నేతను దారుణంగా అవమానించినా చోద్యం చూస్తున్నారు. జోక్యం చేసుకోలేకపోతున్నారు. నాకు సమాధానం చెప్పడానికి సబ్జెక్టు లేక బూతులు తిట్టి తప్పించుకుందామని ప్రయత్నిస్తున్నారు. నన్ను చెప్పుతో కొట్టాలని.. రోడ్డుపై కాల్చాలని డైలాగులు చెప్పినప్పుడు ఎథిక్స్ కమిటీ గుర్తుకు రాలేదా? దున్నపోతు మాదిరిగా తోసుకొని పోతూ పెత్తందారీతనంతో పాలించాలని చూస్తే అనుమతించం. ఎంత వరకైనా పోరాటం చేస్తాం.'

### ట్రాయ్, ట్రిబ్యునల్ ఆదేశించినా..

'పత్రికలు, టీవీలు, సోషల్ మీడియాలో ఎక్కడ వ్యతిరేక వార్తలు వచ్చినా కేసులు వేసే అధికారాన్ని ఆయా శాఖల కార్యదర్శులకు అప్పగిస్తూ ఈ ప్రభుత్వం 2430 జీవో తెచ్చింది. రాష్ట్రంలో కేబుల్ ఆపరేటర్లు రెండు చానళ్ల ప్రసారాలను నిలిపివేయకుండా ట్రాయ్ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. సంబంధిత ట్రిబ్యునల్ రాష్ట్రప్రభుత్వానికి జరిమానా కూడా విధించింది. అయినా మొండిగా పోతున్నారు. అసెంబ్లీ ప్రసారాలు కవర్ చేయకుండా మూడు చానళ్లను ఆపారు. తునిలో ఒక విలేకరిని హత్య చేశారు. చీరాలలో ఒక విలేకరిపై హత్యాయత్నం చేశారు. నెల్లూరులో జమీన్ రైతు సంపాదకుడిపై దాడిచేసి కొట్టారు. ఇవన్నీ గవర్నరుకు వివరించాం.'

## 2430 జీవో ప్రతుల చించివేత

- అసెంబ్లీ బయట టీడీపీ సభ్యుల నిరసన
- పోలీసులు అడ్డుకోవడంపై ఆగ్రహం

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మీడియా స్వేచ్ఛను హరిస్తూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవో 2430ను టీడీపీ సభ్యులు గురువారం అసెంబ్లీ బయట చించివేశారు. ఈ జీవోని వ్యతిరేకిస్తూ అసెంబ్లీకి నల్లబ్యాడ్జీలు, బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించిన టీడీపీ సభ్యులను పోలీసులు అడ్డుకున్నారు. అసెంబ్లీ గేటు వద్ద ప్రతిపక్ష నేత చంద్రబాబుతో సహా పార్టీ నేతలను మార్షల్స్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. చంద్రబాబు పట్ల చీఫ్ మార్షల్ వ్యవహరించిన తీరుపై టీడీపీ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీలో వాయిదా తీర్మానానికి టీడీపీ సభ్యులు పట్టుపట్టారు. అందుకు స్పీకర్ తిరస్కరించడంతో సభ నుంచి వాకౌట్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీ బయట పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, జీవో 2430 ప్రతులను చించివేశారు.

## సీపీఎస్ రద్దు ఎప్పుడో చెప్పలేదు

- నిలదీసిన టీడీపీ.. మెడ మీద కత్తిపెడితే ఎలా?: బుగ్గన



అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని పాదయాత్రలో జగన్ చెప్పారు. ఆరు నెలలైనా రద్దు చేయడం లేదు. వారం.. నెలా.. పోయి ఇప్పుడు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారు. అసలు సీపీఎస్ రద్దు చేస్తారో లేదో చెప్పండి. ప్రభుత్వానికి ఆ ఉద్దేశం ఉందా.. లేదా? సమాధానం చెప్పాలి.' అని గురువారం శాసన మండలిలో టీడీపీ సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సమాధానమిస్తూ మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పాంకానీ టైం ఫ్రేమ్ గురించి చెప్పలేదన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని మెడ మీద కత్తిపెడితే ఎలా అని మంత్రి ప్రశ్నించారు. సీపీఎస్‌పై వేసిన కమిటీ 2020 మార్చిలోగా నివేదిక ఇస్తుందని చెప్పారు.

## మండలికి ఉల్లి సెగ

- ఇది చేతగాని ప్రభుత్వం: టీడీపీ
- కొరత నివారణకు చర్యలు తీసుకుంటున్నాం: మోపిదేవి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు గురువారం శాసన మండలిలో వేడి పుట్టించాయి. ప్రభుత్వ చేతగానితనంవల్లే ధరలు నియంత్రించ లేకపోయిందని టీడీపీ సభ్యులు పోతుల సునీత, గుమ్మడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. ఉల్లి కోసం రైతు బజార్ల వద్ద కిలోమీటర్ల మేర జనం క్యూల్లో ఉంటున్నారని, గ్రామ వలంటీర్ల ద్వారా ఉల్లిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల్లోనూ విక్రయించాలని కోరారు. మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ ఉల్లి కొరత నివారణకు తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. అయినా మీ హెరిటేజ్‌లోనే ఉల్లిని ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారంటూ లోకేశ్‌ను ఉద్దేశించి మంత్రి వ్యాఖ్యానించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. 'ఆరు నెలల నుంచి హెరిటేజ్.. హెరిటేజ్ అంటున్నారు. ఇంకా ఎన్నాళ్లు ఇలా చేస్తారు? ఉల్లిపాయలను ప్రజలకు అందించడంలో ఈ ప్రభుత్వం విఫలమైంది. మంత్రి సభను తప్పుదోవ పట్టిస్తున్నందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నాం.' అని చెప్పి టీడీపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఉల్లిపై చర్చ జరుగుతున్నప్పుడు మండలిలో మోపిదేవి ఒక్కరే ఉన్నారు. దీనిపై వైస్ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం తీవ్రంగా స్పందించారు. 'ఒక్క మంత్రి కూడా ఉండటం లేదు. వారుండేలా చూడాల్సిన బాధ్యత చీఫ్‌విప్, విప్‌లదే' అని అన్నారు.

### సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం

శాసనసభలో గురువారం ఆంధ్రప్రదేశ్ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ బిల్.., ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ అమెండ్‌మెంట్ బిల్-2019.., స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ బిల్-2019 బిల్లులను మంత్రులు ప్రవేశ పెట్టారు.

## మెగా డీఎస్సీ నిర్వహించాలి: పీడీఎఫ్

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 20వేల పోస్టుల భర్తీకి తక్షణమే మెగా డీఎస్సీ నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చెప్పారు. గురువారం మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ 2018 డీఎస్సీలో 7వేల పోస్టులు ఇంత వరకూ భర్తీ చేయలేదని, ఆ విషయాన్ని మండలిలో మంత్రిని ప్రశ్నించగా, 15 రోజుల్లో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని, గత నాలుగేళ్లుగా ఏపీపీఎస్సీ అనుసరించిన విదానాలు నిరుద్యోగులకు శరాఘాతంగా ఉన్నాయని తెలిపారు. సీపీఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎయిడెడ్ స్కూళ్ల టీచర్లకు పదోన్నతులివ్వాలని రాము సూర్యారావు కోరారు. ఎయిడెడ్ కళాశాలల్లోని అన్‌ఎయిడెడ్ లెక్చరర్లకూ మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని కత్తి నరసింహారెడ్డి కోరారు. వర్సిటీల్లో ఖాళీగా ఉన్న 3వేల అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని యండపల్లి శ్రీనివాసులరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## సభకు రావాలా.. వద్దా?

- 3 రోజులుగా మార్షల్స్ వేధిస్తున్నారు
- సభ్యులను ఆపే అధికారం ఎవరిచ్చారు?
- చీఫ్ మార్షల్ తీరుపై లోకేశ్ ఫైర్

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా చీఫ్ మార్షల్, మార్షల్స్ తమను వేధిస్తున్నారని, ఇదే పరిస్థితి ఉంటే తామిక శాసన మండలికి రావాలో వద్దో చెప్పాలని టీడీపీ ఎమ్మెల్సీలు గురువారం సభలో డిమాండ్ చేశారు. వద్దంటే రావడం మానేస్తామన్నారు. మండలిపై స్పీకర్, చీఫ్ మార్షల్ పెత్తనమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలి గురువారం ప్రారంభంకాగానే. కొన్ని మీడియా సంస్థలకు అనుమతి నిరాకరణపై టీడీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు మండలి చైర్మన్ షరీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ సభ్యుడు లోకేశ్ మాట్లాడుతూ.. మండలి సమావేశాలు మొదలైనప్పటి నుంచే సభ్యులను అగౌరవపరిచే రీతిలో చీఫ్‌మార్షల్, మార్షల్స్ వ్యవహరిస్తున్నారని.. గేట్లకు తాళం వేశారని, ప్లకార్డులు ఉన్నాయని రానివ్వడంలేదని చెప్పారు. నల్ల రిబ్బన్‌ను తీసేయమన్నారని తీసి జేబులో పెట్టుకుంటే ఇంకా ఏమున్నాయో జేబు చూపించమన్నారని ఆక్షేపించారు. మార్షల్స్ అగౌరవపరుస్తున్నారని ఇప్పటికే రెండు లేఖలు చైర్మన్‌కు అందజేశామని.. మళ్లీ గురువారం కూడా మార్షల్స్ తనను బహిరంగంగా అగౌరవపరిచారని, మహిళా సభ్యులను కూడా అవమానిస్తున్నారని, ఇదే తీరు కొనసాగితే తాము మండలికి వచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. రావద్దని రూలింగ్ ఇస్తే ఇక కౌన్సిల్‌కు రామని, సభను మీరే నడుపుకోండని అన్నారు. రోజూ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్నా మార్షల్స్ తీరు మారడం లేదని.. పట్టి తోసేస్తుంటే ఊరుకోవాలా.. సభ్యుల హక్కులకు భంగం కలిగితే పట్టించుకోరా అని టీడీపీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సభ్యుడికి అవమానం జరిగినా అంగీకరించేది లేదని.. విచారించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చైర్మన్‌ను కోరారు. సభ్యుల హక్కులకు భంగం కలిగిన అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ విజ్ఞప్తిచేశారు. ఈరోజు టీడీపీ సభ్యులను మార్షల్స్ అవమానించారని, రేపు అదే తమకూ జరిగే అవకాశం ఉందని బాలసుబ్రమణ్యం (పీడీఎఫ్) అన్నారు. పరిస్థితి తీవ్రంగా ఉందని, సభ్యుల పట్ల మార్షల్స్ సరిగా ప్రవర్తించడం లేదని ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మండలిలో అన్నారు. 'మూడు రోజులుగా సభ్యులను వేధింపులకు గురిచేస్తున్నారు. మండలిపై స్పీకర్ పెత్తనమేంటి? చీఫ్ మార్షల్ పెత్తనమేంటి? సభ్యులకు అవమానాలు జరుగుతూ ఉంటే సభ నడుపుతూ పోతే ఎలా? దీన్ని కూడా కాదంటే సభలో కూర్చున్నా లేనట్లే.. మేమే వెళ్లిపోతాం' అని స్పష్టం చేశారు.

### చీఫ్ మార్షల్‌ను, మంత్రిని పిలిచి చెప్పినా..

తనకు సభ్యులు ఫిర్యాదు చేశాక చీఫ్ మార్షల్‌ను పిలిచి చెప్పానని, రెండో రోజు కూడా ఆర్థిక మంత్రిని పిలిచి చెప్పానని.. అయినా ఇలా జరగడం బాధాకరమని చైర్మన్ షరీఫ్ అన్నారు. మహిళా సభ్యులను మహిళా సిబ్బంది, మగవారిని మగవారే.. తాకకుండా చెక్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.






శాసనసభా విరామ సమయంలో అసెంబ్లీ ప్రాంగణంలోని సీఎం చాంబర్‌లో మంత్రులు పాముల పుష్పశ్రీవాణి, వనిత, సుచరిత, ఎమ్మెల్యేలు రోజా, విశ్వాసరాయ కళావతి, కె.భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, ఉండవల్లి శ్రీదేవి తదితరులు సీఎం జగన్‌ను కలిశారు. ఏపీ దిశ చట్టం-2019 తీసుకొస్తున్నందుకు అభినందనలు తెలిపారు.




చేతులు మారిన 450ఎకరాల

## అసైన్డ్ భూములు: బొత్స

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో ప్రస్తుతం గుర్తించిన నిబంధనల ఉల్లంఘనలే కాకుండా ఇంకా ఏమైనా అక్రమాలు జరిగాయా అనే కోణంలో లోతైన అధ్యయనం చేస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మొత్తం 2,500ఎకరాలకు గాను 450ఎకరాల్లో ఉల్లంఘనలు గుర్తించామన్నారు. అసైన్డ్ రైతుల పేరిట పూలింగ్‌కు ఇచ్చి, వేరేవ్యక్తుల పేరుతో రిటర్న్‌బుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించినట్లుగా తేలిందన్నారు. ఈ అవకతవకల జాబితాలో ప్రతిపక్ష పార్టీకి చెందిన పలువురు నేతల పేర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. సీఆర్డీయే వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించిన ఓ మాజీమంత్రికి చెందిన బినామీల పేరుతో దాదాపు 70ఎకరాల్లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణయిందన్నారు. పూర్తి వివరాలన్నీ త్వరలోనే బహిర్గతమవుతాయని బొత్స పేర్కొన్నారు.



రంగులు వేస్తే

## తప్పేముంది?

▸▸ టీడీపీ హయాంలో అన్నింటికీ పసుపు రంగు వేయలేదా...: మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): "పంచాయతీ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలకు రంగులు వేయమన్నాం. ఒక్కో బిల్డింగ్‌కి రూ.12వేలు ఖర్చవుతుంది. మేం వేసే రంగులతో పార్టీకి సంబంధం లేదు. ఏదో ఒక రంగు వేయాలి కాబట్టి వేస్తున్నాం" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా టీడీపీ సభ్యుడు చిక్కాల రామచంద్రరావు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. అంతకు ముందు టీడీపీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. "కేంద్రం ఆదేశిస్తే అన్ని రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు బీజేపీ రంగులు వేసి, ప్రధాని మోదీ బొమ్మ పెడతారా? పంచాయతీ ఎన్నికలు వస్తే వాటిని తీసేస్తారా" అని ప్రశ్నించారు. పంచాయతీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకులు, శ్మశానాలు, చివరికి మహాత్మాగాంధీ బొమ్మకు కూడా పార్టీ రంగులేస్తున్నారని చిక్కాల ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాల్లా చేస్తున్నారని బీజేపీ సభ్యులు విమర్శించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... టీడీపీ హయాంలో అన్నింటికీ పసుపు రంగు వేయలేదా... మీకో న్యాయం, మాకో న్యాయమా? అని ప్రశ్నించారు.

### ఉపాధి నిధులు సద్వినియోగం చేసుకోండి

ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పెద్దిరెడ్డి సూచించారు. గురువారం సచివాలయంలో ఆయా జిల్లాలకు సంబంధించి మంత్రులు మోపిదేవి వెంకటరమణ, మేకతోటి సుచరిత, తానేటి వనిత, ఆళ్లనాని, శ్రీరంగనాథరాజు, పేర్నినాని, ఉపసభాపతి కోన రఘుపతితో పాటు పలువురు ఎమ్మెల్యేలతో మంత్రి సమావేశమయ్యారు. ప్రతి నియోజకవర్గానికీ రూ.15 కోట్లు కేటాయించామని, రూ.40లక్షల వరకు గ్రామ సచివాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



క్రైస్తవ సంస్థల ఆస్తులపై

## అత్యున్నత కమిటీ

▸▸ మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా

క్రైస్తవ సంస్థల ఆస్తులు కాపాడటానికి అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి అంజాద్ బాషా అన్నారు. శాసనమండలిలో సభ్యులడిగిన ప్రశ్నకు ఆయన గురువారం సమాధానం చెప్పారు. అన్ని మతాల ఆస్తుల పరిరక్షణకు ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవ సంస్థల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకునే అవకాశం లేదని, ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తామన్నారు. గుంటూరులో తమ ప్రభుత్వ హయాంలో రూ.16కోట్లతో క్రైస్తవ భవనం నిర్మిస్తే, దానికి ఈ ప్రభుత్వం రంగులేస్తోందని టీడీపీ ఎమ్మెల్సీ డొక్కామాణిక్య వరప్రసాద్ విమర్శించారు.



"టీడీపీ పుట్టకముందే, నేను రాజకీయాల్లోకి రాకముందే ఈనాడు పుట్టింది. సాక్షి మీ మానస పుత్రిక. అవినీతి డబ్బుతో సాక్షిని మీరే పుట్టించారు. అది మీ పేపర్ కాదని ఎలా చెప్పగలరు? మీ పేపరుకు విశ్వసనీయత లేదా? అది చెత్తపేపరా? సాక్షికి బుద్ధీ జ్ఞానం ఉన్నాయా? సాక్షి పేపర్ వేరే, నేను వేరే అనడం జగన్ రెండు నాల్కల ధోరణి కాకపోతే మరేంటి?"
- చంద్రబాబు

"ఈనాడులో రాసింది మేం ఇక్కడ మాట్లాడితే ఎలా ఉంటుంది? పేపర్ అనేది బేసిక్‌గా అదొక మీడియా వ్యవస్థ. మీకు అనుకూలమైన పేపర్లు, చానెళ్లు ఉంటాయి. మాకు అనుకూలమైన పేపర్లు, చానెళ్లు మాకుంటాయి. ఆ వ్యవస్థలో రాసిన వాటిని పట్టుకొని ఇష్టం వచ్చినట్లుగా తిట్టుకుంటూ, అది మేమే చేశాము, మేమే మాట్లాడాము అంటే ఎట్లా కుదురుతుంది?"
- జగన్



# సిగ్గు.. సిగ్గు!

### ఇంగ్లీషు పెట్టిందే మేము: బాబు

ఇంగ్లీషు మీడియాన్ని తాము అడ్డుకుంటున్నట్లు, వ్యతిరేకిస్తున్నట్లు జగన్‌తో పాటు ఆయన పత్రిక సాక్షి అసత్య వార్తలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. "ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడానికి మేం ఎప్పుడూ వ్యతిరేకం కాదు. కానీ, తెలుగు మీడియం కూడా కొనసాగించాలని అడుగుతున్నాం. 2015లో ఇంగ్లీషు మీడియం చదువులకు మేమే శ్రీకారం చుట్టాం. మున్సిపల్ పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమంపై 2016 ఏప్రిల్ 16న జీవో ఇచ్చాం. కానీ 2017 జూన్ 27న మీ పత్రిక సాక్షిలో ఏం రాశారు? ఆంగ్లం అర్థం కాక మధ్యలోనే చదువు మానేస్తారని, తగ్గిన విద్యార్థుల సంఖ్యచూపి, డీ రెగ్యులేషన్ పేరిట ఆ స్కూళ్లను మూసి వేసి కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే వ్యూహం కనబడుతోందని రాశారు. మాతృభాషకు మంగళం అని కూడా రాశారు. మీది రెండు నాల్కల ధోరణి' అని చంద్రబాబు మండిపడ్డారు.

(మొదటి పేజీ తరువాయి)

చర్చ జరిగింది. దాదాపు రెండున్నర గంటలపాటు 'నువ్వా నేనా' అన్నట్లు సాగింది. దేశం గర్వపడేలా ఇంగ్లీషు మీడియం తీసుకొచ్చామని జగన్ అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రారంభమవుతుందని తెలిపారు. అదే సమయంలో.. ఇంగ్లీషు మీడియం బోధనకు టీడీపీ మద్దతు ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. 2015లోనే తాము ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 2017లో మున్సిపల్ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడానికి ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, తెలుగు భాష తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏ మాధ్యమం ఎంచుకోవాలనే అవకాశం విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉండాలని తెలిపారు. ఇదే చర్చ మెల్లమెల్లగా వాగ్వాదం దిశగా సాగింది. ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం ఇష్టంలేక చంద్రబాబు, ఈనాడు పత్రిక, ఓ సామాజికవర్గం యుద్ధం చేస్తోందని.. దీనికి ఉపరాష్ట్రపతి వెంకయ్య కూడా వత్తాసు పలుకుతున్నారని జగన్ ధ్వజమెత్తారు. దీనిపై చంద్రబాబు అంతే దీటుగా స్పందించారు. ఇంగ్లీషు మీడియం అమలు విషయంలో తమపై అసత్యాలు రాయించినందుకు, తప్పుడు ప్రచారం చేయించినందుకు జగనే తలదించుకోవాలన్నారు.

### ఆగ్రహావేశాలు...

తమ పత్రికలో కథనాలను ఉదహరిస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై సీఎం జగన్ తీవ్రంగా స్పందించారు. సాక్షి పత్రికలో, ఈనాడులో ఏం తప్పు రాశారో చర్చించడానికి అసెంబ్లీ లేదన్నారు. "జగన్‌గా నేను ఏం మాట్లాడానో చెప్పండి. ఐదేళ్లు సీఎంగా ఉండి ఇంగ్లీషు మీడియం అమలు చేయనందుకు, అబద్ధాలు చెబుతున్నందుకు సిగ్గుతో తలదించుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై చంద్రబాబు కూడా తీవ్రంగా స్పందించారు. తెలుగు భాషను రక్షించుకోవాలని ట్విటర్‌లో పెట్టిన పోస్టు గురించి ఏమంటారని ప్రశ్నించారు. "నేను కాదు.. మీరే సిగ్గుతో తలదించుకోవాలి. ప్రజలను మోసం చేసినందుకు క్షణమాపణ చెప్పాలి. నారాయణ స్కూళ్లను ప్రమోట్ చేయడానికే ఇంగ్లీషు మీడియం పెట్టారని నాడు మాపై సాక్షిలో రాశారు. సాక్షిలో రాస్తే ఆయనకు సంబంధం లేదా!?" అని ప్రశ్నించారు. దీంతో జగన్ ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. "ఈ మనిషికి బుద్ధీ జ్ఞానం ఉన్నాయా? కళ్లు పెద్దవి చేసి చూస్తే భయపడుతామనుకుంటున్నావా? ఈనాడులో రాసింది మేం ఇక్కడ మాట్లాడితే ఎలా ఉంటుంది? బుద్ధి ఉందా? పేపర్ అనేది బేసిక్‌గా అదొక మీడియా వ్యవస్థ. వారికి ఈనాడు ఉంటుంది. సాక్షి అనే పేపర్ ఈనాడుకు ఆపోజిట్‌గా ఒక వ్యవస్థగా ఉంటుంది. మీకు అనుకూలమైన పేపర్‌లు, చానెళ్లు ఉంటాయి. మాకు అనుకూలమైన పేపర్లు, చానెళ్లు మాకుంటాయి. ఆ వ్యవస్థలో రాసిన వాటిని పట్టుకొని ఇష్టం వచ్చినట్లుగా తిట్టుకుంటూ, అది మేమే చేశాము, మేమే మాట్లాడాము అంటే ఎట్లా కుదురుతుంది?" అని ప్రశ్నించారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ... "టీడీపీ పుట్టకముందే, నేను రాజకీయాల్లోకి రాకముందే ఈనాడు పుట్టింది. సాక్షి మీ మానస పుత్రిక. అవినీతి డబ్బుతో సాక్షిని మీరే పుట్టించారు. మీరే మరచిపోతే ఎలా? అది మీ పేపర్ కాదని ఎలా చెప్పగలరు? మీ పేపరుకు విశ్వసనీయత లేదా? అది చెత్తపేపరా? మీకు ఇతరులకు చెప్పే హక్కు ఉందా? మీరు చేస్తే సరైనది. ఇతరులు చేస్తే తప్పా? సాక్షికి బుద్ధీ జ్ఞానం ఉన్నాయా? మేం అవినీతి డబ్బులతో పేపర్‌లు, చానెళ్లు పెట్టలేదు. టీఆర్‌ఎస్ పార్టీకి ఒక చానెల్, ఒక పేపర్ ఉంది. శివసేనకు సామ్నా అనే పేపర్ ఉంది. కానీ, ఆ పేపర్లతో అవకాశవాద రాజకీయాలు చేయడం తప్పు. సాక్షి పేపర్ వేరే, నేను వేరే అనడం జగన్ రెండు నాల్కల ధోరణి కాకపోతే మరేంటి?" అని చంద్రబాబు ప్రశ్నించారు. అయితే... ఈనాడు పత్రిక నేటికీ చంద్రబాబును మోస్తోందని జగన్ తెలిపారు. కానీ, ముసుగులు వేసుకొని తనకు ఏ పేపర్‌లు లేవని చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. "పిల్లి పాలు తాగుతూ తనను ఎవరూ చూడటం లేదనుకుంటోంది. ఇంగ్లీషు మీడియం నిర్ణయంపై ఈనాడు, చంద్రబాబు, ఒక సామాజిక వర్గం యుద్ధం ప్రకటించింది. దీనికి వెంకయ్యనాయుడు వత్తాసు పలుకుతూ ప్రాంతీయ భాషల్లోనే విద్యాబోధన ఉండాలన్నారని ఈనాడు రాసింది" అని సీఎం పేర్కొన్నారు. ఈనాడుతో తమకేం సంబంధమని చంద్రబాబు ప్రశ్నించారు. జగన్ స్పందిస్తూ 'మీ పేపర్‌నే చదువుతున్న స్వామీ! మీరిచ్చిన ప్రకటనే చదువుతున్న నాన్నా! పాపం ఆయన కొడుకు... సుపుత్రమాలోకం' అంటూ లోకేశ్‌పై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. దీనిపై చంద్రబాబు అభ్యంతరం చెప్పారు. జగన్ కూడా ఒక తండ్రికి కొడుకే అని, ఆయనేమీ ఒక్కడుగా ఊడిపడలేదని అన్నారు.

### ఇంగ్లీషులో మాట్లాడాలని ఉంది: పుష్ప శ్రీవాణి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుకున్న తనకు ఇంగ్లీషులో మాట్లాడాలని ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి చెప్పారు. అయితే, ఇంగ్లీషు మాధ్యమంలో చదువుకోనందుకు అది సాధ్యపడటం లేదన్నారు. ఇదే అంశంపై వైసీపీ ఎమ్మెల్యేలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

'నాయుడు' ఉంటేనే

## టీడీపీలో గుర్తింపు: కన్నబాబు

▸▸ ఆ పేర్లకూ వక్రీకరణలా?: అచ్చెన్న

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు, టీడీపీ శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడు గురువారం అసెంబ్లీ లాబీల్లో పరస్పరం ఎదురు పడినప్పుడు కొంత సరదా సంభాషణ జరిగింది. పేరు చివర్లో 'నాయుడు' అని ఉంటేనే టీడీపీలో ప్రాధాన్యం ఉంటుందని, చంద్రబాబునాయుడు తర్వాత అచ్చెన్నాయుడు, రామానాయుడుకు అలాగే గుర్తింపు వచ్చిందని కన్నబాబు చమత్కరించారు. దీనికి.. వెనుకబడిన ప్రాంతాల వారి పేర్లను కూడా వక్రీకరించి అపార్థాలు సృష్టించడం సరికాదని అచ్చెన్నాయుడు బదులిచ్చారు. 'ఉన్మాది' అంశంపై కూడా వారి మధ్య చర్చకు వచ్చింది. 'ముఖ్యమంత్రిని మేం ఉన్మాది అన్నామో లేదో తెలియదుగానీ వైసీపీ ఎమ్మెల్యేలు ఇరవై మంది ఆ పదాన్ని పదేపదే అసెంబ్లీలో మాట్లాడారు. వారి మనసుల్లో సీఎంపై ఉన్న కోపాన్ని ఆ రకంగా తీర్చుకొన్నట్లు అనిపించింది' అని అచ్చెన్నాయుడు అన్నారు. టీడీపీపై మంత్రి అవంతి శ్రీనివాసరావు విమర్శలను కూడా అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. టీడీపీలో ఉంటే మంత్రిని కానని, వైసీపీలోకి వెళ్తే అవుతానని.. ఒకవేళ టీడీపీ మళ్లీ గెలిస్తే తిరిగి వెనక్కు వచ్చేస్తానని అవంతి తమతో చెప్పి మరీ వెళ్లారని ఆయన అన్నారు. అలాంటి వ్యక్తి కూడా తమను విమర్శిస్తే ఎలా అని అచ్చెన్నాయుడు అన్నారు.

### ఆదిమూలానికి ఆరాటం ఎక్కువ.. ఫలితం తక్కువ

▸▸ ఆయన మాట్లాడితే సభలో ఉండలేం: అచ్చెన్న

విద్యాశాఖ మంత్రి ఆదిమూలం సురేశ్ అసెంబ్లీలో మాట్లాడితే ఉండలేకపోతున్నామని, ఇబ్బందిగా ఉందని టీడీపీ సభ్యుడు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. మంత్రికి ఆరాటం ఎక్కువ, ఫలితాలు తక్కువగా ఉన్నాయన్నారు. దీనిపై మంత్రి సురేశ్ తీవ్రంగా స్పందించారు. ఒక దళితుడికి విద్యాశాఖ మంత్రిగా సీఎం అవకాశం ఇచ్చారని, అచ్చెన్న వ్యాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఇది లావుంటే.. మధుసూదన్‌రెడ్డితో వేగలేకపోతున్నామని, ఆయన్ను బయటకు పంపాలని అచ్చెన్న స్పీకర్‌ను కోరారు.

# కక్ష కొద్దీ 'శిక్ష!'



## ఈడీబీ మాజీ సీఈవో కృష్ణ కిశోర్ సస్పెన్షన్

▸▸ ఐఆర్‌ఎస్ అధికారిపై అనూహ్య చర్యలు
▸▸ పరిశ్రమల శాఖ నివేదికే ప్రాతిపదిక
▸▸ ఏసీబీ, సీఐడీ విచారణకు నిర్ణయం
▸▸ అప్పట్లో ఐటీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు
▸▸ జగతి లావాదేవీలపై నివేదిక ఇచ్చిన కిశోర్
▸▸ ఆ సంస్థ షేరుకు అంత విలువ లేదని వెల్లడి
▸▸ రూ.325 కోట్ల ఆదాయ పన్ను విధింపు
▸▸ అదే నివేదిక ఆధారంగా సీబీఐ అభియోగాలు
▸▸ అందువల్లే నేడు కక్ష సాధించారనే ఆరోపణలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

*అధికారిగా తన పని తాను నిక్కచ్చిగా చేయడమే నేరమైందా!?*

*అక్రమాలను నిర్ధారించడమే ఆయన చేసిన పాపంగా మారిందా!?*

*పాత కక్షను మనసులో పెట్టుకున్న సర్కారు పావులు కదిపి... సస్పెండ్ చేసిందా?*

*ఐఆర్‌ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్ సస్పెన్షన్‌పై తలెత్తుతున్న ప్రశ్నలు, సందేహాలివి!!*

చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి (ఈడీబీ) సీఈవోగా విధులు నిర్వహించిన ఐఆర్‌ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్‌పై జగన్ సర్కారు అనూహ్య రీతిలో సస్పెండ్ చేసింది. ఈ వ్యవహారం ఇప్పుడు అధికార వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. 'నాడు జగన్ అక్రమాలను వెలికి తీసినందుకే నేడు ఈ శిక్ష కాబోలు' అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

ఐఆర్‌ఎస్ అధికారి జాస్తి కృష్ణ కిశోర్ కేంద్రం నుంచి రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. చంద్రబాబు హయాంలో ఈడీబీ సీఈవోగా పని చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆయనను పక్కకు తప్పించారు. ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. అయితే... తనను రిలీవ్ చేస్తే కేంద్ర సర్వీసులకు వెళతానని కృష్ణ కిశోర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కానీ, ఆయనను సర్కారు రిలీవ్ చేయలేదు. గురువారం అనూహ్యంగా ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఉత్తర్వులు జారీ చేశారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, వాణిజ్య శాఖల నుంచి అందుకున్న నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీవోలో తెలిపారు. కృష్ణ కిశోర్‌పై ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ విడివిడిగా కేసులు నమోదు చేసి, అక్రమాలపై విచారణ జరిపి ఆరు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం జాస్తి కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేస్తున్నామని, క్రమ శిక్షణ చర్యలు పూర్తయ్యే వరకు ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. అంతేకాదు... విచారణ పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లకూడదని కృష్ణకిశోర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

### కొందరిపై గురి...

కేంద్రం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఐఆర్‌ఎస్ అధికారులను జగన్ సర్కారు లక్ష్యంగా పెట్టుకుందని మొదటి నుంచీ అధికార వర్గాలు చెబుతున్నాయి. తమను తిరిగి సొంత కేడర్‌కు పంపించాలని వీరు కోరినప్పటికీ... పట్టించుకోలేదు. పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. కొన్ని అంశాలపై విచారణ జరుగుతోందని, కొలిక్కి వచ్చేదాకా రిలీవ్ చేయబోమని చెబుతూ వచ్చారు. ఐఆర్‌ఎస్ అధికారి వెంకయ్య చౌదరి మాత్రం తన డిప్యుటేషన్ కాలం పూర్తి కావడంతో 'డీమ్డ్ టు బి రిలీవ్డ్'గా కేంద్రానికి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేయలేదంటూ సచివాలయంలో అసాధారణ రీతిలో ఒక అసిస్టెంట్ సెక్రటరీని, ఎస్‌వోను సస్పెండ్ చేశారు. (వీరిపై గురువారమే సస్పెన్షన్ ఎత్తివేశారు.) ఇప్పుడు... ఇప్పుడు జాస్తి కృష్ణ కిశోర్‌పై సస్పెన్షన్ వేటు వేయడం గమనార్హం!

### ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళితే...

పదేళ్ల కిందట వైఎస్ జగన్‌కు చెందిన జగతి పబ్లికేషన్స్‌లో ఆర్థిక అక్రమాల వెలికితీసినందుకే... ఇప్పుడు జాస్తి కృష్ణ కిశోర్‌పై సస్పెన్షన్, విచారణ పేరిట కక్ష సాధిస్తోందని అధికార వర్గాలు అనుమానిస్తున్నాయి. ఆయా వర్గాలు తెలిపిన ప్రకారం... కృష్ణ కిశోర్ 2009లో ఆదాయపు పన్ను శాఖలో హైదరాబాద్ రేంజ్-2 అదనపు కమిషనర్‌గా ఉన్నారు. ఆయనకంటే పై హోదాలో కమిషనర్, చీఫ్ కమిషనర్ ఉంటారు. అప్పట్లో... జగతి పబ్లికేషన్స్ సంస్థ 10 రూపాయల ముఖ విలువ ఉన్న షేరును... రూ.370 చొప్పున విక్రయించింది. అంటే... ఒక్క షేరుకు రూ.360 ప్రీమియం! ఈ లావాదేవీ సక్రమంగానే జరిగిందా అనే విషయం తేల్చాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) హైదరాబాద్ రేంజ్-2 ఐటీ అధికారులకు ఫైలు పంపింది. ఈ బాధ్యతను అదనపు కమిషనర్‌గా ఉన్న జాస్తి కృష్ణ కిశోర్‌కు అప్పగించారు. ఆయన దీనిపై లోతుగా విచారణ జరిపారు. చివరికి... "జగతి పబ్లికేషన్స్‌కు ఉన్న ఆస్తులు సున్నా! ఆదాయమూ సున్నా! ఇలాంటి కంపెనీ షేరును రూపాయికి కూడా కొనరు. ఇంకా చెప్పాలంటే... జగతి కంపెనీ షేరు విలువ మైనస్ 18 ఉంటుంది" అని తేల్చారు. ఈ షేరును రూ.370కి కొనడం అసాధారణమని తెలిపారు. ఈ షేర్లు కొన్న వారంతా వైఎస్ సర్కారు హయాంలో పలుమార్గాల్లో లబ్ధి పొందిన వారే అని కూడా గుర్తించారు. దీనిని 'క్విడ్ ప్రోకో'గా నిర్ధారించారు. షేర్ల విక్రయం ద్వారా జగతి సమకూర్చుకున్న సొమ్మును 'ఇతర మార్గాల్లో ఆదాయం' (ఇన్‌కమ్ ఫ్రం అదర్ సోర్సెస్)గా పరిగణించి రూ.325 కోట్ల పన్ను చెల్లించాలన్నారు. ఈ లావాదేవీపై సవివరమైన నివేదికను సీబీడీటీకి పంపించారు. దీనిపై జగతి పబ్లికేషన్స్ సీఐటీ అప్పీల్‌కు వెళ్లారు. నివేదిక పక్కాగా ఉందని, రూ.325 కోట్లు చెల్లించాల్సిందేనని సీఐటీ తెలిపింది. జగతి సంస్థ ఈ ఆదేశాలపై తిరిగి ఐఏసీటీకి అప్పీలుకు వెళ్లింది. అక్కడ ఈ సంగతి ఇంకా తేలనేలేదు. ఇదంతా పక్కనపెడితే... నాడు జాస్తి కృష్ణ కిశోర్ జగతి పబ్లికేషన్స్ లావాదేవీలపై రూపొందించిన నివేదికను సీబీఐ కూడా పరిగణనలోకి తీసుకుంది. దీనిని మరింత లోతుగా విశ్లేషించి, దర్యాప్తు జరిపి... జగన్ అక్రమాస్తుల కేసుల్లో అభియోగాలు నమోదు చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు... కావాలనే జాస్తి కృష్ణ కిశోర్‌పై సస్పెన్షన్ వేటు వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఈడీబీ సీఈవోగా అక్రమాలకు పాల్పడ్డారని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఎందుకంటే... ఆ విభాగం నేరుగా ఎవరికీ భూములు కేటాయించదు. ప్రోత్సాహకాలూ ఇవ్వదు. పారిశ్రామిక వేత్తలకు, ప్రభుత్వానికీ మధ్య అనుసంధానంగా మాత్రమే ఉంటుంది. ఈడీబీ బడ్జెట్ రూ.30 కోట్లకు మించి లేదు. సిబ్బంది జీతాలు, సీఎం విదేశీ పర్యటనల ఖర్చు దాని నుంచే భరిస్తారు. ఇక... అక్రమాలకు తావెక్కడ? మరేదో మనసులో పెట్టుకునే కృష్ణ కిశోర్‌ను సస్పెండ్ చేసినట్లుంది" అని ఒక రిటైర్డ్ అధికారి తెలిపారు.

### ఇదేనా పద్ధతి?

కేంద్ర సర్వీసు కేడర్‌లో... అది కూడా ఒక కార్యదర్శి/ఐటీ కమిషనర్ స్థాయిలో ఉన్న అధికారిని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా సస్పెండ్ చేయడం బహుశా ఇదే మొదటి సారి. నిజానికి... డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులపై ఎడాపెడా చర్యలు తీసుకోరు. కొన్ని పద్ధతులు, మర్యాదలు పాటిస్తారు. ఉదాహరణకు... కేంద్ర సర్వీసులకు వెళ్లిన ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారి ఒకరిపై తీవ్రమైన ఆరోపణలు వచ్చాయి. ఆయనను నేరుగా సస్పెండ్ చేసే అవకాశమున్నప్పటికీ... కేంద్రం అలా చేయలేదు. ఆ అధికారిని తిరిగి రాష్ట్రానికి పంపింది. "మీ కేడర్ అధికారి మావద్దకు వచ్చి ఇలా వ్యవహరించారు. తగిన చర్యలు తీసుకోండి" అని సిఫారసు చేసింది. అప్పుడు... రాష్ట్రమే ఆయనపై చర్యలు తీసుకుంది. నిజానికి... జాస్తి కృష్ణకిశోర్‌ను ఏ ఆరోపణలపై సస్పెండ్ చేశారో కూడా జీవోలో చెప్పలేదు. 'పరిశ్రమల శాఖ ఇచ్చిన నివేదిక మేరకు' అని మాత్రమే తెలిపారు. సీఐడీ, ఏసీబీ విచారణ జరపాలని ఆదేశించారు.

## బ్యూరోక్రసీపై కసి

▸▸ విశాఖ జేసీ ఆకస్మిక బదిలీ.. స్థాయి తగ్గించి అవమానం
▸▸ జేసీ-2గా విశాఖలోనే పోస్టు.. ఐఏఎస్ వర్గాల్లో తీవ్ర విస్మయం



విశాఖపట్నం, అమరావతి. డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్ అధికారి, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ లోతేటి శివశంకర్‌ను ప్రభుత్వం రాష్ట్ర ఆకస్మికంగా బదిలీ చేసింది. అవమానించే రీతిలో ఆయన స్థాయిని తగ్గించి అదే జిల్లాలో జాయింట్ కలెక్టర్-2గా పనిచేయాలని ఆదేశించింది. ఆ స్థానంలో ఇంతవరకు స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు పనిచేస్తూ వస్తున్నారు. ప్రస్తుతం జేసీ-2గా విధులు నిర్వహిస్తున్న సూర్యకళ కూడా ఆ కేడర్ అధికారే. ఆమెను ఆ పోస్టునుంచి బదిలీచేస్తూ అమరావతిలో రిపోర్టుచేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఆమె బదిలీతో ఖాళీ అయిన పోస్టులోకి శివశంకర్‌ను పంపారు. శివశంకర్ డైరెక్ట్ రిక్రూటీ ఐఏఎస్ అధికారి. అలాంటి వ్యక్తిని డీగ్రేడ్ చేస్తూ జేసీ-2గా నియమించడం ఐఏఎస్ అధికార వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. వేణుగోపాల్‌రెడ్డి స్టేట్ సివిల్ సర్వీసు (ఎస్‌సీఎస్) అధికారి. 2007 డిప్యూటీ కలెక్టర్ బ్యాచ్‌కు చెందిన ఆయనకు ఎస్‌సీఎస్ కేటగిరీలో ఐఏఎస్ పదోన్నతి లభించింది. వీరిద్దరూ 2013 బ్యాచ్‌కు చెందినవారే కావడం విశేషం. జాయింట్ కలెక్టర్-1గా ఎస్‌సీఎస్ అధికారిని, జాయింట్ కలెక్టర్-2గా డైరెక్ట్ రిక్రూటీ అధికారిని నియమించడం ఇదే తొలిసారి అని, ఇది చాలా విచిత్రంగా ఉందని ఐఏఎస్ వర్గాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. ఒక జిల్లాకు జేసీ1, జేసీ2లుగా ఇద్దరు ఐఏఎస్‌లను నియమించడం కూడా ఇదే తొలిసారి. దీంతో ఎవరు ఏ పనిచేయాల్సో, ఎవరికి ఏ సబ్జెక్టులు కేటాయించాలన్నదానిపై త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఈ ఉత్తర్వులు వచ్చే సమయంలో కలెక్టర్ వినయ్‌చంద్ మాడుగుల పరిసరాల్లో పర్యటిస్తుండగా, జేసీ శివశంకర్ చింతపల్లిలో ఉన్నారు. అక్కడ ఉండగానే విషయం తెలిసి షాక్‌కు గురైనట్టు తెలిసింది. ఎటువంటి సంప్రతింపులు లేకుండా బదిలీ చేయడం ఏమిటని ఆయన విస్మయం వ్యక్తంచేసినట్టు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులను కలవడానికి ఆయన చింతపల్లి నుంచే నేరుగా అమరావతి పయనమయ్యారని ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

### 22-ఏ భూములపై నిక్కచ్చిగా..

ప్రభుత్వ పెద్దలు చెప్పిన పనులు చేయకపోవడం వల్లే శివశంకర్‌ను బదిలీ చేశారనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా 22-ఎ భూముల విషయంలో ఆయన కచ్చితంగా వ్యవహరిస్తుండడం కొందరి పెద్దల అసంతృప్తికి కారణమయిందని తెలుస్తోంది. అధికార పార్టీ ప్రముఖుడికి చెందిన 22-ఎ ఫైలు విషయంలో జేసీ శివశంకర్ నిక్కచ్చిగా ఉన్నారని తెలిసింది. ఈ విషయంలో కలెక్టర్ వినయ్‌చంద్ మాట కూడా ఆయన వినలేదని, దానివల్ల కొద్ది రోజులుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్...మధ్య కొంత గ్యాప్ వచ్చిందని కలెక్టరేట్‌లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల రెండు, మూడుసార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ పెద్దలు శివశంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు కలెక్టరేట్ వర్గాలు చెబుతున్నాయి.

### మరీ ఇంత అవమానమా?

గత కొంతకాలంగా కలెక్టర్‌కు, జేసీ మధ్య దూరం పెరుగుతూ వస్తోంది. అమ్మఒడి, నవశకం వంటి కార్యక్రమాల అమలుపై కలెక్టర్‌తో ఇటీవల సీఎంవో మాట్లాడినట్టు తెలిసింది. ఈ సమయంలో తనకు మరో జేసీ కావాలని, ఐఏఎస్‌ని కేటాయించాలని కలెక్టర్ ప్రత్యేకంగా కోరినట్లు తెలిసింది. ఇందుకు సీఎంవో సమ్మతించి... వేణుగోపాల్‌రెడ్డిని ఇవ్వడానికి సిద్ధమైందని తెలిసింది. ఇక్కడే అసలుసమస్య వచ్చింది. జగన్ ప్రభుత్వం వచ్చాకే శివశంకర్‌ను నియమించింది. సీతంపేట ఐటీడీఏ అధికారిగా ఆయన సర్వీస్ రికార్డు నచ్చి, ఏరికోరి విశాఖ జేసీగా నియమించింది. సరిగ్గా ఐదు నెలల తిరగక ముందే ఆయన స్థాయి తగ్గించిన తీరు ఆర్‌ఆర్ కేటగిరీ ఐఏఎస్‌లను తీవ్ర కలవరానికి గురిచేసింది. 'ఇందులో సామాజిక కోణం కూడా ఉంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం" అని సీనియర్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

## కాబ్‌తో అసోంపై దుష్ప్రభావం ఉండదు



పౌరసత్వ చట్ట సవరణ బిల్లు(కాబ్) వల్ల అసోంపై దుష్ప్రభావం ఏమీ ఉండబోదు. అసోం ఒప్పందం 6వ క్లాజ్ అమలుతో రాజకీయ స్థిరత్వానికి బాటలు పడతాయి. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అణచివేతకు గురైన మైనారిటీ శరణార్థులకు ఈ బిల్లు బాసటగా నిలుస్తుంది.

*- అసోం మంత్రి హిమంత విశ్వ శర్మ*

## పౌరసత్వ బిల్లుతో సమాజంలో చీలిక



పౌరసత్వ చట్ట సవరణ బిల్లు సమాజంలో చీలిక తెస్తుంది. ఈశాన్యరాష్ట్రాల్లో మిశ్రమ సంస్కృతిని దెబ్బ తీసే ఈ బిల్లును తక్షణమే రద్దు చేయాలి. హిందువులు, ముస్లింల మధ్య నిట్టనిలువునా చీలిక తెచ్చేందుకే కాబ్‌ను తీసుకొచ్చారు.

*- అసోం మాజీ సీఎం ప్రఫుల్లకుమార్ మహంత*

## మతపరంగా చీల్చింది కాంగ్రెస్సే



మతం ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని రెండు ముక్కలు చేసింది. మహ్మద్ అలీ జిన్నా ఒత్తిడితోనే దేశ విభజనకు పాల్పడింది. పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లలో పీడనకు గురైన మైనారిటీల రక్షణ కోసమే పౌరసత్వ సవరణ బిల్లు తెచ్చాం.

*- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్*



## చిల్ గ్రెటా... సినిమాకెళ్లు!: ట్రంప్

వాషింగ్టన్, డిసెంబరు 12:పర్యావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌ను టైమ్ పత్రిక ఈ ఏటి మేటి వ్యక్తిగా ప్రకటించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. "చాలా హాస్యాస్పదం. గ్రెటా తన కోపాన్ని నియంత్రించుకోలేని సమస్య గురించి ఆలోచించాలి. తరువాత ఫ్రెండ్‌తో కలిసి మంచి పాత సినిమాకు వెళ్లాలి! చిల్ గ్రెటా, చిల్!!" అని ట్రంప్ ట్వీట్ చేశారు. దీనిపై 16 ఏళ్ల గ్రెటా స్పందించింది. "ఒక టీనేజర్ తన కోపాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం ఫ్రెండ్‌తో కలిసి పాత సినిమా చూస్తూ ఎంజాయ్ చేస్తోంది" అని తన ట్విటర్ బయోలో రాసింది.



## మేధా పాట్కర్ పాస్‌పోర్టు జప్తు

న్యూఢిల్లీ, డిసెంబరు 12: నర్మదా బచావో ఆందోళన్ నేత, హక్కుల కార్యకర్త మేధా పాట్కర్ పాస్‌పోర్టును ప్రభుత్వం జప్తు చేసింది. తొమ్మిది క్రిమినల్ కేసులున్నప్పటికీ ఆమె తన పాస్‌పోర్టు దరఖాస్తులో అలాంటివేవీ లేవని పేర్కొన్నట్లు ఓ జర్నలిస్టు ఫిర్యాదు చేశారు. ముంబైలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయ (ఆర్‌పీవో) అధికారులు మధ్యప్రదేశ్ డీజీపీని వివరణ కోరగా అది నిజమేనని, ఖాండ్వా, బార్వాణీ, అలీ రాజ్‌పూర్‌ల్లో కొన్ని క్రిమినల్ కేసులున్నట్లు ధ్రువీకరించారు. ఆమె ఈనెల 9న తన ట్రావెల్ పత్రాలను సమర్పించిన సందర్భంలో పాస్‌పోర్టును అధికారులు నిలిపేశారు.



## కొత్త దేశంగా బోగన్‌విల్లె

కాన్‌బెర్రా, డిసెంబరు 12: దక్షిణ పసిఫిక్ రీజియన్‌లోని బోగన్‌విల్లె కొత్త దేశంగా ఆవిర్భవించనుంది. పపువా న్యూ గినియా నుంచి స్వాతంత్ర్యం కోరుతూ నిర్వహించిన రిఫరెండంలో 98 శాతం మంది అనుకూలంగా ఓటు వేశారు. రెండువారాల పాటు సాగిన ఓటింగ్‌లో 85 శాతం మంది హక్కును వినియోగించుకున్నారు.

## ఆ తీర్పే అంతిమం!

- **అయోధ్య రాముడిదే: సుప్రీం కోర్టు**
- **రివ్యూ పిటిషన్లన్నీ డిస్మిస్**

న్యూఢిల్లీ, డిసెంబరు 12: 'అయోధ్య రాముడిదే' అని తాము చెప్పిన తీర్పే అంతిమమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గత నెల 9వ తేదీన ఇచ్చిన తీర్పుపై సమీక్షకు నిరాకరించింది. దీనిపై దాఖలైన అన్ని పిటిషన్లను తోసిపుచ్చుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బాబ్డే నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం రివ్యూ పిటిషన్లపై గురువారం అంతర్గత విచారణ జరిపింది. అయోధ్యలో 2.77 ఎకరాల వివాదాస్పద స్థలాన్ని 'రాముడికే అప్పగిస్తూ ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ మొత్తం 19 పిటిషన్లు దాఖలయ్యాయి. "వీటిని జాగ్రత్తగా పరిశీలించాం. వీటిని పరిగణనలోకి తీసుకోవడానికి ఎలాంటి కారణం కనిపించలేదు. అందుకే డిస్మిస్ చేస్తున్నాం" అని ధర్మాసనం తెలిపింది. మొత్తం 19 పిటిషన్లలో పదింటిని ప్రధాన కేసుతో సంబంధమున్న వారు దాఖలు చేశారు. రివ్యూ పిటిషన్ల కొట్టివేతను విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు సదాశివ్ కోక్జే స్వాగతించారు. సుప్రీం నిర్ణయం నిరాశకు గురిచేసినా.. ఆ నిర్ణయాన్ని గౌరవిస్తామని జమియత్ ఉలేమా-ఏ-హింద్(జేయూఈహెచ్) సంస్థ అధినేత మౌలానా అర్షద్ మదనీ చెప్పారు.

### ఇక క్యూరేటివ్ పిటిషన్ ఒక్కటే...

'ఆ తీర్పే ఫైనల్' అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పడంతో... ఇక దీనిపై సమీక్షలకు దారి మూసుకుపోయినట్లే. పిటిషనర్లకు మిగిలిన ఒకే ఒక మార్గం... 'క్యూరేటివ్ పిటిషన్' దాఖలు చేయడం. అంటే... "మీ నిర్ణయం వల్ల మాకు అన్యాయం జరిగింది. రివ్యూ పిటిషన్‌ను తోసిపుచ్చడంలో సహజ న్యాయాన్ని పాటించలేదు" అని కోర్టుకు సూటిగా చెప్పడమే. అయితే, తమ వాదనను బలపరిచే అంశాలను క్యూరేటివ్ పిటిషన్‌లో స్పష్టంగా వివరించాల్సి ఉంటుంది. దీనిని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు పరిశీలిస్తారు. క్యూరేటివ్ పిటిషన్ ఆషామాషీగా ఉందని భావిస్తే... దానిని తోసిపుచ్చడంతోపాటు కోర్టు ఖర్చులు చెల్లించాలని కూడా ఆదేశించే అవకాశం ఉంటుంది.



# అగ్నిగుండంలా అసోం



గువాహటి, డిసెంబరు 12: అసోం అగ్నిగుండంలా రగిలిపోతోంది! పార్లమెంటు ఆమోదించిన పౌరసత్వ సవరణ బిల్లును (సీఏబీ) వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వస్తున్న జనాగ్రహంతో దద్దరిల్లిపోతోంది!! ఎవరూ కర్ఫ్యూని లెక్క చేయడంలేదు! లాఠీచార్జిలకు భయపడటంలేదు! తుపాకీ తూటాలకు వెరవడంలేదు! నిషేధాజ్ఞలను ధిక్కరిస్తూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. హింసకు దిగేవారిని హెచ్చరించేందుకు ఆర్మీ 'ఫ్లాగ్‌మార్చ్' చేపట్టగా.. నిరసనకారులు ఆ సైనికులకు సైతం భయపడకుండా వారితో ఢీ అంటే ఢీ అన్నట్టుగా ప్రవర్తించారు. రాష్ట్ర రాజధాని గువాహటిలో పోలీసుల కాల్పుల్లో ముగ్గురు నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి గాయాలయ్యాయి. విద్యాసంస్థలు, ఆఫీసులు మూతబడ్డాయి. సీఏబీకి వ్యతిరేకంగా బుధవారమే ఆందోళనలు ఉధృతమయ్యాయి. దీంతో అప్రమత్తమైన అసోం పోలీసులు పలు జిల్లాల్లో బుధవారం సాయంత్రంనుంచి కర్ఫ్యూ విధించారు. కర్ఫ్యూ అమల్లో ఉన్నప్పటికీ గురువారం ఉదయంనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. సీఏబీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యంగా గువాహటి పట్టణంలో ఆగ్రహజ్వాలలు మిన్నంటాయి.. అసోం డీజీపీ భాస్కర్‌జ్యోతి మహంత కాన్వాయ్‌పై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. గువాహటి-షిల్లాంగ్ రహదారి యుద్ధభూమిని తలపించింది. ఇక్కడ ఆందోళనకారులు పలు దుకాణాలను, వాహనాలను తగులబెట్టారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లో కాల్పులు జరిపారు. గువాహటిలోని అసోం గణపరిషత్ పార్టీ కార్యాలయాన్ని ఆందోళనకారులు ధ్వంసం చేశారు. పట్టణంలో సైన్యం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల బీజేపీ, ఏజీపీ కార్యాలయాలపై దాడులు చేశారు. పట్టణంలోని లతషిల్ మైదానంలో విద్యార్థి సంఘాలు తలపెట్టిన బహిరంగ సభకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రధాని మోదీ, సీఎం సోనోవాల్ తమను మోసం చేశారంటూ విద్యార్థి సంఘ నేతలు ఆరోపించారు. దిబ్రూగఢ్ జిల్లాలోని చబువా పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే వినోద్ హజారికా ఇంటికి నిరసనకారులు నిప్పుపెట్టారు. బయట నిలిపి ఉంచిన వాహనాలను కూడా తగులబెట్టారు. కామరూప్ జిల్లాలో అన్ని కార్యాలయాలూ మూతబడ్డాయి. పలువురు ఆందోళనకారులు టైర్లకు నిప్పంటించి రోడ్లపై పడవేశారు. ఇదే జిల్లాలోని రంగియా పట్టణంలో ఆందోళనకారులు తమపైకి రాళ్లు రువ్వడంతో గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపామని పోలీసులు చెప్పారు. రాత్రిపూట విధ్వంసాన్ని నిలువరించేందుకు సాయంత్రం ఆరు గంటలనుంచి ఉదయం ఆరుగంటల వరకు కర్ఫ్యూ విధించారు.



### ఇంటర్నెట్ నిషేధం పొడిగింపు

అసోంలోని పది జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు, ఎస్సెమ్మెస్ సేవలపై నిషేధాన్ని పొడిగించారు. మరో 48గంటలపాటు నిషేధం కొనసాగుతుందని ఉన్నతాధికారులు గురువారం వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వదంతులు వ్యాప్తి చెందకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

**పలు విమాన సర్వీసులు రద్దు:** అసోంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అసోంకు పలు విమాన సర్వీసులను రద్దు చేశారు. గువాహటి, దిబ్రూగఢ్, జోర్హాత్‌కు వెళ్లాల్సిన ఇండిగో, స్పైస్‌జెట్, విస్తారా వంటి పలు విమానయాన సర్వీసులను నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. కాగా దిబ్రూగఢ్ విమానాశ్రయంలో చిక్కుపడిపోయి న ప్రయాణికులను దశలవారీగా వారి గమ్యస్థానాలకు చేరుస్తామని వివరించారు. కర్ఫ్యూ నేపథ్యంలో గువాహటి విమానాశ్రయంలో వందలాది మంది ప్రయాణికులు చిక్కుకున్నారు. ఈశాన్య సరిహద్దు రైల్వే కూడా పలు రైళ్లను నిలిపివేసింది. మరోవైపు త్రిపురలోనూ సాధారణ జనజీవనం స్తంభించింది.

### 19న దేశవ్యాప్తంగా లెఫ్ట్ నిరసన

పౌరసత్వ సవరణ బిల్లు (క్యాబ్)పై విపక్షాలు విమర్శల దాడిని తీవ్రం చేశాయి. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రియాంకా గాంధీ, గులాంనబీ ఆజాద్, మనీశ్ తివారీ విమర్శించారు. 'థాంక్ గాడ్... అమిత్ షా సుప్రీం కోర్టు జడ్జి కాలేదు' అని కపిల్ సిబ్బల్ వ్యాఖ్యానించారు. క్యాబ్‌పై ఈ నెల 19న దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని వామపక్షాలు ప్రకటించాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి అసోంలో నివసిస్తున్న వలసదారుల్లో హిందువులకు పౌరసత్వంఇస్తారు కానీ ముస్లింలను మినహాయిస్తున్నారని సీపీఎం తప్పుపట్టింది.



## హింసను ప్రేరేపించే ప్రసారాలొద్దు: కేంద్రం

పౌరసత్వ సవరణ బిల్లుతో ఈశాన్య భారతంలో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడుతున్న నేపథ్యంలో సంయమనం పాటించాలంటూ పలు టీవీ చానళ్లకు కేంద్ర సమాచార శాఖ ఆదేశాలిచ్చింది. హింసను ప్రేరేపించే అంశాలను, జాతి వ్యతిరేక అంశాలను ప్రసారం చేయొద్దని సూచించింది. అన్ని టీవీ చానళ్లూ తమ సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపింది.

## వలసదారులపై మూకదాడులు



"నేనెవరో నీకు తెలుసా? మేం అసోంను 600 ఏళ్లపాటు పాలించిన అహోంలం. అందరూ వినండి. ఎవరైనా అసోం రాదల్చుకుంటే ముందు మా భాష నేర్చుకోండి. మీకు అర్థమవుతోందా? కావట్లేదు కదూ..! ఎలా అర్థమవుతుంది. మీరు దయ్యాల భూమి నుంచి ఇక్కడికి.. అసోంకు మూత్రవిసర్జన చేయడానికి వచ్చారు. మీరెక్కడి నుంచి వచ్చారో అక్కడికే తిరిగి వెళ్లిపోండి. వెళ్లకపోతే మేమే మీ కాళ్లు, చేతులు విరగ్గొట్టి వెనక్కి పంపిస్తాం." సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక వీడియోలో.. బిహారీ కార్మికులను ఉద్దేశించి ఒక అసామీ మహిళ చేసిన వ్యాఖ్యలివి. మతంతో సంబంధం లేకుండా.. తమ రాష్ట్రానికి వలస వచ్చినవారిపై స్థానికులు తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్నారు.



## నేను మీ సేవకుణ్ని

- **మీ సంస్కృతి చెక్కు చెదరదు.. నమ్మండి**
- **ఈశాన్య ప్రయోజనాలు కాపాడతాం**
- **జార్ఖండ్ ఎన్నికల ర్యాలీలో మోదీ హామీ**

డిసెంబరు 12: పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదంతో ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు భగ్గుమనడంతో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా రంగంలోకి దిగారు. ఈశాన్య రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాల్ని కాపాడతామని, వారి భాష, అస్తిత్వం చెక్కుచెదరకుండా చూస్తామని, వారి ప్రయోజనాలు కాపాడతామని హామీ ఇచ్చారు. 'ఈశాన్యంలోని ప్రతీ రాష్ట్రం, ప్రతీ గిరిజన సమాజం, తూర్పు భారతాన అసోం సహా ప్రతీ రాష్ట్ర ప్రజానీకానికి నేను ఇస్తున్న హామీ ఒకటే. ఈ సేవకుడిపై విశ్వాసం ఉంచండి. నరేంద్ర మోదీని నమ్మండి. తరతరాల మీ సంస్కృతి పరిరక్షణే మా ప్రథమ ప్రాధాన్యం. మీ జీవన విధానానికి ఎలాంటి దెబ్బా తగలదు. అసోంలోని నా అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములందరికీ చెబుతున్నా.. కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోంది, నమ్మకండి. ఈ దేశ పౌరులెవ్వరిపైనా ఈ కొత్త చట్ట ప్రభావం ఉండదు. అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు దాడులు చేసినపుడు అక్కడి క్రైస్తవులు ప్రాణాలరచేత పట్టుకుని భారత్ వచ్చారు. ఆనాడు కాంగ్రెస్ వారిని కాపాడలేదు. మేం అలాంటి వారికి పౌరసత్వం ఇచ్చి గౌరవంగా బతికే అవకాశం ఇస్తున్నాం. అణచివేత, దోపిడీలకు గురైన గిరిజన, దళిత, క్రైస్తవ, సిక్కు కుటుంబాల వారిని ఈ చట్టం ద్వారా ఆదుకోవాలని మేం ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ అడ్డుకొంటోంది. వారు అన్నింటినీ నానుస్తారు.. జార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటును కూడా ఐదుదశాబ్దాల పాటు నానబెట్టారు. వాజ్‌పేయి వస్తేనే గానీ ఇది రూపుదాల్చలేదు" అని మోదీ పేర్కొన్నారు.

## మోదీ ఎజెండాతో భారీ రక్తపాతం: ఇమ్రాన్

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ, డిసెంబరు 12: భారత్‌లో పౌరసత్వ సవరణ బిల్లు ఆమోదాన్ని పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తప్పుబట్టారు. ప్రధాని మోదీ ఓ పద్ధతి ప్రకారం హిందూ ఆధిపత్య ఎజెండాను అమలు చేస్తున్నారని గురువారం వరుస ట్వీట్లలో ఆరోపించారు. ఈ ఎజెండాతో పాటు పాక్‌కు అణు బెదిరింపుల వల్ల భారీఎత్తున రక్తపాతం జరుగుతుందని.. చెప్పలేనన్ని దుష్పరిణామాలు సంభవిస్తాయని.. పరిస్థితి చేయిజారకముందే ప్రపంచమంతా అడ్డుకోవాలని పిలుపిచ్చారు. దీనిపై భారత్ మండిపడింది.

## హిందువులకు ఉన్నది భారత్ ఒక్కటే: విశ్వేశ తీర్థ

ఇండోర్/బెంగళూరు(ఆంధ్రజ్యోతి ప్రతినిధి), డిసెంబరు 12: పౌరసత్వ బిల్లును మతకోణంలో కాకుండా మానవతాదృష్టితో చూడాలని పెజావర పీఠాధిపతి విశ్వేశతీర్థ స్వామీజీ అన్నారు. ఉడిపిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో వేధింపులకు గురవుతున్న హిందువులు ఎక్కడికి వెళ్లాలి? అక్కడ చోటు లేక? ఇక్కడ ఉండలేక ఇబ్బందులు పడాలా? అని ప్రశ్నించారు. ముస్లింలకు ఎన్నో దేశాలున్నాయని, హిందువులకున్నది భారత దేశం ఒక్కటేనన్నారు. ఆందోళనలపై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ బిల్లు వల్ల దేశంలోని, విదేశాల్లోని ముస్లింలకు కూడా ఇబ్బంది ఉండదన్నారు.

# బెజవాడకు 'స్క్రబ్' వణుకు

- **ఎక్కువవుతున్న స్క్రబ్ టైఫస్ కేసులు**
- **నెలలో వందకు పైగా కేసులు నమోదు**
- **డెంగీ, మలేరియా తరహా లక్షణాలు**
- **గుర్తించి సరైన చికిత్స అందించకపోతే ప్రాణానికే ప్రమాదమంటున్న వైద్యులు**

(విజయవాడ, ఆంధ్రజ్యోతి)

విజయవాడకు చెందిన 19 ఏళ్ల యువకుడు తీవ్రమైన చలి జ్వరం, తలనొప్పి, ఒళ్లు, కండరాల నొప్పులతో బాధపడుతూ ఆర్‌ఎంపీ డాక్టరు దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఇచ్చిన మందులతో జ్వరం తగ్గకపోగా.. మరింత ఎక్కువై పరిస్థితి ప్రమాదకరంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వ్యాధి లక్షణాలను బట్టి డెంగీగా భావించిన వైద్యులు వెంటనే చికిత్స ప్రారంభించారు. కానీ.. పరిస్థితి ప్రాణాంతకంగా మారడంతో కొన్ని చికిత్సలు చేయిస్తే.. అతనికి సోకింది డెంగీ కాదు.. మలేరియా కాదు.. వైద్యుల ప్రాధాన్య క్రమంలో ఉన్న 30 రకాల విష జ్వరాల్లో ఏదీ కాదని తేలింది. అది 'స్క్రబ్ టైఫస్' అనే ప్రమాదకరమైన వ్యాధి అని వైద్యులు నిర్ధారించారు. చికిత్స చేసి ఆ యువకుడి ప్రాణాలు కాపాడారు. గతంలో కేరళలో నిపా వైరస్ బయటపడడంతో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు వణికిపోయారు. ఇప్పుడు 'స్క్రబ్ టైఫస్' అనే ప్రమాదకర బ్యాక్టీరియా బెజవాడను బెంబేలెత్తిస్తోంది. విజయవాడ నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉండటంతో ఇప్పటికే డెంగీ, మలేరియా తదితర విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. తాజాగా దాదాపు అవే లక్షణాలతో కూడిన 'స్క్రబ్ టైఫస్' అనే ప్రాణాంతక వ్యాధి ఇక్కడ ఎక్కువగా కనిపిస్తోంది. జ్వరాలతో ఆస్పత్రులకు వెళ్తున్న వారిలో 'స్క్రబ్ టైఫస్'గా తేలుతున్న వారు వందల సంఖ్యలో ఉండటం వైద్యులను సైతం కలవరపాటుకు గురిచేస్తోంది. ఈ వ్యాధి బారిన పడి బాధితులకు సకాలంలో సరైన చికిత్స అందకపోతే మరణించే అవకాశం 10 నుంచి 60 శాతం ఉన్నట్టు వైద్యులు చెప్పడం వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది.

### స్క్రబ్ టైఫస్ అంటే...?

స్క్రబ్ టైఫస్ వ్యాధి ఓరియెంటియా సుత్సుగముషి అనే బ్యాక్టీరియా వల్ల సంక్రమిస్తుంది. స్క్రబ్ టైఫస్ సోకిన లార్వా పురుగులు (చిగ్గర్స్) కుట్టడం ద్వారా ఈ బ్యాక్టీరియా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీన్ని 'బుష్ టైఫస్' అని కూడా పిలుస్తారు. దీని బారినపడి వారికి తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దర్లు వంటి లక్షణాలు కనిపిస్తాయి. విజయవాడలో ఈ బ్యాక్టీరియా వేగంగా విస్తరిస్తున్నట్టు వైద్యనిపుణులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'స్క్రబ్ టైఫస్' లక్షణాలు, రోగనిర్ధారణ, చికిత్స, నివారణ పద్ధతులపై అవగాహన పెంచుకోవడం అవసరమని చెబుతున్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధిని నివారించడానికి ఎలాంటి వ్యాక్సిన్ అందుబాటులో లేదని, వ్యాధి వ్యాప్తికి కారకాలైన పురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదం నుంచి బయటపడవచ్చని చెబుతున్నారు. ఇంటి పరిసరాల్లో పురుగులు, కీటకాలకు ఆవాసంగా ఉండేలా మొక్కలు, పొదలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. చిన్నపిల్లల శరీరం, చేతులు, కాళ్లు మొత్తం కప్పి ఉంచేలా దుస్తులు వేయాలని సూచిస్తున్నారు.

### అశ్రద్ధ చేస్తే ప్రాణానికే ప్రమాదం

'స్క్రబ్ టైఫస్' బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ జ్వరాల లక్షణాలు.. ఈ వ్యాధి లక్షణాలు దాదాపు ఒకేరకంగా ఉంటాయి. దాంతో చాలామంది నిర్లక్ష్యం చేస్తున్నారు. అది సరైన విధానం కాదు. ఏ జ్వరమైనా సరే రెండు రోజుల్లో తగ్గకపోతే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే 98 శాతం వరకు ప్రాణహాని లేకుండా చేయవచ్చు.

*- డాక్టర్ జె.పూర్ణచంద్రరావు, జనరల్ ఫిజీషియన్, విజయవాడ*

## సుప్రీం సంచలన ఆదేశం

## దిశా నిందితుల ఎన్‌కౌంటర్‌పై త్రిసభ్య కమిషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దిశ హత్యాచారం కేసు నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితులతో పాటు ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపైనా విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వీఎస్ సిర్పుర్కర్ నేతృత్వంలో తిసభ్య కమిషన్‌ను నియమించింది. బాంబే హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రేఖా ప్రకాశ్ సోండుర్ బల్డోటా, సీబీఐ మాజీ డైరెక్టర్ డీఆర్ కార్తికేయన్ ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉంటారని ప్రకటించింది. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఎన్‌కౌంటర్ విషయంలో స్వతంత్ర దర్యాప్తు అనవసరమని తెలంగాణ ప్రభుత్వం విముఖత వ్యక్తం చేసినా కోర్టు అందుకు తిరస్కరించింది.

ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తు చేయించాలని న్యాయవాదులు జీఎస్ మణి, ప్రదీప్ కుమార్ యాదవ్ వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఆదేశాలిచ్చింది. వీరితో పాటు మరో ఇద్దరు లాయర్లు- ముకేష్ కుమార్ శర్మ, మనోహర్ లాల్ శర్మ కూడా వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌ఏ బోబ్డే, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, జస్టిస్ సంజీవ్ ఖన్నాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ కొనసాగించింది. ఇరు వర్గాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ విచారణ ప్రారంభించే మొదటి రోజు నుంచి ఆరు నెలల్లో నివేదిక అందించాలని, మొదటి విచారణ తేదీని కమిషన్ ఖరారు చేసుకోవాలని స్పష్టం చేసింది. తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చే దాకా శవాలను భద్రపరిచే విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమల్లో ఉంటాయని కూడా బెంచ్ తెలిపింది. ఈ కమిషన్‌కు సీనియర్ న్యాయవాది పరమేశ్వరన్ న్యాయ సలహాదారుగా ఉంటారని పేర్కొంది. ఈ కమిషన్‌కు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ చట్టంలో పేర్కొన్న అధికారాలు వర్తిస్తాయని అంటూ హైదరాబాద్ కేంద్రంగా కమిషన్ పనిచేయాలని సూచించింది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ ఈ కమిషన్ మినహా ఏ కోర్టు, లేదా ఇతర సంస్థ హైదరాబాద్ ఎన్‌కౌంటర్ ఘటనపై విచారణ చేపట్టరాదని కూడా ఆదేశించింది.

### లేని నిందితులపై విచారణా?

కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని కీలక వ్యాఖ్యలు చేసింది. పీయూసీఎల్ కేసులో సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను పాటించామని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. మృతిచెందిన నిందితులపై హత్యా యత్నం సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి పోలీసు కమిషనర్ హోదా గల ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటు చేశారని వివరించారు. ఈ వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ... "మరణించిన నిందితులపై విచారణ జరుగుతోందని చెబుతూ మీరు దర్యాప్తు వద్దనే ప్రయత్నం చేస్తున్నారు. మీరు అక్కడ జరిపే విచారణలో ప్రాసిక్యూషన్ సాక్ష్యులు ఉండరు. అసలు విచారణే ఉండదు. అసలది విచారణే కాదు. ఇప్పుడు నిందితులు లేరు. కాబట్టి దోషులుగా తేలేవారు, శిక్ష అనుభవించేవారు ఎవరూ ఉండరు. తీర్పులు ఉండవు. మీరు ఏమీ చెయ్యలేదని ఎవరు వచ్చి చెప్పగలరు? ఎవరి సాక్ష్యం ఆధారమవుతుంది? కాబట్టి ఇదంతా మీ ప్రతివాదం కోసమే!.. ...మీరు చేసే విచారణ అపహాస్యం అవుతుంది." అని సీజే బోబ్డే వ్యాఖ్యానించారు. ప్రజలకు నిజాలు తెలియాలని, మీరు చెప్పినవే నిజాలని ఊహించుకోలేమని స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్‌కు సంబంధించిన నిజానిజాలు తెలియకముందే ఈ దశలో ఎవరు దోషులో చెప్పలేమని ధర్మాసనం అభిప్రాయపడింది. అందుకే ఘటనపై దర్యాప్తు చేయించాలని భావిస్తున్నామని పేర్కొంది. ఈ విషయంలో నిజాయితీగా ఉండాలని ముకుల్ రోహత్గీకి సూచించింది.

బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ ఫైనల్స్
ఉ.8.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్ 1, 3లో

ఆస్ట్రేలియా x న్యూజిలాండ్
తొలి టెస్ట్ - రెండో రోజు
ఉ.10.30 నుంచి
సోనీ సిక్స్‌లో

పాకిస్థాన్ x శ్రీలంక
తొలి టెస్ట్ - మూడో రోజు
ఉ.10.15 నుంచి
సోనీ- ఈఎస్‌పీఎన్

## దుమ్ము రేపిన షెఫాలి, వేద


షెఫాలి వర్మ


వేద కృష్ణమూర్తి

ఆస్ట్రేలియా 'ఎ'పై ఇండియా 'ఎ' గెలుపు

**బ్రిస్బేన్:** టీనేజ్ సంచలనం షెఫాలి వర్మ మెరుపు సెంచరీతో దుమ్ము రేపింది. ఆమెకు కెప్టెన్ వేద కృష్ణమూర్తి తోడవడంతో ఆస్ట్రేలియా 'ఎ'తో గురువారం జరిగిన అనధికార వన్డేలో ఇండియా 'ఎ' 16 పరుగులతో గెలుపొందింది. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 'ఎ' 50 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగుల భారీ స్కోరు చేసింది. షెఫాలి (78 బంతుల్లో 19 ఫోర్లు, 4 సిక్సర్లతో 124), వేద కృష్ణమూర్తి (99 బంతుల్లో 16 ఫోర్లు, సిక్స్‌తో 113) బౌండరీల వర్షం కురిపించి మూడో వికెట్‌కు 119 పరుగులు జోడించారు. దాంతో ఇండియా 'ఎ' స్కోరు మూడొందలు దాటింది. అనంతరం ఆస్ట్రేలియా 'ఎ' 50 ఓవర్లలో 9 వికెట్లకు 296 పరుగులు చేసింది. కెప్టెన్ తహ్లియా మెక్‌గ్రాత్ (90 బంతుల్లో 16 ఫోర్లతో 97) సెంచరీ మిస్సయింది. అనాబెల్ సదర్లాండ్ (52 బంతుల్లో 6 ఫోర్లతో 52) హాఫ్ సెంచరీ చేయగా..చివర్లో మోలీ స్ట్రానో (28 బంతుల్లో 3 ఫోర్లతో 32 నాటౌట్), వకరేవా (16 బంతుల్లో ఫోర్‌తో 18 నాటౌట్) ధాటిగా ఆడినా జట్టును విజయ తీరాలకు చేర్చలేకపోయారు. లెగ్‌స్పిన్నర్ దేవికా వైద్య (4/55) నాలుగు, ఆఫ్ స్పిన్నర్ హేమలత (2/31) రెండు వికెట్లు పడగొట్టారు. ఈ పర్యటనలో భాగంగా మూడు వన్డేలు, మూడు టీ20లు ఇండియా 'ఎ' ఆడనుంది. రెండో వన్డే శనివారం జరగనుంది.

**సంక్షిప్తస్కోరు: ఇండియా 'ఎ' 50 ఓవర్లలో 312/9** (షెఫాలి వర్మ 124, వేద కృష్ణమూర్తి 113, మెక్‌గ్రాత్ 3/48, వకరేవా 2/50, గ్రాహం 2/55)

**ఆస్ట్రేలియా 'ఎ' 50 ఓవర్లలో 296/9** (మెక్‌గ్రాత్ 97, సదర్లాండ్ 52, మోలీ స్ట్రానో 32 నాటౌట్, దేవికా వైద్య 4/55, హేమలత 2/31).



## బాలీవుడ్ భామ ఊర్వశితో పంత్ డేటింగ్?

**ముంబై:** రిషభ్ పంత్..పరిమిత ఓవర్లలో టీమిండియా వికెట్ కీపర్ అయిన అతడి పేరు కొంతకాలంగా దేశ క్రికెట్‌లో పెద్దఎత్తున చర్చనీయాంశమైంది. ధోనీ వారసుడిగా ప్రశంసలందుకుంటున్న 22 ఏళ్ల పంత్..చెత్త బ్యాటింగ్ అంతకంటే ఘోరమైన కీపింగ్‌తో సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ అండదండలు దండిగా ఉండడంతో..బ్యాటింగ్, కీపింగ్‌లో విఫలమవుతున్నా జట్టులో చోటు నిలబెట్టుకోగలుగుతున్నాడు. కానీ ఈ యంగ్ బ్యాట్స్‌మన్ బ్యాటింగ్, కీపింగ్‌ను మెరుగుపరుచుకోవడంలో కాకుండా...తన 'ప్రతిభ'ను వేరే రీతిలో చూపిస్తున్నట్టు కనిపిస్తోంది. వెస్టిండీస్‌తో మూడో టీ20కి ముందురోజు రాత్రి..అంటే మంగళవారంనాడు బాలీవుడ్ భామ ఊర్వశీ రౌతేలాతో ముంబైలోని ఓ ఖరీదైన హోటల్‌లో డిన్నర్ చేస్తూ కనిపించడం చర్చనీయాంశమైంది. దాంతో ఊర్వశితో అతడు డేటింగ్ చేస్తున్నట్టు అంతా చెవులు కొరుక్కుంటున్నారు. రెండో టీ20లో పర్లేదనిపించిన రిషభ్..ఆఖరి మ్యాచ్‌లో వన్‌డౌన్‌లో వచ్చి డకౌటయ్యాడు. రౌతేలాతో డిన్నర్ మధురానుభూతులనుంచి బయటపడకపోవడమే వైఫల్యానికి కారణమని నెటిజన్లు పంత్‌ను ఎద్దేవా చేస్తున్నారు. మరికొందరేమో..ప్రస్తుతం కష్టాల్లో ఉన్న పంత్‌కు ఊర్వశి 'జోయా ఫ్యాక్టర్' అవుతుందని ఆటపట్టిస్తున్నారు. ఇక..ఊర్వశి గతంలో టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాతో డేటింగ్ చేసినట్టు వార్తలొచ్చాయి.



## మా 'దయ' వల్లే నీకా పదవి!

- బీసీసీఐలో మార్పులు సరికావు
- గంగూలీపై జస్టిస్ ఆర్‌ఎం లోధా విమర్శ



**ముంబై:** బీసీసీఐ నూతన రాజ్యాంగాన్ని సవరించే ప్రయత్నాలపై జస్టిస్ ఆర్‌ఎం లోధా అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము ప్రతిపాదించిన సంస్కరణల కారణంగానే సౌరవ్ గంగూలీ అధ్యక్షుడు కాగలిగాడని గుర్తు చేశారు. ఈ నెల ఒకటిన జరిగిన బోర్డు ఏజీఎంలో మూడేళ్ల కూలింగ్ ఆఫ్ పీరియడ్‌ను ఎత్తేయడం, పరస్పర విరుద్ధ ప్రయోజనాల నిబంధనను నీరుగార్చడం, అధికారాలు సీఈవోకు కాకుండా తిరిగి కార్యదర్శికే కట్టబెట్టేందుకు సభ్యులు ప్రతిపాదించారు. లోధా కమిటీ సిఫారసుల ప్రకారం..ఆరేళ్లపాటు ఆఫీస్ బేరర్‌గా పనిచేస్తే మూడేళ్లు పదవికి దూరంగా ఉండాలి. ఇది రెండుసార్లు క్యాబ్ చీఫ్‌గా ఎంపికైన సౌరవ్ గంగూలీకి అడ్డుగా మారింది. కానీ తాజా మార్పులతో కొత్త అధ్యక్షుడు గంగూలీ మరో మూడేళ్లపాటు పదవిలో కొనసాగేందుకు వీలవుతుంది. అయితే గంగూలీ బృందం చేస్తున్న ఈ మార్పులు దురదృష్టకరమని బోర్డు సంస్కరణలకు ఆద్యుడైన లోధా వ్యాఖ్యానించారు. 'నిజంగా బోర్డులో జరుగుతున్న పరిణామాలు శోచనీయం. అసలు మా సంస్కరణల కారణంగానే గంగూలీకి అత్యున్నత పదవి వచ్చిందనే విషయం తెలుసుకోవాలి. పాత పద్దతే కొనసాగి ఉంటే బీసీసీఐలో ఉండే రాజకీయాల కారణంగా ఓ క్రికెటర్ అత్యున్నత పదవికి ఎంపికయ్యేవాడా? కానీ మా ప్రతిపాదనల వల్ల అలాంటి పరిస్థితులన్నీ మారాయి. అందుకే ప్రస్తుత రాజ్యాంగాన్ని మార్చడం కాకుండా పూర్తిగా అమలయ్యేలా చూడాలి. కనీసం కొంతకాలంపాటైనా వేచి చూస్తే పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కనిపిస్తుంది' అని లోధా అన్నారు. అలాగే బీసీసీఐ మాజీ సభ్యుల బంధువులను ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవడం అసాధ్యమని తెలిపారు. ఓ భారత పౌరుడిగా ఎన్నికల్లో పాల్గొనే న్యాయమైన హక్కు అందరికీ ఉంటుందని స్పష్టం చేశారు. అయితే కొంత వ్యవధిలోనే బోర్డులో మెరుగైన మార్పు కనిపిస్తుందని, ఇందుకు మరో రెండు.. మూడు బోర్డు ఎన్నికల సమయం పట్టవచ్చని ఆయన అభిప్రాయపడుతున్నారు. ఎవరికీ సంబంధంలేని స్వతంత్ర అభ్యర్థులను బోర్డులోకి ఆహ్వానించి వారి పనితీరును గమనించాలని సూచించారు. అలాగే 33 నెలలపాటు పరిపాలన చేసిన క్రికెట్ పాలక కమిటీ (సీఓఏ)పై కూడా ఆయన స్పందించారు. 'వాస్తవానికి బోర్డులో నూతన సంస్కరణలను వేగంగా అమలు చేయడంలో సీఓఏ విఫలమైంది. ఇందుకు కమిటీ సభ్యులు మూడేళ్ల సమయం తీసుకున్నారు. అన్నీ అనుకున్నట్టు జరిగితే అసలిప్పుడు బోర్డుకు రెండోసారి ఎన్నికలు జరగాలి. ఎందుకంటే 2016, జూలైలోనే సుప్రీం కోర్టు తొలి తీర్పు ఖరారైంది' అని జస్టిస్ లోధా గుర్తుచేశారు.

## పాక్-లంక టెస్టుకు వర్షం అడ్డు

**రావల్పిండి:** శ్రీలంక-పాకిస్థాన్ తొలి టెస్ట్ రెండోరోజు ఆటలో వరుణుడిదే పైచేయి అయింది. భారీ వర్షం, వెలుతురు మందగించడంతో గురువారం కేవలం 82 నిమిషాల (18.2 ఓవర్లు) ఆటే సాధ్యమైంది. ఓవర్‌నైట్ స్కోరు 202/5తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక ఆట నిలిపివేసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ధనంజయ డిసిల్వా 72 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నాడు. నిరోషన్ డిక్‌వెలా 33 పరుగులకు అవుటయ్యాడు.



'హవ్వ..అమ్మాయివి అయ్యుండి క్రికెట్ ఆడతావా..అది మగ పిల్లలు ఆడే ఆట..' ఇది క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని తలచినప్పుడు ఆమెకు ఎదురైన అనుభవం. చండీగఢ్‌లోని ఓ క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసినప్పుడు కూడా ఆమెకు దాదాపు అలాంటి పరిస్థితే ఎదురైంది.. అయితే.. మొహాలీ అమ్మాయి అమన్‌జోత్ కౌర్ వాటినేమాత్రం పట్టించుకోలేదు. పైగా ఆ వ్యాఖ్యలు ఆమెలో మరింత పట్టుదలను పెంచాయి. అహరహరం శ్రమించి జాతీయస్థాయి క్రికెటర్‌గా ఎదిగేలా చేశాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

## అవమానాలే సోపానాలుగా..

### క్రికెటర్‌గా ఎదిగిన కార్పెంటర్ కూతురు

### ఇండియా-ఎ జట్టులో చోటు

**మొ**హాలీకి చెందిన భూపిందర్ సింగ్ కార్పెంటర్. అతడి కూతురు అమన్‌జోత్ కౌర్‌కు క్రికెటర్ అవ్వాలన్నది ఆశయం. కానీ ఆ ఆట మగవాళ్లు ఆడేదని, అందులో ఎలా నెగ్గుకు వస్తావంటూ.. ఆ ఆలోచన విరమించుకోవాలని బంధువులు, ఇంటి చుట్టుపక్కలవారు ఆమెను నిరాశ పరిచారు. కానీ క్రికెటర్ కావడమే లక్ష్యంగా పెట్టుకున్న అమన్‌జోత్‌ను ఆ మాటలు నిరుత్సాహపరచలేదు. పైపెచ్చు మరింత కసిని పెంచాయి. వారి అంచనాలు తప్పని నిరూపించాలని కూడా ఆమె నిర్ణయించుకుంది. తండ్రి భూపిందర్ అమన్‌కు పూర్తి మద్దతుగా నిలిచాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక పోయినా.. కూతురు లక్ష్యాన్ని చేరుకొనేందుకు తాను చేయాల్సిందంతా చేశాడు.

**కోచ్‌కోసం ఇక్కట్లు..**

మొహాలీలో సరైన కోచ్ లేక కౌర్ ఇబ్బందులు పడింది. దీంతో తమ నివాసాన్ని చండీగఢ్‌కు మార్చింది. తొలుత సెక్టర్ 26 క్రికెట్ కోచింగ్ సెంటర్‌లో ప్రవేశానికి ప్రయత్నిస్తే 'నీవు క్రికెట్ ఆడతావా' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి అవునని ఆమె గట్టిగా సమాధానం ఇచ్చింది. దాంతో మరో ఏడాది వరకూ ఆగాలని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బదులిచ్చారు. ఏడాది వరకు వేచిచూసేకన్నా.. మరో కోచింగ్ సెంటర్‌కు వెళ్లడం ఉత్తమమని నిర్ణయించుకున్న అమన్‌జోత్ సెక్టర్ 32లోని గవర్నమెంట్ మోడల్ సీనియర్ సెకండరీ స్కూల్ కోచింగ్ సెంటర్‌లో చేరింది. అక్కడ బీసీసీఐ లెవెల్-2 హోదా కలిగిన కోచ్ నగేశ్ గుప్తా.. కౌర్ పట్టుదల, క్రమశిక్షణకు ముగ్ధుడై ఆమెను మంచి క్రికెటర్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేశాడు. చండీగఢ్‌లో చలికాలం ఎముకలు గడ్డకట్టే చలి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లోనూ ఉదయం 5.30 కల్లా కచ్చితంగా గ్రౌండ్‌కు రావడం క్రికెట్ పట్ల అమన్‌జోత్ అంకితభావాన్ని తెలియజేస్తుంది. గుప్తా శిక్షణలో మూడున్నరేళ్లలోనే చక్కటి ఆల్‌రౌండర్‌గా ఎదిగిన ఆమె.. 2018-19లో బీసీసీఐ అండర్-19 ఉమెన్స్ క్రికెట్ లీగ్‌లో పంజాబ్‌కు ప్రాతినిధ్యం వహించింది. చత్తీస్‌గఢ్‌తో పోరులో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. అలాగే గతేడాది గుంటూరులో జరిగిన ఉమెన్స్ అండర్-19 టీ20 చాలెంజర్ ట్రోఫీలో ఇండియా గ్రీన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఇక ఇటీవలి అండర్-23 టీ20 ట్రోఫీలో చండీగఢ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించింది. అద్భుత బ్యాటింగ్‌తో ఏడు మ్యాచ్‌ల్లో 184 రన్స్ చేయడంతోపాటు 10 వికెట్లు తీసి సెలెక్టర్ల దృష్టిలో పడింది. దాంతో బీసీసీఐ ఉమెన్స్ అండర్-23 టీ20 చాలెంజర్ ట్రోఫీలో తలపడే భారత-ఎ జట్టుకు ఆమె ఎంపికైంది. ఈ టోర్నీ ప్రస్తుతం పుదుచ్చేరిలో జరుగుతోంది. 'భారత-ఎ జట్టుకు ఎంపికైన విషయం తెలిసి ఎంతో ఉద్వేగ్నతకు లోనయ్యా. టీమిండియాలో ప్రవేశానికి ఇది ఓ అవకాశం' అని 19 ఏళ్ల కౌర్ తెలిపింది. కుడిచేతి వాటం బ్యాట్స్‌ఉమన్, మీడియం పేస్ బౌలర్ అయిన కౌర్‌కు టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫేవరెట్ క్రికెటర్.

## సింధు ఆశలు గల్లంతు


చెన్ యుఫీ


పీవీ సింధు

- వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓటమి
- వరల్డ్ టూర్ ఫైనల్స్

**గ్వాంగ్‌ఝౌ (చైనా):** వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంప్, భారత స్టార్ షట్లర్ పీవీ సింధు కథ ముగిసింది. గురువారం గ్రూప్-ఎలో జరిగిన తన రెండో మ్యాచ్‌లో సింధు 22-20, 16-21, 12-21తో చెన్ యుఫీ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. తొలి మ్యాచ్‌లో యమగూచితో ఓడిన తరహాలోనే ఈ మ్యాచ్‌ను కూడా చేజార్చుకుంది. గంటా 12 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో ఫస్ట్ గేమ్ నెగ్గినా.. తర్వాత ప్రత్యర్థికి తల వంచింది. తొలి గేమ్‌లో ఒక దశలో 17-20తో సింధు వెనుకబడినా.. వరుసగా 5 పాయింట్లతో గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. కానీ, రెండో గేమ్‌లో సింధుకు ఏమాత్రం అవకాశం ఇవ్వని యుఫీ 21-16తో నెగ్గి మ్యాచ్ ఫలితాన్ని ఆఖరి గేమ్‌కు తీసుకెళ్లింది. ఇక నిర్ణాయక మూడో గేమ్‌లో ఓదశలో సింధు 4-8తో వెనుకబడినా.. చక్కటి పోరాటం కనబరిచి 10-10తో స్కోరును సమం చేసి పోటీలోకొచ్చింది. ఈ దశలో వైడ్ షాట్లతో యుఫీ విజృంభించడంతో భారత షట్లర్ ఇబ్బంది పడింది. 12-12తో ఇరువురూ సమంగా ఉన్న దశలో యుఫీ వరుసగా 9 పాయింట్లతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సైతం సొంతం చేసుకుంది. దీంతో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడడంతో టోర్నీలో సింధు నాకౌట్ అవకాశాలు గల్లంతయ్యాయి. యుఫీ, యమగూచి సెమీస్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నారు. దీంతో శుక్రవారం హి బింగ్జియావోతో సింధు మ్యాచ్ నామమాత్రమే.


భరత్-రికీ

## భరత్, రికీ అజేయ శతకాలు

ఆంధ్ర-విదర్భ రంజీ మ్యాచ్ డ్రా

**విజయవాడ (స్పోర్ట్స్):** కేఎస్ భరత్ (102), రికీ భుయ్ (100) అజేయ శతకాలతో మెరవడంతో డిఫెండింగ్ చాంప్ విదర్భతో రంజీ మ్యాచ్‌ను ఆంధ్ర డ్రా చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 100/2తో నాలుగో, చివరి రోజైన గురువారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర..ఆట ముగిసే సమయానికి 314/3 స్కోరు చేసింది. రికీ, భరత్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 186 పరుగులు జోడించారు. ఓపెనర్ జ్ఞానేశ్వర్ (61) హాఫ్ సెంచరీ సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర 211 పరుగులు చేయగా.. విదర్భ 441 పరుగులకు ఆలౌటైంది. మ్యాచ్ డ్రా అయినా మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విదర్భకు 3 పాయింట్లు లభించగా.. ఆంధ్రకు ఒక్క పాయింట్ దక్కింది. కాగా, ఈ సీజన్‌ను హైదరాబాద్ పేలవంగా ఆరంభించింది. తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడింది. 239/6తో నాలుగో రోజు ఆటను ఆరంభించిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 266 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ నిర్దేశించిన 187 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 36.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ ప్రియాంక్ పాంచల్ (90) ధాటిగా ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 233 పరుగులు, గుజరాత్ 313 పరుగులు చేశాయి.


హైదరాబాద్‌లో గురువారం జరిగిన అజరుద్దీన్ కుమారుడు అసదుద్దీన్, సానియా మీర్జా సోదరి ఆనమ్ మీర్జాల వివాహ విందుకు హాజరైన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.

## 332 మంది మిగిలారు

ఐపీఎల్ వేలానికి తుది జాబితా

**ముంబై:** ఐపీఎల్ వేలం కోసం తుది ఆటగాళ్ల జాబితా ఖరారైంది. ఈనెల 19న కోల్‌కతాలో జరిగే ఈ వేలం కోసం మొత్తం 971 మంది క్రికెటర్లు అంగీకారం తెలపగా వీరి నుంచి 332 మందిని షార్ట్ లిస్ట్ చేశారు. కుదించిన జాబితాను ఇప్పటికే ఎనిమిది ఫ్రాంచైజీలకు ఐపీఎల్ మేనేజ్‌మెంట్ పంపించింది. ఇందులో 19మంది క్యాప్డ్ భారత క్రికెటర్లతో పాటు 24 మంది కొత్త ఆటగాళ్లున్నారు.



## థాయ్‌లాండ్‌లో యువీ బర్త్‌డే

**ముంబై:** టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ తన 38వ బర్త్‌డేను గురువారం గ్రాండ్‌గా జరుపుకొన్నాడు. సహచరులు సచిన్, హర్భజన్‌సింగ్, జహీర్‌ఖాన్, అజిత్ అగార్కర్‌తో కలిసి థాయ్‌లాండ్‌లో ఎంజాయ్ చేశాడు. ఈ ఫొటోలను భజ్జీ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు. 'హ్యాపీ బర్త్ డే బ్రదర్ యువీ. కలకాలం సంతోషాలతో ఉండాలి' అని హర్భజన్ అన్నాడు. సచిన్ కూడా పార్టీ ఫొటోలను షేర్ చేస్తూ 'సూపర్ స్టార్‌కు హ్యాపీ బర్త్ డే. దేవుడు నీకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థిస్తున్నా' అని రాశాడు.

## టాప్-10లో కోహ్లీ

● టీ20 ర్యాంకింగ్స్

**దుబాయ్:** అంతర్జాతీయ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ తిరిగి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. వెస్టిండీస్‌తో ముగిసిన మూడు టీ20ల సిరీస్‌లో విరాట్ 183 పరుగులు సాధించాడు. దీంతో ఐసీసీ తాజాగా వెల్లడించిన జాబితాలో ఐదు స్థానాలు ఎగబాకి పదో ర్యాంకుకు చేరాడు. అలాగే విశేషంగా రాణించిన ఓపెనర్ కేఎల్ రాహుల్ కూడా మూడు స్థానాలు మెరుగుపర్చుకుని ఆరో ర్యాంకుకు చేరాడు. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైన రోహిత్ శర్మ ఎనిమిది నుంచి తొమ్మిదో స్థానానికి పడిపోయాడు. పాక్ స్టార్ బ్యాట్స్‌మన్ బాబర్ ఆజమ్ నెంబర్‌వన్‌గా కొనసాగుతుండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఆరోన్ ఫించ్ (ఆసీస్), డేవిడ్ మలాన్ (ఇంగ్లండ్) ఉన్నారు.

## లబుషేన్ 'హ్యాట్రిక్' సెంచరీ

న్యూజిలాండ్‌తో ఆసీస్ డే/నైట్ టెస్ట్

**పెర్త్:** మార్నస్ లబుషేన్ (110 బ్యాటింగ్) హ్యాట్రిక్ సెంచరీ కారణంగా న్యూజిలాండ్‌తో డే/నైట్ టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. ఈ తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా గురువారం ఆటముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్‌లో 284/4 స్కోరు చేసింది. లబుషేన్‌తోపాటు ట్రావిస్ హెడ్ (20 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ జో బర్న్స్ (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. డేవిడ్ వార్నర్ (43), లబుషేన్ పరిస్థితిని చక్కదిద్దారు. ఆఖర్లో పుంజుకున్న న్యూజిలాండ్ స్మిత్ (43)తోపాటు మాథ్యూ వేడ్ (12)ను అవుట్ చేసింది.

# నీటి లభ్యత లేకుండా విస్తరణా?

- ఉమ్మడి జలాశయాలపై హక్కులెక్కడివీ?
- ట్రిబ్యునల్ తీర్పు అమలైతే దిగువకు నీరు కష్టమే!
- జలవనరుల నిపుణుల ఆందోళన

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాయలసీమలోని ప్రధాన ప్రాజెక్టులకు నీటిని తరలించే కాలువలను అభివృద్ధి చేస్తామని, వచ్చే నెలలోనే టెండర్లకు వెళ్తామంటూ శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. నీటి లభ్యత లేకుండా.. నీటినిల్వ సామర్థ్యం పెంచకుండా.. కాలువల ప్రవాహ సామర్థ్యం పెంచి ఉపయోగమేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. ఉమ్మడి జలాశయాలకు అనుసంధానంగా నిర్మించిన రెగ్యులేటర్లు, కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచడం సాధ్యం కాదని జల వనరుల నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జగన్ విస్తరణ ప్రాజెక్టు అమలుకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఎంఆర్‌బీ) అనుమతి కావాలని గుర్తుచేస్తున్నారు. అదీగాక పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద టెలిమెట్రీల ద్వారా నీటిలెక్కలు గణిస్తున్నా.. ఎక్కువ నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరలిస్తోందని తెలంగాణ ప్రభుత్వం ప్రతిరోజూ ఫిర్యాదు చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో విస్తరణ ప్రాజెక్టులపై టెండర్లకు వెళ్తామని సీఎం చేసిన ప్రకటన అమలుపై నిపుణులు సందేహం వెలిబుచ్చుతున్నారు.




## లేనిపోని భ్రమలు..!

కృష్ణానదిపై ఆధారపడి నిర్మించిన శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలు రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకమైన ఉమ్మడి ప్రాజెక్టులు. ఇవి రాష్ట్ర విభజన చట్టం పరిధిలో ఉన్నాయి. వీటిలో నిల్వ చేసిన జలాలు ఏ దామాషాలో వినియోగించుకోవాలో కృష్ణా బోర్డు నిర్ధారిస్తుంది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు మేరకు రెండు రాష్ట్రాలకూ నీటి కేటాయింపులు ఉంటాయి. రెండు నీటి ప్రాజెక్టుల్లో ప్రతి నీటి బొట్టుకూ లెక్క ఉంటుంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 44,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంపై తెలంగాణ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇప్పుడు దాని సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచుతామంటే అంగీకరిస్తుందా? దీనిని బోర్డు ఆమోదిస్తుందా.. ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లినా తేలుతుందా అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. కృష్ణా ట్రిబ్యునల్ తీర్పు అమల్లోకి వస్తే ఎదురయ్యే పరిణామాలపైనా.. సాంకేతిక అంశాలపైనా ఆలోచనలు చేయకుండానే జగన్ ప్రకటనలు గుప్పిస్తున్నారని ఆక్షేపిస్తున్నారు. 'సాగునీటి ప్రాజెక్టును నిర్మించాలన్నా.. కాలువలను అభివృద్ధి చేయాలన్నా 'బెనిఫిట్ రేషియో కాస్ట్' (బీఆర్‌సీ)ని లెక్కిస్తారు. ప్రాజెక్టు నిర్మిస్తే.. రైతులకు ఎంతమేర ప్రయోజనం చేకూరుతుందో లెక్కిస్తారు. రాయలసీమ ప్రాజెక్టులకు 302 టీఎంసీల కృష్ణా జలాలు అవసరం. బచావత్ ట్రిబ్యునల్ రాష్ట్రానికి 512 టీఎంసీలు కేటాయించింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ 65 శాతం డిపెండబులిటీ ఆధారంగా లెక్కలు వేసి.. కర్ణాటకకు 806, మహారాష్ట్రకు 631, ఆంధ్రప్రదేశ్‌కు 856 టీఎంసీలు కేటాయించింది. దిగువ రాష్ట్రంగా మిగులు జలాలన్నీ మన రాష్ట్రానికే దక్కేవి. కానీ మిగులు జలాలు అక్కర్లేదని నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి లేఖ రాయడంతో బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ వాటినీ విభజించింది. 2,078 టీఎంసీల మిగులు జలాల్లో 911 కర్ణాటకకు, మహారాష్ట్రకు 666, ఆంధ్రప్రదేశ్‌కు 1,001 టీఎంసీలు కేటాయించింది. అంటే 1,077 టీఎంసీలు ఆంధ్రప్రదేశ్ కోల్పోయింది. వీటి ఆధారంగా పై రెండు రాష్ట్రాలూ ప్రాజెక్టులు కడుతున్నాయి. అవి పూర్తయితే నికర జలాలకూ దిక్కుండదు. ఈ ఏడాది వచ్చినట్లుగా భారీ వరద వస్తే తప్ప దిగువకు నీరు వదలవు. ఇలాంటి సాంకేతిక అంశాలపై దృష్టి సారించకుండా.. కాలువలను విస్తరిస్తే ఒనగూరే ప్రయోజనాలేమిటని అంటున్నారు.

## రెట్టింపు సాధ్యమా?

రాయలసీమ ప్రాజెక్టులకు నీరందించే రెగ్యులేటర్ల ప్రస్తుత ప్రవాహ సామర్థ్యం 8.23 టీఎంసీలు. దీనిని మరో 7.10 టీఎంసీలకు పెంచేలా (85.645 శాతం ఎక్కువ) కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని సీఎం చెప్పారు. అయితే ప్రాజెక్టుల సామర్థ్యం పెంచకుండా.. రెట్టింపు సామర్థ్యంతో రెగ్యులేటర్లు, కాలువల అభివృద్ధి సాంకేతికంగా సాధ్యమవుతుందా అని నిపుణులు సందేహాలు లేవనెత్తుతున్నారు. రాయలసీమలో 96,077 క్యూసెక్కులు ప్రవహించే సామర్థ్యం కలిగిన కాలువలు నిర్మించారు. ఇప్పుడు జగన్ చెప్పినట్లు కొత్తగా మరో 82,900 క్యూసెక్కుల సామర్థ్యంతో వాటిని అభివృద్ధి చేసి.. జలాలను విడుదల చేస్తే.. వాటిని నిల్వ చేసేందుకు అంత సామర్థ్యం ఉన్న జలాశయాలు, చెరువులూ లేవు. రోజుకు 7 టీఎంసీలు అదనంగా పంపితే రాయలసీమ ప్రాజెక్టులూ, చెరువులు తట్టుకోగలవా.. ముంపు తలెత్తదా అని నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

## అంత సొమ్ము ఎవరిస్తారు?

రాయలసీమ ప్రాజెక్టులు, కాలువల విస్తరణకు దాదాపు రూ.30 వేల కోట్ల వ్యయమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున నిధులు సమీకరించగలరా అన్నదే ప్రశ్న. రాష్ట్ర జల వనరుల శాఖ ఇప్పటికే రూ.3,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం వ్యయం చేసిన రూ.6,700 కోట్లలో ఇంతవరకు పైసా రాలేదు. ఈ పరిస్థితుల్లో విస్తరణ ప్రాజెక్టులకు కేంద్రం నుంచి దమ్మిడీ కూడా ఆశించలేమని నిపుణులు చెబుతున్నారు.

### సాగర్ కుడి కాలువ గతేంటో?

రాయలసీమకు నీటి తరలింపునకు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన ప్రకటనపై కృష్ణా డెల్టాపై ఆధారపడ్డ రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ కింద తమకు 132 టీఎంసీలు కేటాయించినా.. పూర్తిస్థాయిలో వాటిని విడుదల చేయడం లేదని.. సాగర్‌లో నిండుగా నీరున్నా.. ప్రకాశం జిల్లాను ఎండపెడుతున్నారని.. వీటిపై సీఎం జగన్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నిస్తున్నారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలిస్తే.. కృష్ణా జలాలను సంపూర్తిగా కృష్ణా డెల్టాకు తరలిస్తామని ఎందుకు హామీ ఇవ్వడంలేదని నిలదీస్తున్నారు.

# మెట్రో ప్రాజెక్టులపై ఏపీ అనాసక్తి: కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'మెట్రో విధానం-017' ప్రకారం విజయవాడ, విశాఖపట్నంలలో మెట్రో రైలు ప్రాజెక్టులు చేపట్టేందుకు సవరించిన ప్రతిపాదనలను పంపాలని కేంద్రం కోరినా రాష్ట్ర ప్రభుత్వం పంపలేదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. గురువారం లోక్‌సభలో టీడీపీ ఎంపీ గల్లా జయదేవ్ అడిగిన ప్రశ్నకు ఈమేరకు సమాధానం చెప్పారు. విశాఖలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం క్రింద తేలికపాటి మెట్రో రైల్ ప్రాజెక్టు చేపట్టేందుకు కొరియన్ ఎక్సిమ్ బ్యాంక్ నుంచి విదేశీ ఆర్థిక సహాయం కోరుతూ ఏపీ ప్రభుత్వం ప్రతిపాదన పంపిందని, కానీ తాము ఆర్థిక సాయం అందించలేమని కొరియా వర్గాలు చెప్పాయన్నారు. దీంతో మరే ఇతర విదేశీ సంస్థల నుంచైనా రుణ సాయం కోరుతూ ప్రాజెక్టు ప్రతిపాదనలను పంపాల్సిందిగా ఏపీ ప్రభుత్వానికి సలహా ఇచ్చామని చెప్పారు.




# చైనాలో ఉంటే జగన్‌కు ఉరే!

- మన దేశంలో కాబట్టే సీఎం అయ్యారు
- ఆర్థిక నేరస్తులకు ఉరిశిక్ష అమలు చేయాలి
- ఆవిధంగా కఠిన చట్టాలు తీసుకురావాలి
- దీనిపై ప్రధాని మోదీని కలుస్తా: మందకృష్ణ



హైదరాబాద్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారికి ఉరిశిక్ష పడేలా కఠిన చట్టాలు తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. త్వరలో ప్రధాని మోదీని కలిసి దీనిపై విన్నవిస్తానన్నారు. భయంకరమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మన దేశంలో ఉండడం వల్ల సీఎం అయ్యారని, అదే చైనాలో ఉంటే ఉరితీసేవారన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో మందకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్, రెడ్డి సామాజిక వర్గం తమ చేతులకు మట్టి అంటకుండా 'దిశ' నిందితులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపించారని ఆరోపించారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలకూ కులపిచ్చి పెరిగిపోయిందన్నారు. అందుకే 'దిశ' హంతకులను ఉరితీయాలని డిమాండ్ చేశారన్నారు. అదే హాజీపూర్ నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని ఉరితీయాలని ఎందుకు డిమాండ్ చేయలేదని ప్రశ్నించారు. దేశంలో రెండేళ్లల్లో అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, 35 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

## బ్రౌన్ భాషోద్ధారకుడు.. జగన్ విధ్వంసకుడు : తులసిరెడ్డి

విజయవాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుడైన సీపీ బ్రౌన్ తెలుగు భాషోద్ధారకుడిగా పేరు పొందగా... తెలుగువాడైన సీఎం జగన్ భాషా విధ్వంసకుడిగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సీపీ బ్రౌన్ వర్ధంతి సందర్భంగా ఆయన నివాళి అర్పించారు. అనంతరం ఆయన ఒక ప్రకటన చేస్తూ... తెలుగు భాష నేర్చుకుని, తెలుగు నిఘంటువును రచించి, వేమన పద్యాలు సేకరించి తెలుగు సూరీడుగా బ్రౌన్ ప్రకాశించారని కొనియాడారు. కానీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం తెలుగు మీడియంను రద్దు చేస్తూ జీవో జారీ చేసి చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని తులసిరెడ్డి విమర్శించారు.

# ఇంకా జీతం పడలేదు!

- రెండు నెలలైనా దక్కని తొలి ఫలం
- ఇప్పుడిప్పుడే బ్యాంకు వివరాల సేకరణ
- గ్రామ సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన

అమరావతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అద్భుతం, మహత్తరం అని ప్రశంసిస్తున్న 'గ్రామ సచివాలయ' ఉద్యోగులకు ఇప్పటిదాకా జీతాలు అందలేదు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు విధుల్లో చేరి 2 నెలలు పూర్తవుతున్నా. మొదటి జీతం తీసుకోలేదు. ఒక్క గుంటూరు జిల్లాలో మాత్రం కలెక్టర్ చొరవ తీసుకుని వేరే నిధులను సర్దుబాటు చేసి సచివాలయ సిబ్బందికి జీతాలు అందజేసినట్లు సమాచారం. కొన్ని జిల్లాల్లో ఇప్పుడిప్పుడే ఉద్యోగుల బ్యాంకు వివరాలు తీసుకుని సీఎఫ్‌ఎంఎస్‌లో ఐడీ క్రియేట్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికీ తొలి వేతనం అందుకోకపోవడంపై సచివాలయ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. అయితే... జనవరి నుంచి పూర్తి స్థాయిలో జీతాలు అందుతాయని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలుస్తోంది.

## కుదురుకోని సచివాలయాలు

రాష్ట్రంలో చాలాచోట్ల గ్రామ, వార్డు సచివాలయాలు ఇంకా గాడిన పడలేదు. ఈ ఏడాది అక్టోబరు 10న అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినప్పటికీ చాలా మంది సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికీ ఎక్కడ పని చేయాలో చెప్పలేదు. కొన్నిచోట్ల గ్రామ, వార్డు సచివాలయాల భవనాలు సిద్ధంగా ఉన్నప్పటికీ... ఫర్నీచర్ సమకూర్చలేదు. దీంతో సిబ్బంది మండల కార్యాలయాల్లో రిపోర్టు చేసి ఇళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. సచివాలయాల వద్దకు వెళ్లకుండానే గ్రామ, వార్డు వలంటీర్లను సంప్రదించి సర్వే కార్యకలాపాలు చేపడుతున్నారు.







## 'ఐటీ గ్రిడ్' పై కొనసాగుతున్న సిట్ విచారణ

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ డేటాకు సంబంధించి గతంలో వచ్చిన ఆరోపణలపై మెస్సర్స్ ఐటీ గ్రిడ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై వచ్చిన ఫిర్యాదుపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారని కేంద్ర ఐటీశాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ వెల్లడించారు. గురువారం రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు. ఈ కంపెనీపై 2019 ఏప్రిల్ 12న ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రస్తుతం ఈ కేసును సిట్‌తో తెలంగాణ ప్రభుత్వం విచారణ జరిపిస్తోందని తెలిపారు.

## జయరాం, అచ్చయ్య సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ సాధారణ పరిపాలనశాఖ అధికారులైన జయరాం, అచ్చయ్యలను నవంబరు 22వ తేదీన సస్పెండ్ చేసిన ప్రభుత్వం... ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వారు చేసిన తప్పునకు పశ్చాత్తాపపడ్డారని, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని వారు సంజాయిషీ ఇవ్వడంతో సస్పెన్షన్ ఎత్తివేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాహ్ని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.